ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక




4 అణాలు

12-5-'54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



హిందూస్థాన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో భారతీయుల డిజైన్‌తో నిర్మించబడిన ట్రైనర్ విమానము.




హిందూస్థాన్ ఎయిర్‌క్రాఫ్ట్‌వారిచే నిర్మించబడిన మూడవ తరగతి రైలుపెట్టె.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 35
12-5-54

జయ వైశాఖ శుద్ధ దశమి బుధవారం



'అఖిల బాతు జాతుల మహాసభ'—అత్యవసర సమావేశం

ఫొటో: బి. రంగనాథన్ (మద్రాసు).

కాలక్షేపం

“కలిత దుకూల వస్త్రములు
గట్టిన నీకును, జీర్ణవల్కలం
బులు ధరియించు మాకును
బ్రమోదము తుల్యము;- లేదువాసి; య
గ్గలమగు తృష్ణ యెవ్వనికి
గాఢ దరిద్రుడు వాడు;-లేమియుం
గలిమియు లేవు సమ్మద
వికస్వర మానసులైన వారికిన్.”

తా॥ నగిషీపని గల చీనాంబరములను ధరించేటటువంటి నీకున్నూ (అనగా రాజుకును), చెట్లయొక్క పట్టలనారతో తయారుచేసిన గోనెగుడ్డలవంటి చిరిగిన ముతక పేలికలను కట్టుకొనెడి మాకున్నూ సంతోషము సమానము. ఏమీ భేదం లేదు. ఎవనికి అత్యంతమైన ఆశఉన్నదో వాడే అత్యంత దరిద్రుడు. మనస్సు ఎవనికి సంతుష్టితో పుష్టిగా ఉంటుందో అటువంటి వానికి దారిద్ర్యమూ లేదు. అయిశ్వర్యమూ లేదు.

కడుపు కూడు లేనివానికి గంజియే పానకముగా ఉంటుంది. నడివేసంగి ఎండలో నడచి నడచి నాలుక తడి ఎండినవానికి చల్లని మంచినీళ్లు ఏ చలిపందిరియందైనా లభిస్తే దానినే అమృతప్రాయంగా త్రాగి, లేచిపోతున్న ప్రాణం తిరిగి వచ్చిందంటాడు. అటి నడివేసంగిదినాలలోనే కడుపులో నీళ్ళు కదలకుండా, చల్లని సిమ్లా కొండలమీది హోటలు భవనంలో వెచ్చని కాఫీ త్రాగి, “హాయి! హాయి!” అని సిగరెట్టును కాల్చి పీల్చి,—లోకమును త్రేల్చి మాడ్చెడి ఎండభయమునుమాడ్చి భస్మము చేసి,—తనకు ఆహ్లాదమును గూర్చిన సిమ్లా కొండలగూర్చి తలపోయుచు, ఆ హోటలులో అహోరాత్రాలు గడపుతూ, ఎండ కన్నెరుగని అంతఃపురస్త్రీలవలె కాలక్షేపం చేస్తూ, వాడవాడలవారు 116 డిగ్రీల వేడికి వాడినా మాడినా వడగాడ్పులకు ప్రాణాలు వీడినా, ఆ ఉష్ణమానమువల్ల తనకు ప్రాణభంగం లేకుండా, ఆచలికొండలమీద కైలాసంవాసవిలాసం అనుభవించేవాళ్లు ఉన్నారు. శరీరము ఎండకు తాళుకోగల్గినయెడల, చలికి తాళుకోగల్గినయెడల, అది నిజంగా చెక్కుచెదరని ముక్క పోవని ఉక్కుముక్కయని నొక్కివక్కాణించవచ్చు. శరీరదార్ఢ్యం విషయమై ఆలోచిస్తే, అటువంటివాళ్లకు జీవిత భీమా చెయ్యడం సులభం.” ఉప్పరివానికి కొమ్మలనీడ ఉంటే చాలు సిమ్లాహోటలులో ఒకగది ప్రత్యేకంగా లభించినట్లుగా ఆనందిస్తాడు. ఆకొమ్మ కొకగుడ్డను జోలెవలె వ్రేలాడగట్టి అందులో బిడ్డను పరుండబెట్టి జోలపాడుతుంది ఆ ఉప్పరవాని భార్య. ఆబిడ్డ ఆచెట్టునీడ క్రింద జోకొట్టినట్లుగా నిద్రపోతుంది. అయితే, సిమ్లాకొండకు పారిపోయి “పాహిమాం! పాహిమాం!” అని తలదాచుకొన్న తరుణవయస్కుడు లేత తమలపాకువంటి సునిశిత సుకుమార శరీరుడు. ఈ వసంతంలో అతడు సేవించేది వసంతకుసుమాకరం కావచ్చు. ఎండ సోకితే నాజూకు శరీరం ఆగలేదు. పెద్ద గాలి సోకినా తూలిపోయే హంస తూలికవంటి తేలిక శరీరం అది. కష్టమున కోర్వలేదు. కష్టపడలేదు. సుఖములు పలుముఖములుగా అనుభవిస్తూ సుఖపడవలెననే సూత్రంతో, జీవితయాత్ర నడుస్తుంది. చివరకు పర్యవసానం ఏమిటంటే ఎలెక్ట్రిక్ ఫాన్‌లూ (విద్యుత్ పంకాలు), అయిస్ క్రీములు (హిమపాయసములు), ఎయిర్ కండిషన్డు రూములు (శీతవాత మందిరములు) యివన్నీ అభ్యాసమైనకొలదీ, ఎండలో అడుగుపెట్టడం ఆయాసంగా, ప్రయాసంగా ఉండి, ఎండపేరు చెప్పితే గుండెలో గుండుపడినట్లవుతోంది. ఈ సౌభాగ్యాలూ సౌఖ్యాలూ సౌకర్యాలూ అలవాటులేనివాళ్లు వీటినే పోకులంటారు. పోకు లెక్కువైనకొద్దీ ఎండ సోకినా ఆగలేరు గాలి సోకినా ఆగలేరు. పోకు లెక్కువైతే నాజూకు బలమవుతుంది. నాజూకు బలమైతే, శరీరం దుర్బలమవుతుంది. సుఖాలవల్లనే రోగాలు. ఎండ సెగకు తాళలేని సుఖరోగాలు అంటువ్యాధివలె వెంటబడతాయి.

ఇంతకూ పర్యవసానం ఏమిటంటే, శరీ

విషయానుక్రమణిక

ముఖచిత్రం: అశ్వరాజ్ వారి “అన్నదాత”లో అమ్మాజీ.

సవరణ

గతవారం ముఖచిత్రం ‘మా రాజోశ్రీ’ అని సవరించుకోవలెనని పాఠకులకు మనవి. —సం॥

రాన్ని కల్పితకృత్రిమ సౌఖ్యాలవల్లనూ, సౌకర్యాలవల్లనూ, సుఖపెట్టనకొలదీ, శరీరం సుఖపడి సుఖపడి చివరకు సుకుమారమై, భారమై పోతుంది. ఈ అలవాటు చేసి చేసి సుఖం పర్వత శిఖరం ఎక్కినకొలదీ, భీమునివంటి దోర్బల పరాక్రముడుకూడా దుర్బలుడవుతాడు. ఆరోగ్యం భగ్నమై అగ్నిమాంద్యం ఏర్పడితే, యీ అగ్నిమాంద్యంతో అన్ని మాంద్యాలూ అవతరిస్తాయి. సుఖం అనుభవించాలని సాధకంచేస్తే దుఃఖం వెంటబడి నట్లయింది.

కస్తూరి గణపతి అనే పేరుతో ఒక ఊరి వెలుపల పాడుపడిన విఘ్నేశ్వరాలయం ఒకటి ఉండేది. దానికి ఏవిధంగానైనా ద్రవ్యనిధి సమకూర్చి తిరిగి పూజా పునస్కారములు జరిపించవలెనని ఒక గడుసు పెద్దమనిషి సంకల్పించాడు. ఆ ఊరిలో ఉన్న పెద్ద ఆసాము లందరితోను ఒక విషయం వెల్లడి చేశాడు. "అయ్యా! గత రాత్రి నాల్గవజామున నాకు స్వప్నములో కస్తూరి గణపతి ప్రత్యక్షమైనాడు. తనకు యీ గ్రామస్థులందరూ నిలువనీడ లేకుండా చేశారనిన్నీ, తన బొడ్డులో ఉన్న కస్తూరి పరిమళము పాపాత్ములైనవారికి ప్రాప్తించదనియు, ఈ వినాయకుని పూజించని గ్రామస్థులు బహునాయకత్వంవల్ల ఎడబాయని కడగండ్ల పాలవుతారనియు, తన తొండము పైకెత్తి నా నెత్తిపై మొత్తి, తన ఆజ్ఞ శిరసావహించవలసినదని ఉత్తరువు చేశాడు. ఆ స్వామి మహిమ మనము గ్రహించలేకుండా ఉన్నాము. కస్తూరి గణపతిబొడ్డువద్ద ఒక రంధ్రం ఉంది. దానిలో వేలు పెట్టి నేను చూచాను. అత్యద్భుతమైన కస్తూరివాసన గుప్పుమని ఘుమఘుమలాడింది" అని అందరికీ వెల్లడించాడు. మరునాడు, ఆ గ్రామంలోని పెద్దలూ పిల్లలూ ఆ బాలగోపాలం పాడుపడిన కస్తూరి గణపతిగుడివద్దకు చేరారు. పతివ్రతలైన స్త్రీలు ఎవరైనా సరే ఆ వినాయకుని బొడ్డువద్ద వేలు పెట్టితే కస్తూరివాసన తప్పక ఘుమాయిస్తుంది అని ఆ పెద్దమనిషి తన స్వప్నవృత్తాంతము మళ్ళీ జ్ఞాపకం చేశాడు. పెద్ద ముత్తయిదువలు ఒక్కరొక్కరే అందులో వేలుపెట్టి వెంటనే వేలును బయటకులాగి ముక్కువద్ద పెట్టుకొని, "అబ్బా! ఏమివాసనే అమ్మ!" అని అరుస్తూ వెళ్ళిపోతున్నారు. ఈ ఆడవాళ్ళమధ్యలో, ఒక ఆతతాయి పిల్లవాడు ముందుకువచ్చి, ఆ కన్నంలో వేలు పెట్టగానే, "అమ్మ బాబో!" అని ఒక్క పెట్టున గుక్క తిప్పకుండా ఏడ్చాడు. "అమ్మా! తేలు కుట్టిందే! పోట్లు పొడుస్తున్నవే" అని ఆ బాధకు నిలువలేక నిజంచెప్పి రోదన సాగించాడు. తల్లిప్రాణం తల్లడిల్లిపోయింది. "ఆ పాడు గుడిలోని పాడు విఘ్నేశ్వరుని కన్నంలో ఎందుకు వేలుపెట్టినావు నాయనా! అందులో ఎన్ని తేళ్లు ఎన్నాళ్లనుంచీ కాపురం చేస్తున్నాయోగాని నన్ను కూడా కుట్టింది. ఎవడితో చెప్పుకునేది నాయనా? మంత్రాల శేషయ్యగారి చేతనైనా మంత్రం వేయించుకుందాం - రా నాయనా!" అన్నది. ఆ పిల్లవాని రోదనవల్ల, తేలు కుట్టనదనే నినాదం సత్యవాదమయింది. కస్తూరి పరిమళిస్తున్నదనే నినాదం అసత్యవాదం అయింది "నన్ను కూడా కుట్టింది తేలు" అని ప్రతివారూ చెప్పడంవల్ల నిజం పైకితేలింది.

కస్తూరి గణపతి నిజంగా ఎక్కడైనా ఉంటే ఉండవచ్చు. కాని వేలుకు తేలు కుట్టినవాళ్లు వేనకువేలు "అబ్బా! ఏమి పరిమళము! ఏమి సువాసన!" అని లోపల ఏడుస్తూ పైకి వేలు జాడిస్తూ కపటనాటకం ఆడడం ఆత్మవంచన అవుతుంది.

ప్రతిరోజూ పాదుషావలె పన్నీటిలో స్నానంచేసి, అత్తరుతో దీపం వెలిగించి, కస్తూరి ధూపం వేసి, దవనంతో కట్టిన విసనకర్రలో ఆ దవన పవనం అనుభవిస్తూ, మల్లెపూల పాన్పుపై శయనించి, "ఘన తాపహార సంతత మధురాధర సుధారస ధారల గ్రోలుటన్" జేసి, మనకు క్రమక్రమంగా శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానమై (కాదు కాదు - నిశనిశ ప్రవర్ధమానమై) ఆయుస్సు, వయస్సు, వర్చస్సు, మేధస్సు, మనస్సు, ఓజస్సు, తేజస్సు వికసించి, విస్తరించి, వృద్ధి యగునా? ఆ విషయమై కూలంకషంగా స్వవిషయంలో సత్యాన్వేషణంచేసి నిజం చెప్పి ఆత్మజీవితానుభవ సత్యమును ధైర్యంగా ప్రకటించగల మహాత్ములు ప్రపంచంలో ఎందరున్నారు?

"ఎందరో మహానుభావులు అనే మాట నిజమే. కాని ఆ కృతి పాడుతూఉంటే, ఆ శ్రీరాగంలో ఉన్న సుఖశ్రీ ఏమిటో చెప్పగల మహానుభావులు. కొద్దిమంది మాత్రమే. శ్రీ యనురాగం ఆనందంగా అనుభవిస్తున్న శ్రీమంతులందరూ సుఖశ్రీని అనుభవిస్తున్నారనే ఎంచి, వారి చుట్టూచేరి జనులు భజనలు చేస్తున్నారు. కాని శ్రీరాగంలో సుఖం అనుభవించిన మహానుభావులు ఎందరో కన్పించరు. శ్రీయొక్క రాగం గతితప్పి సుఖరోగంగా పరిణమించిన సంగతి లోకం విలోకించదు. అందుకనే ఈ గుడ్డిలోకం గ్రుడ్డి ఎద్దు చేనిలో బడినట్లుగా అడ్డమైన గడ్డి తిని, బందెలదొడ్డిలోకి చేరుతూ ఉంటుంది.

ఒక రైలు ప్రయాణీకుడు మరొక రైలు ప్రయాణీకునితో!

—"అదేం పాపం చేతికి కట్టు కట్టారు—విరిగిందా?"

"అవునండీ"

"ఎక్కడైనా పడ్డారా?"

"లేదండి—నా వీపు నేనే చరుచుకోబోయాను."

"అదేం; ఎందుచేత?"

"ఆరోజు రోజుఅంతా యితరులనిగురించి ఏడవటంమానేసి, నావిషయం నేను చూసుకోగలిగాను."

* * *

"నెరసిన వెంట్రుకలకి యీ మందు బాగా పనిచేస్తుందంటారా?"

"ఓ! అన్నీ పోతాయ్!"

కాఫీ హోటళ్ళలో ఆరగించినదంతా సారవంతమైనదే అని సర్టిఫికెట్టు యిచ్చేదెవరు? దానిని మెచ్చి అచ్చువేయించేదెవరు? కాఫీహోటలు పెట్టిన ఆసామీ తన కాఫీహోటలులో చేసిన చిరుతిండ్లలో విరివిగా విటమిన్లు (జీవ ధాతువులు) చేరియున్నవంటాడు. తన గరం గరం పకోడీలు విటమిన్ల సాగరం అంటాడు తన పెసరట్టు రసరాట్టు అంటాడు. తన మైసూరుపాకం తింటే కర్మ పరిపాకం అవుతుందంటాడు. తన ఇంద్రభవనంలో ఏది ఆరగించినా స్వర్గానికి బెత్తెడు ఎడంగా ఉంటుందంటాడు.

ఇది వ్యాపార ప్రపంచం. ఎవరి సరకు అమ్మకం వారు చూచుకోవాలి ఎవరి సరకును వారు ప్రశంసిస్తారు. అది వారి బ్రతుకు తెరువు. కాని వారి మాటల నన్నింటినీ సరకుచేయడం మనకు బ్రతుకు తెరువు కాదు. కాఫీ కషాయం సర్వ జీవధాతు నికాయం అని కాఫీ వర్తకులు ప్రకటిస్తారు. దానికి పై పోటీ "టీ" అంటారు టీ తోట యజమానులు. అందాకా ఎందుకు? మద్రాసు రాష్ట్రంలో గత యుద్ధకాలంలో 1942 సం॥లో శ్రీమాన్ సి. రాజగోపాలాచారిగారి కాంగ్రెసు మంత్రివర్గం రాజీనామా యిచ్చినప్పుడు,

★ కాలక్షేపం ★

అడ్వయిజర్ల ద్వారా గవర్నరు తన ప్రభుత్వం సాగించాడు. సి. రాజగోపాలాచారిగారు అప్పటికే కొన్ని జిల్లాలలో మద్యనిషేధం అమలుపరచియున్నారు. కాని, అడ్వయిజర్ల ప్రభుత్వం రాగానే, కల్లు దుకాణాలు మూసినచోటతిరిగి తెరువవలెనని వాదించారు. కల్లులో "బి" వైటామిన్ అనే జీవధాతువు ఉన్నదనిన్నీ, ఆ జీవధాతువు మానవ శరీరానికి అత్యంతావశ్యకమనియు "భేరికా! దాండడ డాండడాండ నినదంబు లజాండమునిండ మత్తవేదండము నెక్కి చాటెదను" అన్నట్లుగా గడగట్టి గెజెట్టులో ప్రకటించారు. ఎవరు? ప్రజాప్రభుత్వ ప్రజాపటుత్వ శ్రేయోభిలాషు లగు అడ్వయిజర్లు- ప్రజల ఆరోగ్యం బాగుపడేదారులు చూపిన సలహాదారులు - కాని ఉన్నమాట అంటే ఉడుకెక్కువ ఎవరికైనా.

ప్రపంచం అంతా వ్యాపార సరళి ప్రపంచంఅయింది. సరళంగా గరళం త్రాగిస్తుంది. అమెరికాయైనా, ఆస్ట్రేలియాయైనా, ఆర్యావర్తం అంటే అనురాగంచేత తమ సరకులను మనకు సరఫరా చేయడంలేదు. సరకు బాగా అమ్మకం అయితే సత్యనారాయణ వ్రతంచేసి, చక్కెర బాగా కలిపిన చక్కని గోధుమరవ్వ ప్రసాదం ఎంతయినా పంచిపెడ్తారు. సత్యనారాయణ వ్రతాలు చేస్తారు. వెనుకబడిన దేశాలను ఉద్ధరించడమే మా కర్తవ్యం, మా దీక్షా కంకణం అంటారు. కాని, యీ వ్యాపార ప్రపంచంలో "సత్యమేవ జయతే" అని జపించేది భారతప్రభుత్వం ఒక్కటే. కాని, తెల్లజాతులవారు అబద్ధాలు పలికినా, ఇంగ్లీషు భాషలో దానిని *White lie* (శుద్ధ పాడ్యమి అన్నట్లుగా శుద్ధ అబద్ధం) అంటారు.

ఈ వ్యాపార ప్రపంచంలో ఎంత లాభం వచ్చినా, వారి లోభం, తీరని దాహం. తీరం లేని ప్రవాహం. అయితే, గోచీ పెట్టుకొన్న స్వాములవారికి కూడా పెంచుకొన్న కొలదీ ఎస్టేటు విస్తరిస్తుంది. గోచీని ఆరవేస్తే ఎలుకలు కొట్టివేయడం ఆరంభించాయి. ఆ ఎలుకలను పట్టుటకు పిల్లిని పెంచవలసి వచ్చింది. ఆ పిల్లిని పాలు పోసి పెంచవలసి వచ్చింది. పాలకోసం ఆవును తెచ్చి మేత వేయవలసివచ్చింది. దాని గడ్డికొరకు పొలము కొనడం సంభవించింది. పొలాన్ని రైతులకు కవులుకిచ్చి లెక్కలు వ్రాయించి శిస్తులు వసూళ్లు చేయించడం అవసరమైంది. అందుకొక రాణాదారును ఏర్పాటుచేస్తే అతనికొక మహాల్జీ, డఫేదారు వగైరాలు కావలసివచ్చింది. వీరందరికీ జీతబత్తెములనిచ్చుటకు మరొక నాలుగు యకరాల భూమిని సేకరించవలసివచ్చింది. ఈవిధంగా గోచీ వ్యవహారం పెద్దదై జమీందారీ దర్జాలోకి దిగింది. పెద్దపెద్ద పీఠాధిపతులకూ, సర్వసంగ పరిత్యాగులైన స్వాములకూ గజ తురగ కనక వస్తు వాహనాదులతో సహా ఖజానా ఏర్పడడం సంభవిస్తోంది. ఖజానా చేరినచోట ఖరాబు అవుతుందనే మాట ఖరారు. అందుకనే ఖజానా ఉన్నవారికి జనానా లేదా? లేదా?అనే సోదా లోకం ప్రారంభిస్తుంది. "కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః" అనే మాట అనేక మతాల మఠాలకు వర్తించవచ్చు.

సర్వసంగ పరిత్యాగియైతే, మహారాజయోగం అబ్బినదంటారు. మహారాజుకు ఏర్పడిన గుర్రాలశాలలు, ఏనుగుల మహాలు, పీల్ఖానా, గాడీఖానా, కార్ఖానా అంతా యీ మహారాజయోగంలో కౌపీన ధారునకుకూడా ఏర్పడినట్లయితే,

"కలిత దుకూల వస్త్రములు
కట్టిన నీకును, జీర్ణవల్కలం
బులుధరియించు మాకును
ప్రమోదము తుల్యము;- లేదు వాసి"

అనే మాట అక్షరాలా నిజము.

కాని, తర్వాత చెప్పిన భరతవాక్యమే అసలైన భరత వాక్యం.

"అగ్గలమగు తృష్ణ ఎవ్వనికి గాఢ
దరిద్రుడు వాడు."

ఇదే సర్వోదయ సమాజంలో సభ్యుడైన అమరజీవి పొట్టి శ్రీరాములుగారి జీవితం బోధించిన పాట్టివాక్యం. అదే భారతదేశం లోకానికి అనవరతం బోధించే భరత వాక్యం. ★

కర్నూలులో ఎండమావులు

రాజధానీనగరం అయిన కర్నూలులో ప్రస్తుతం ఉద్యోగాల గొడవతప్ప వాతావరణంలో మరే ఇతరమైనసంచలనం కాని గోచరించడం లేదు.

రాజధాని ప్రాసు ఎత్తానుకదూ?—ఆమాట అంటే మరేదో జ్ఞాపకంవచ్చింది. మామూలు కర్నూలు రాజధానిగా మారిపోయినా ఇక్కడి ప్రజలలో వివిధమైన నవోత్సాహం కానీ తలెత్తలేదు. దానికికారణం-అసలు ఆసంగతి చాలమందికి తెలియకపోవడమేనని నా విశ్వాసం. అలా అంటే 'మమ్మల్ని అపహాస్యం చేస్తావా'అని కొందరు ఆగ్రహించవచ్చు. అట్లాంటివారికి ఒక సంగతి చెబుతాను - వినండి!

మాఊళ్లో సంగతి ఇది. మాఊరూ ఆంధ్ర దేశంలోని అనేక వేల ఊళ్లకు ఏమాత్రమూ తీసిపోదు. ఆరోజుల్లో ఆఊళ్లో చదువుకున్నవాడిని నేనే! 'చదువు' అంటే - మా పాలేరుగాపనిచేసి ఉత్తరోత్తరా కీర్తిశేషుడు అయిన వెంకన్న పరిభాషలో 'ఇంగిలిపీసు సదువు'అన్నమాట. అజ్ఞానంలో పడి కొట్టుకొంటున్నసోదరమానవాళికి విజ్ఞానంఅందించే ఆసక్తితో అనేక విషయాలు బోధిస్తూ ఉండేవాడిని - ఆరోజుల్లో. ఒకపర్యాయం ప్రపంచంలోకల్లా ఎత్తు అయిన భవనం ఏది, దాని ఎత్తు ఎంత అనే ప్రశ్నలు చర్చలో ఉత్పన్నమైనాయి. అమెరికాలో 'ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ సంగతే', దాని ఎత్తూ చెప్పాను. అంత ఎత్తుయిల్లు కట్టాలంటే ఎంతలోతు పునాదితవ్వాలో అని మావాళ్లు ఆశ్చర్యపడ్డారు. అంత లోతు పునాదులు త్రవ్వటం సాధ్యమా అని మావాళ్లు లెక్కలుకట్టి, నా బుర్ర పాడుఅయిపోయినట్లు తేల్చేశారు. ఆతరువాత ఎవడు పట్టితే వాడు విజ్ఞానసంబంధమైన విషయాలకు నాదగ్గరికి వెళ్లమని ఇతరులకు సలహాలిస్తూ తమాషా చూచి ఆనందించడం వారికి పరిపాటి అయింది.

మా పాలేరు వెంకన్న మాత్రం నేను చెప్పే ప్రతి ముక్కా వింటూ తలఊపుతూ ఉండేవాడు. ఆ రోజుల్లోనే 'ఒకసారి' మనదేశానికి స్వతంత్రం వచ్చింది. అమాటే నేను మా వెంకన్నతో చెప్పాను:- "ఒరే వెంకా! మనకు స్వతంత్రం వచ్చిందిరా" అని. మా వెంకన్న "సిత్తం; రానీయండి" అని తల ఆడించి వూరుకున్నాడు. వెంకన్న నామాట నమ్మలేదు సరిగదా, గ్రామస్థులకు నాపట్ల కొత్తగా ఏర్పడిన 'సదభిప్రాయం' నిజమే అయిఉండవచ్చుననికూడా అభిప్రాయపడ్డాడు.

కర్నూలు రాజధాని కావడం మాట సహితం అట్టిదేవిమోనని నాకు అనిపిస్తుంది. ఏమంటే - పత్రికలు చదివేవాళ్లు బాధపడినంత ఎక్కువగా ప్రజాసామాన్యం రాజకీయాలు గురించి తల్లడిల్లరు. కర్నూలు రాజధాని అయినమాట వాస్తవమే. వెంకన్న వంటివారు దానిని నమ్మకపోయినా మనకు పోయేదిలేదు. కాని కర్నూలు చూచినవారు మాత్రం ఇది రాజధానినగరం అని అనుకోలేరు. ఇతరులు ఎవరైనా నచ్చచెప్పడానికి ప్రయత్నించినా ఒక పట్టాన నమ్మలేరు.

రిక్షా లాగుతూ తద్వారా పొట్టపోసుకుంటున్నట్లు భ్రమపడుతూ శరీరం గుల్ల చేసుకుంటున్న ఒకానొక ఆసామీ కొలది రోజులక్రిందట సరిగా దీన్నిగురించే అన్న కొన్ని మాటలు తెలుసుకోవడం మంచిది.

"సినీమాహాల్సులో ఇదివరకు నేల టిక్కెట్టు నాలుగు అణాలండి. అమాట కొస్తే దేశంలో ఎక్కడఅయినా నాలుగు అణాలే. ఈ వూరు రాజధాని అయినతరువాత ఒక అర్ధణా పెంచారండి బాబూ. కూర్చోవడం మాత్రం వట్టి నేలమీదే" అంటాడు.

ఆరకమైన చెడు ఫలితాలు కొన్ని మరీ విపరీతంగా ఉంటవి. ఒకనాడు జట్కాబండితోలే సాయబుతో "నీ బండిగూడు ఊగిపోతూఉందేమయ్యా?...రాజధాని వచ్చాకకూడా ఇలాంటి గూడుబండేనా?" అని నా మిత్రుడు ఒకాయన అనడం తటస్థించింది. దానికి బండిసాయబు "రాజధాని వచ్చినతరువాతనే గూడు పాడుఅయిపోయింది, మహారాజ్" అని సమాధానం ఇచ్చాడు. కర్నూలు రాజధానికావడానికి, గుర్రంబండి గూడు ఊగిసలాడడానికి గల సంబంధం అతగాడు వివరించనూ లేదు; అందుచేత నాకు తెలియనూలేదు.

కర్నూలునగరంలో ఎండవేడి మూలంగా శరీరంలో లేచే మంటలుతప్ప చెప్పుకోదగిన మరే ఇతరవిశేషమూ ప్రస్తుతం గోచరించడం లేదు. ఒకరకంగా చూస్తే ఈసూర్యాతపంవల్ల ఇతర ఆతపాలన్నీ నశించిపోయినట్లు తోస్తూంది.

ఆఖరికి "కర్నూలులో ఎలుకలు తక్కువసుమా" అన్నానసరే, తన ఊరిమీద విమర్శ ఏదో చేస్తున్నామనే నమ్మకంతో "మీ ఊళ్లో ఉన్నాయనా నీవు చెప్పేదిం ఇక్కడా ఉన్నాయిలే. మాకు ఎలుకలకే? కొరతలేదు" అంటూ కసిరికొట్టే ఒక మిత్రుడు సహితం "రాజధాని మూలంగానే మాకు అన్ని ఇబ్బందులూ వచ్చాయి. లేకపోతే ఏప్రిల్‌లో ఇంత ఎండలేమిటి? మీరు ఈ రాజధాని ఎక్కడికి అయినా తీసుకుపోయినా బాగుండును. ఇంతకీ ఇది కావాలని మేము అడిగామా, పెట్టామా" అనడంలోకి దిగాడు. ఇక్కడ ప్రతి ఏడాదీ మే నెలలో కాని ఇంత ఎక్కువ ఎండ కాసే అలవాటు లేదట. ఈ ఏడాది అది కూడా తారుమారు అయింది.

ఆంధ్ర ప్రభుత్వం మనుగడకీ ఎండకీ ఏదో సంబంధం ఉండిఉండాలి. లేకపోతే ప్రముఖమంత్రిగారు ఉదకమండలానికి పరుగెత్తుకుపోవడము, మంత్రులు అందరూ శేషు కట్టకట్టుకొని విశాఖపట్టణానికి వెళ్ళనుండడము, ఆఖరికి శాసనసభకూడా సమూలంగా విశాఖపట్టణంలో తిష్ఠవేయనుండడము ఇదంతా జరుగకపోను.

ఈ ప్రభుత్వం పనిచేస్తున్న విధం చూస్తే వెనుక ఏనాడో చదువుకున్న కథ ఒకటి జ్ఞాపకం వస్తూన్నది. అది ఏమిటంటే ఒకానొక రైతు తన పొలంలో పండించిన వంకాయలు తీసుకుని రాజధాని నగరానికి వచ్చాడు. మార్కెటులో సరకు పెట్టిన కొద్దిసేపటికే రకరకాలఅధికారుల మామూళ్లకని తెచ్చిన సరకు అంతా ఖర్చుఅయిపోయింది. ఈ వరసచూచి అతగాడు బండీ ఎద్దులు విక్రయించి దానివల్ల వచ్చిన డబ్బులో ఇత్తడిగేటు ఒకటి కట్టించి ఊరుచివర రహదారిమీద పెట్టించి గేటుపన్ను వసూలు చేయడం ప్రారంభించాడు. గేటుకు అవతల నూయి. ఆ నూయే ప్రజలకు ఆధారం: కనుక రద్దీ ఎక్కువ. దాంతో అతనికి ఆదాయం విశేషంగా వస్తున్నది. ఒకనాడు రాజుగారు అభ్యంజన స్నానానికి కూర్చున్నారు. సగంలో నీళ్లు అయిపోయినాయి. దాసీ నీరు తేవడానికి పరుగెత్తింది. తిరిగి రావడం ఆలస్యమైంది. రాజుగారు మండిపడ్డారు. దాసి గేటు సన్న పట్టుకొని వెళ్ళడం మరచిపోయినకారణంచేత ఆ ఆలస్యం అయినది. రాజుగారు విచారణ జరిపారు. గేటుపన్ను వసూలుచేసే అధికారం ఆ రైతుకు ఒకరిచ్చినది కాదని, అతగాడు

(54-వ పేజీ చూడండి)


వంట నేర్పిన భర్త

"ఎన్నాళ్ళయింది శుభ్రంగా వంటలు నా చెయ్యడం రాగూకదా! ఛీ ఛీ- ఏమిటీ కూర! యిది వంకాయకూరేనా? దాని రుచి, అంతా చెడగొట్టేశావు! శెనగపప్పూ, బొబ్బర్లూ, అల్లం, పచ్చిమిరపకాయలూ గుమ్మడొడియాంముక్కలూ, యివన్నీ దాని హంగులు! అవి వుంటే నే వంకాయముద్ద. రాత్రికి నేను తయారు చేసాను చూడు! ఆవేళ తిన్నావు తెలీదూ!" అని గొణుగుతూ అంటున్నాడు చంద్రం, అన్నానికి కూర్చొని కూర్చోకముందే!

ఇలా అంటాడని కమలకి తెలుసు. కమల భయపడుతూనే వుంటుంది అయినా ప్రతి రోజూ చీవాట్లు తప్పవు మెతుకు మెతుకూ ఎంచి అంతా కొర్కాని చెబుతూనే వుంటాడు అది తనకి క్రొత్తకాకపోయినా ఆడదయిన తర్వాత వంటవిషయంలో - ఆ డిపార్టుమెంటుతో సంబంధంలేని మొగవాడు ఎత్తి పొడుస్తూ ఎంచుతూంటే ఏ స్త్రీ సహిస్తుంది! దానికన్నా అవమానం వేరేవుందా?

నిజానికి చంద్రం బాగానే వండగలడు. గవర్నమెంటువారి పుణ్యమా అని యీ బేసిక్ ట్రయినింగులో ఆరితేరిన అయ్యవారి పెళ్ళాలందరికీ యీ సుఖం లభించింది - అసమిటే అంటే కాళీగా వుండే మూడురోజుల్లోనూ కడుపులో చల కదలకండా నవరుచులతోనూ, నాలికమీద పెట్టుకుంటే జిహ్వ లేచి వస్తుందా అన్నటువంటి భోజనం దొరుకుతుంది - సాధారణంగా ఆడవాళ్లకటువంటి భోజనసుఖం అబ్బడం మహా అదృష్టమన్నమాటే! ఆ మూడురోజులూ భర్త వండిన అన్నం తినేకన్న ఉపవాసం నయం అనుకున్నవాళ్ళూ వున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బేసిక్ ట్రయినింగ్ అయిన అయ్యవారిని వరించిన ఆడదానిదే అదృష్టమంతాను. దానికి వాళ్ళెటువంటి నోములు నోచేరో!

అటువంటి వాడే చంద్రం కూడా - కమలకి ఆ భాగ్యం కలగడం బాగానేవుంది గాని, రోజూ భర్త వంటతానన్నా వుంచగలడా - అందుకే తను వండి నానా తిట్లూ



తింటున్నాది. చంద్రం వండడం ఎలాగూ మానడు. ఎందుకంటే తనకి ఆ వేళలో బరి వుండదు కాబట్టి, వృత్తినే అలా వుంటే తోచదుట! ట్రయినింగు స్కూల్లో అలవాటవడంవల్ల మనస్సు వంటింటివేపే వుంటుంది! అక్కడికీ కమల బొత్తిగా ఒప్పుకోనప్పుడు, అలాగూ, యిలాగూ, అని చెబుతూనే వుంటాడు. కమల వప్పుగుంటే రోజూ రెండుపూట్లా వండడానికి తనకేమీ అభ్యంతరం లేదు.

కమలది అమృతహస్తం వంటలో ఆమె అన్నపూర్ణ, అన్నివిషయాల్లోనూ ఆమెలో ఏదో వొక ప్రత్యేకత వుంటూంటుంది. అయినా భర్తదగ్గర మెప్పు పొందలేకపోతున్నాది ఇహ శని ఆదివారాలు వచ్చేయంటే, చంద్రం గిన్నె గరిటా వదలడన్నమాటే! ఆ వేళ ఒక గండం, పోనీ ఏదో వండి పడేస్తాడా అంటే కమలని వదుల్తాడా! దగ్గర కూర్చోబెట్టుకొని పాకశాస్త్రం అంతా చెప్పి వల్లించమంటాడు! అతని వుపదేశం యీమె పాకం అయేటప్పటికి తద్దినం భోజనంలాగా ఏ మూడో, నాలుగో అవతరిసిందే!

ఆదివారంనాడు వంటసరంజా అంతా చుట్టూ పేర్చుగొని కూర్చున్నాడు! కమల చేతులు కట్టుగొని వింటూ నిలుచుంది—

చంద్రం ఉపోద్ఘాతం మొదలెట్టేడు.

"వింటున్నావా! యివాళ పులిహోర చేస్తాను! నేను బేసిక్ ట్రయినింగవుతున్నపుడు నాలా ఎవరూ వంట చెయ్యలేకపోయేవారు; నేను వంటషేప్‌లో పడ్డానంటే - ఆ వేళ అందరికీ ఓ పెద్దపండగలాగూ సంతర్పణలాగూ వుండేది! నా ఎడంచెయ్యి నలుడూ కుడిచెయ్యి భీముడూ అనుకో! అందులోనూ యీ పులిహోర చేసేనంటే రాసులు రాసులు ఇట్టే తినేసేవారు! ఇవాళ నీకు పులిహోర గురించి చెబుతాను విను, మళ్ళీ చెయ్యమంటే టక్కున చేసెయ్యాలి!"



నమోవాకం
చిత్రకారుడు—ఆర్. వెంకటరావు.

కమల వస్తూన్న నవ్వు ఆపుగుంటూ వింటున్నది.

బియ్యం ఎసరు పెట్టేడు. వుడుకుతోంది

"ఇదుగో చూశావా! యిప్పుడు కొంచం బిరుసుగా వుండగానే తీసి వార్చెయ్యాలి! ఆతర్వాత పులిహోర ఎక్కువ తక్కువనిబట్టి కొంచం పట్టు అంతలేసి పసుపు యిలా వెయ్యాలి!" అంటూ మూడుసార్లు వేసేడు.

"లేకపోతే ఎక్కువయిపోయి వెధవ వాసన వేసేస్తుంది!" అంటూ చాపమీద గుమ్మరించేడు—

"ఇదిగో! వెళ్ళి అయిదారు బొట్టలు చింతపండుతీసుకురా! ఎక్కువ వద్దు!" అని కమలతో చెప్పేడు. ఆమె తెచ్చి యిచ్చింది

"ఇప్పుడు చూడు!" అన్నాడు. అని చింతపండుపులుసు చిక్కగా పిసికి "చిక్కగా వుండాలిసుమా!" అని హెచ్చరిస్తూ పోసేడు.

ఆతర్వాత కరివేపాకు నాలుగంటే నాలుగే రెమ్మలు రెల్చి వేశాడు, అల్లం, పచ్చిమిరపకాయలూ, లెక్కగా చితక్కొట్టి తెమ్మని, ఆమె తేగా దాంటో వేసేడు. మినప్పప్పు, ఎండుమిరపకాయలూ, ఆవాలూ, శెనగపప్పూ ఒక గరిటెలో వేయించి ఆ పోపూ - నువ్వుల గుండా, నిమ్మకాయ రసం, వేసేడు, యింగువ, తెమ్మన్నాడు. కమల యింగువ పలుకులే వేయబోగానే అలా కాదంటూ—దాన్ని చిన్న గిన్నిలో నీళ్ళతో కలిపి ఆ పాలు తగుమాత్రం వేసి అటూ యిటూ పూర్తిగా పులిహోర పోసుఅంతా కలిపేడు.

"ఇహ రుచి చూడు నీ జన్మలో ఎరుగుదువేమో!" అన్నాడు గర్వంగా— యిద్దరూ రుచి చూశారు. కమల ఏం చెప్పగలదూ? అమోఘంగా కోవిలసద్దెలాగుంది! తన మొగుడేకదా యింత ప్రజ్ఞావంతుడని లోలోనే మురిసిపోయిందో యేమో గాని,

వంట నేర్చిన భర్త

పైకిమాత్రం పులిహోర పిడచ ఒకటి చేసి చంద్రంనోట్లో మహా నాజూకుగా పెట్టింది. అదే జవాబు!

కమల కింకేం కావాలి! తనకా యింట్లో వంట పని తప్పిస్తే అప్పట్లో మరే పనీ లేదు. అదీ ఏదో మిషమీద వారం మొత్తం మీద అయిదారు రోజులు ఆయనే వండేస్తూంటే అంతకన్నా అమరసుఖం ఏముంది? అదే భాగ్యం దనుకుంది. ఎన్ని జన్మలెత్తినా యిటువంటివారికే గాథ ర్తదో రకాలని దణ్ణం పెట్టుకుంటూం దేమో!

అయితే దీనికంతటికీ కారణం మరే వుద్యోగమూ దొరక్క, తగినంత చదువు చదవలేకో - హైయర్ గ్రేడు, సెకండరీ గ్రేడు ట్రయినింగుకుపోయి, అయ్యవారుద్యోగంలో ప్రవేశించడం, గవర్నమెంటువారు ఆలోచించి పెట్టిన బేసిక్ ట్రయినింగు విధిలేక అవడం, ఏలా అయితేనేమి యీ విషయంలో ఆడవారందరూ గవర్నమెంటువారికి కృతజ్ఞులయి వుండాలి. వారి ఋణం తీర్చుకోలేరు. అయితే అందరిమాట ఏమోగాని కమలకి ఒక చిన్న బాధ లేకపోలేదు.

ఈ ఒక్కదానిలోనే ఆయనగారి బేసిక్ ట్రయినింగు ప్రజ్ఞ చూపెట్టి వూరుకుంటే బావుండును! అక్కడే అయిపోయిన అలవాటుచేత ప్రతిదానిలోనూ కలగజేసుకుంటారు కద! ఇలా యింట్లో జనానా చెయ్యవలసిన పనుల్లో తను కలగజేసికొని ఆమెగారిని కూర్చోబెట్టి తనే పరిష్కారం చేస్తూంటే కమలలాంటి దెవర్తో అలా అయినప్పటికీ లొంగివుందిగాని, మరొలాటివారయితే నాలుగు రోజులకే నెత్తికెక్కరూ? కేవలం దీనివల్ల ఏమీ తెలియనివాళ్లకి సోమరితనం చేతులారా మప్పడం కదూ! ఇహను దానికే అలవాటు పడిపోతే మళ్ళీ తాతలు దిగొచ్చినా వాళ్ళు చేస్తారా? ఎందుకు చేస్తారు, అప్పుడువాళ్ళది తప్పు కాదు! ఏమనుకుంటే ఏం లాభం? అయితే ఇందులో మొగవాడిదీ తప్పులేదు. ఏంచేతంటే— పాదు తొలూకూ కొనని ఎటు తిప్పితే అటు వయిపే ప్రాకుతుంది. అది సహజం. అలాగే మొదటినుండి యేది అభ్యాసమైతే అదే అలవాటయిపోతుంది. ఆ అభ్యాసం కడతేరా వుంటేనేగాని తోచదు. ఆ తర్వాత మార్చదలుచుకున్నా మారదు!

అలాగే బేసిక్ ట్రయినింగు అయిన చంద్రం కూడా అక్కడ, వంటచెయ్యడం, గిన్నెలు తోమడం, బట్టలుతుక్కోడం, దారం తీయడం, తన వుచ్ఛిష్టం తనే ఎత్తుకోడం, తుడవడం, పెంట లెత్తడం, నీళ్లు తోడడం, పాదులు కట్టడం, యిలాటి స్వల్పమయిన పనులు నేర్చుకొనడంవల్ల అదంతా అలవాటయిపోయింది. పూర్తిగా వంటబట్టిపోయి అవి దినకృత్యాలకింద చెయ్యకపోతే తోచదు. మరో వ్యాపకం కలిగించుకోలేడు. ఎంతసేపూ వంటింటిమీదో మరో అలవాటయిన పనులమీదనో తనువు. అయితే వీటిలో కొన్ని మంచివి లేకపోలేదు. కాని అవి అంత తప్పనిసరిగా చెయ్యవలసిన, నేర్చుకోవలసిన, అవసరం లేదు. ఎందుకంటే -

ఇహమీదట ఏమోగాని యిప్పటివరకూ వంట మొదలయిన గృహ కృత్యాలు ఆడవాళ్ళే చేస్తున్నారు! గిన్నెలు తోమడానికి, తుడవడానికి యిలాటి చిల్లర పనులకి పనిమనిషి వుంటుంది, బట్ట లుతకడానికి చాకలి అందరికన్నా ముఖ్యావసరం. ఇహను కష్టపడి సంపాదించిన డబ్బుతో కూరగాయలు, దినుసులూ మొదలయినవి, కొనుక్కుంటారు, ఇది ప్రతియింటోనూ సాధారణంగా జరుగుతున్న విధానం. అయితే యిదంతా మార్చి, యీ పనులన్ని తనే చేసుకుంటామంటే అది ఎందుకోసం? దానివల్ల ఖర్చు తప్పదు, డబ్బు మిగలదు, సరికదా వృథా శ్రమపడడం అవుతుంది.

అదీకాక మనకి అందుబాటులో వున్న యిలాటి ఏ చిన్న పనులో చేసుకోగలిసినా, ప్రపంచంలో ప్రస్తుతం ఎన్నో జీవితావసరాలు వున్నాయి. అవన్ని ప్రతీ ఒక్కరూ చేసుకోగలరా? అన్నీ స్వంతంగా కావాలంటే సబ్బులకోసం సబ్బుల ఫ్యాక్టరీ పెట్టగలడా? బట్టలకోసం మిల్లు పెట్టగలడా? ఒక వుద్యోగంలో వుంటూ దినుసులకోసం పొలంపని చెయ్యగలడా? అది అసంభవం.

అంచేత వీటన్నింటినీ సాధించేది ఒకటి వుంది - అది డబ్బు. దానికి సాధ్యం కానిది లేదు. అంచేత అది సంపాదించాలి. అందుకు ఉద్యోగం ఒక సాధనం. కాబట్టి, ఒక్కొక్కపని ఒక్కొక్కరు చేస్తేనే గాని, యిన్నింటి తయారుచేసి అనుభవించడానికి వీలుండదు. ఎవరు చేయవలసినపని వారే చెయ్యాలి! డబ్బు మూలంగా అన్నీ లభ్యం అవుతాయి, ఉద్యోగంమూలంగా డబ్బు దొరుకుతుంది. అయ్యవారి వుద్యోగానికి జీతం యిస్తున్నారు. ఆజీతం వినియోగించి ఎవరికి కావలసినవి వారి తాహతుప్రకారం సంపాదించుకుంటారు.

అయ్యవారి వుద్యోగధర్మం, పిల్లలకు సరిఅయినతోవలో పనికివచ్చే విద్య నేర్పడం, దానిమీదే కేంద్రీకరించి జీవితం ధారపోసి ఆ వచ్చే జీతంతో కాలక్షేపం చెయ్యడం. అంతేకాని, అంతా స్వయం కృషికావాలని పిచ్చిలో పడి వంటా, పెంటా యిటువంటివాటిలో పడితే తన విధి ఎలా నిర్వర్తించుకోగలడు? అటు స్కూలుకి పోయి పాఠాలే చెబుతాడా? యిటు యీ వెర్రి ఆదర్శాలనే పట్టుకు కూర్చుంటాడా?

పోనీ - బేసిక్ ట్రయినింగయిన అయ్యవార్లని, హైస్కూళ్లలోనూ, మరికొన్ని చిన్న బళ్లలోనూ మేష్టర్లగా వేస్తున్నారు. అయితే యీ వుపాధ్యాయులు పొందిన శిక్షణ వేరు, యిక్కడ వీరు చెబుతున్నది వేరు, ఎలాగంటే - అక్కడ అయ్యవార్లకి బేసిక్ ట్రయినింగులో చెప్పిచేయించిన పనులు.—వంట వండడం, గిన్నెలు తోమడం, బట్టలుతుక్కోడం, పెంటలూడవడం, నీళ్లుతోడడం, యిలాటివి. ఇవి హైస్కూళ్లలోనూ, ఆ చిన్న బళ్లలోనూ చెబుతున్నారా? - యిప్పటివరకూ లేదు! అంచేత వీరు నేర్చుకొన్న విద్య ఒకరికి చెప్పకపోడంచేత వృథాఅయిపోదా? అటు వంటప్పుడు ఆ అయ్యవారలకు మాత్రం ఆ శిక్షణ ఎందుకు? ఎవరికోసమని ఆ శిక్షణ! యింకా మిగిలిన ముఖ్యమయినవి ఎన్నో

"క్షమించాలి! మా యింటి కోడి మీ తోటలో మొక్కలన్నీ కుళ్లగించేసిందట!"

"మొక్కలకేమిటి కానీండీ —మీకోడి మాకుక్క కొరికి చంపేసింది."

"పోన్లెండి! మీ కుక్క మా కారుకింద పడి చచ్చిపోయింది."

గవర్నమెంటు ఎందుకు చెప్పలేదు? ఉద్యోగం చేస్తూ అవన్నీ చెయ్యలేదు గనక, ఆ వృత్తులకి వేరే తరగతులు వున్నాయి గనక, యీయన కిచ్చే జీతంతో వాటిని కొనుక్కొని జీవించగలడు గనుక చెప్ప లేదు. అయితే ఆ నాలుగు పనులూ మాత్రం ఎందుకు చెప్పాలి! ఇలా ప్రతిమనిషి తన కుటుంబంలో అందరిచేతా చాకలిపని, కూలిపని, పాకీపని, పొలంపని, మంగలిపని అన్నీ స్వయం చేసుకుంటూపోతే బాగానే వుంటుందిగాని, చాకలి, మంగలి, దాసి మొదలైన చిన్న జీతగాళ్లందరూ ఏమవు తారు? అప్పుడందరూ వుద్యోగస్థులవాలి!

అందరూ అందలమెక్కితే మోసేవా రెవరన్నట్టు అవుతుంది. అసలు భగవం తుడు మొట్టమొదటే పప్పులో కాలువే సేడు! సృష్టిలో మొగ, ఆడ అని వేరు చెయ్యడమే తప్పు!

అయితే యీ కేసిక్రయినింగు అని యింత శ్రమ ఎందుకు పెడుతున్నారూ అని ఆలోచిస్తే—మనలో మన మాట; – యీ అయ్యవార్ల కిచ్చే జీతం తక్కిన వారితో సరిపోల్చి చూస్తే చాలా తక్కువ కాదా? చీటికీ మాటికీ జీతాలు ఎక్కువ చెయ్యండి, ఎక్కువ చెయ్యండి అని, నిప్పులో పడిన మిరపకాయల్లా ఘాటు ఘాటుగా ఒక్కొక సారి లేస్తూంటారు! వీళ్లనోరు నొక్కా లంటే ఒకటే పద్ధతి. అదేమిటీ అంటే వీళ్ల యింటి ఖర్చు సాధ్యమయినంతమట్టుకు తగ్గించివేయడం! అదెలా సాధ్యమవుతుంది? వృత్తి పురుష్యాని కెవరూ సహాయం చెయ్యరు కదా? అంచేత విలువయినవీ, ముఖ్యమయి నవీ అయిన పనులు చెప్పకపోయినా చాకలిపనీ, మంగలిపని, కూరగాయలు పండించడం, అంగుళంపాటి పళ్ళపరి దారాలు తియ్యడం, యిలాటి ఎన్నో చిన్న చిన్న నిత్యావసరాలని కొన్నిటిని నమ్పితే, జీతం చాలనప్పుడు, అవి ఎలాగూ వచ్చును కనుక చచ్చినట్టు అటువంటి పనులన్ని స్వయంగా చేసుకొని ఆ ఖర్చులు మిగుల్చు కుంటాడు. మాటిమాటికి జీతం హెచ్చింపు కోసం ఆందోళన చెయ్యడు. ఇలా చేస్తే దెబ్బకి రెండు లాభాలని... అనే వుద్దేశ్యం అయివుండొచ్చు. ఇది నిజం అయినా అబద్ధం అయినా, అనుకోడంలో తప్పేమీ లేదు.

చంద్రం అటువంటి ఆలోచనలో పడి పోయి, సంసారంలో కలతలు తెచ్చుకు న్నాడు, కమలకి ఏవో కొన్ని విషయాల్లో చంద్రం స్వభావం నచ్చినా, యిట్టి వంటి వాటిల్లో అతనితో కలియలేకపోతూంది. అవసరం లేని వాటిల్లో కలుగజేసికొని వృథా బాధపడు తున్నాడని ఆమె విచారం. పోనీ డబ్బే మన్నా మిగులుతూందా అంటే అదీ లేదు. ఒట్టి శ్రమ, చాకిరీ మాత్రం మిగుల్తు న్నాయి. బాధ్యత లేని పనుల్లో చెయ్యి చేసుకుంటే ఏమవుతుంది? అలవాటు పడ్డ వాడవడంవల్ల నయితేనేమి – ఆర్థికంగా నయితేనేమి, మానసికంగా నయితేనేమి స్వభావికంగా నయితేనేమి, మంచికయితే నేమి చెడ్డకయితేనేమి, చంద్రం సంగతి విచిత్రంగానే వుంది.

రోజు రోజుకీ చంద్రానికి పిచ్చి లాగయి పోతూంది. ఏదయినా చిన్న కారణం కన బడితే చాలు తనకి అన్నీ వచ్చునన్న భావంతో ఇంట్లో జీతగాళ్ళనందర్నీ మాని పించేయడం మొదలెడుతున్నాడు. ఆనాడు చాకలివాడు వచ్చేడు, ఆనవాయితీ ప్రకారం ఆనాడేదో గుడ్డ యివ్వలేదు, దానికితోడు మరో పావలా అయినా ఎక్కువ చేస్తేనే గాని కష్టం తీరదన్నాడు. యీ సెపంమీద

52–వ పేజీ చూడండి)

నా నిరాహార దీక్ష

ఆర్. చలపతిరావు

నా నిరాహార దీక్ష జయప్రదంగా ముగిసింది కాబట్టి, యీ దీక్షను గురించి సవిస్తరంగా యిప్పుడు పత్రికలో ప్రకటిస్తున్నాను. (ఈ విషయంలో పత్రికలు నాకు అన్యాయం చేసినవి అని చెప్పక తప్పదు. ఒక్క పత్రికకూడ నా నిరాహార దీక్షనుగూర్చి యింతవరకు ప్రకటించనే లేదు.)

అసలు ఉపవాస దీక్ష ప్రారంభించాలి అన్న విషయం 15 రోజుల క్రింద నాకు తట్టింది. ప్రతి భారత పౌరుడు నిరాహార దీక్ష తన జన్మలో ఎప్పుడో ఒకసారి అయినా చెయ్యవలెనన్న సంగతి అందరకూ తెలిసినవిషయమే. ఒకే వ్యక్తి ఎన్నిసార్లు ఉపవాసదీక్షకు ఉపక్రమించితే అంత మంచిదని వేరే చెప్పనక్కరలేదు. ఏ విషయంమీద దీక్ష కొనసాగించడమా అని మూడురోజులు తీవ్రంగా ఆలోచించాను. ఈ సందర్భంలో ప్రజలకు, యికముందు నిరాహార దీక్ష అవలంబించ తలచిన మహాత్ములకు ఒక చిన్న విషయం చెప్పతలచుకున్నాను. నిరాహారదీక్ష పూనతలచుకొన్న వ్యక్తికి దీక్షే ప్రధానంగాని, సంగతి సందర్భాలు అనవసరం. ఏ చిన్న విషయం మీదనైనా దీక్ష కొనసాగించవచ్చు. లేదా ఏ పెద్దవిషయంపైనైనా కొనసాగించవచ్చు ఇంకొక విషయం. శక్త్యానుసారం దీక్ష వహించవలసినదేగాని శక్తికి మించి దీక్ష కొనసాగించరాదు. దేశంలో ఉన్న దారిద్ర్యం అంతా నశించేదాకానో, అజ్ఞానం అంతా నశించేదాకానో ఉపవాసం సాగిస్తాను అని ఎవ్వడూ దీక్షకు పూనుకోకూడదు. ఫలానిది సాధ్యం అని తెలిసినపుడే దీక్షకు పూనుకొనవలసి ఉంటుంది.

ఈ విధంగా ఆలోచిస్తే నేను ఏ విషయం మీద దీక్ష సాగించడమూ అన్న సంగతి గడ్డు సమస్య అయింది. అందుకని నా మిత్రులని, నా అనుచరులు అని అనుకొనబడే వారిని సలహా అడిగాను.

"బ్లాకుమార్కెటును గూర్చి ఎందుకు చెయ్యకూడదూ" అని అడిగాడు నా ప్రియ మిత్రుడు రామమోహనరావు.

"అది పొరబాటు. దీక్ష పూనినతర్వాత ఆ పని కొనసాగేవరకు, విరమించకూడదు. బ్లాకుమార్కెటు అంతరించింది అని మనకు హామీ యెవరిస్తారు? కాబట్టి, యిటువంటి విషయాలపైన దీక్షకు దిగటం చాల పిచ్చి పని" అన్నాను.

"మరి నిషేధంమీదనో?" అన్నాడు యింకో మిత్రుడు నరసింహమూర్తి

"స్వామి సీతారాంగారు దానికి ఉపక్రమించటం, ఆయన దీక్ష విరమించటం అందరికి తెలిసినసంగతే కదా! ఇక ఈ విషయం మీద ప్రజలకు అంతగా ఉత్సాహం ఉండదు."

"అదికాదు నేనన్నది. నిషేధం తీసివెయ్యాలన్న విషయంపైన?"

"దాని కప్పుడే గౌతు లచ్చన్నగారు తయారవుతున్నారన్న విషయం పత్రికల్లో అందరూ చదివారు. ఆయన్ని చూచి నేను మొదలుపెట్టాను అనుకుంటారు ప్రజలంతాను."

"సరే! నీరా విషయం మీద ఎందుకు చెయ్యకూడదు?"

"చెయ్యవచ్చును. కాని అందులో ఒక చిక్కు ఉన్నది. స్వామి సీతారాంగారు కాబట్టి ఏ పది, పదిహేను రోజులో దీక్ష సాగించారు. నాకు యిదే మొదటిసారి. అదిగాక అంతగా అనుభవం లేనివాణ్ణి. ప్రభుత్వంతో కూడిన పని చాల ఆలస్యంగా జరుగుతుంది. ఎన్నాళ్లు పడుతుందో తెలియదు."

"హైడ్రోజను బాంబులను పరీక్షించడం మానివెయ్యాలన్న విషయంపైన యెందుకు చెయ్యరాదు" అన్నాడు మా నారాయణ.

"ఒకవిధంగా ఆలోచిస్తే ఈ విషయాన్ని గూర్చి ఉపవాస దీక్ష రష్యావాళ్లుకాని, చైనావాళ్లుకాని చేస్తే బాగుంటుంది అని నా అభిప్రాయం. ఎందుకంటావా, హైడ్రోజనుబాంబులు మన దేశంమీద పడతై అన్న భయం నాకులేదు. అదికాక యింకో కిటుకుఉన్నది. హైడ్రోజను బాంబునుగూర్చి దీక్ష పూనుతామనుకో, రేపు రష్యా నైట్రజన్ బాంబు కనిపెడితే, దాన్ని గూర్చికూడ దీక్ష కొనసాగించవలసివస్తుంది. ఒక బాంబునుగురించి దీక్ష పూనినతర్వాత యింకో బాంబునుగురించి దీక్ష పూనకపోవడం అంత మర్యాదగా ఉండదు. అందుకని అన్నిటికన్నా చివరి బాంబు యేదో తెలుసుకొని దానిమీదనే నిరసన వ్రతం ప్రారంభించడం శ్రేయస్కరం"

ఈవిధంగా నాలుగు గంటలు తర్జన భర్జన జరిగిందికాని అసలు విషయం తేలలేదు.

"ఇంకో సంగతికూడ చెప్పతలచుకున్నాను. వారంరోజుల్లో నా పుట్టినరోజు. ఆరోజుకైనా దీక్ష ప్రారంభించాలి" అన్నాను

"మీ మామగారు పెళ్ళిలో అన్ని లాంఛనాలూ సవ్యంగా చదివించారా?" అని అడిగాడు రామమోహనరావు.

"దానికీ, నిరాహార దీక్షకూ సంబంధం యేమిటి?" అన్నాను.

"ఉన్నదితే"

"ఆఁ! ఏం లాంఛనాలు ఇవ్వటంలే! పెళ్ళిలో నేను రేడియో ఇవ్వమన్నాను. ఆయన ఇవ్వనన్నాడు. నాలుగు నెలలపాటు ఆయన గడప నేను తొక్కలేదు. తరువాత ఆసంగతి ఆయనా మరచిపోయినాడు; నేనూ అంతగా పట్టించుకోలేదు."

"అయితే యింకా ఆలోచిస్తావేం! సమస్య పరిష్కారమైపోయింది. జన్మదినోత్సవం నాటికి రేడియో పంపాలి, లేకపోతే నిరాహారదీక్ష ప్రారంభిస్తాను అని కబురు చెయ్యి"

"భేష్! భేష్! అన్నాడు నారాయణ. "నీవు చెప్పినట్లు, యిది సాధ్యమైన పని. రెండుమూడు రోజులకన్నా ఎక్కువ చేయటం అనవసరం. అసలు అల్లుడు యీ విధంగా ఈవిషయంకోసం నిరాహారదీక్ష ప్రారంభించాడు అంటేనే చుట్టాల లోకంలో అలజడి బయలుదేరి, మీ మామగారు తక్షణం రేడియో సెట్టు తెస్తారు."

"పెళ్ళినాడు యివ్వనందుకు తగినశాస్తి చేసినట్టుకూడా ఉంటుంది"

కాబట్టి ఏ విషయంమీద దీక్ష పూనాలి అన్న సంగతిని తేల్చివేశాను.

"సరే! నిరాహార దీక్ష అనగానే సరిపోలేదు. దానికి చాల హంగామా ఉన్నది. అంతా టెలిగ్రాంలమీద జరగవలసిన పని. ఉత్తరాలు లాభంలేదు. కాబట్టి ఈ తక్షణమే మీ మామగారికి యీ విషయం వివరిస్తూ టెలిగ్రాం యివ్వు."

అందరి సలహామీద యీ క్రింది విధంగా టెలిగ్రాం పంపాను.

"ప్రియమైన మామగారికి,

వారం రోజుల్లో నా పుట్టినరోజు పండగ అన్న సంగతి మీకు తెలిసిన విషయమే! ఆరోజుకు నాకు రేడియో సెట్టు మీరు పంపాలి. లేకపోతే నిరాహార దీక్ష బూన తలచుకున్నాను. రెండురోజుల్లో సమాధానం రాకపోతే నిరాహార దీక్ష ప్రస్తుతం నేనున్న వసతిగృహంలోనే ప్రారంభిస్తాను. మీ అల్లుడు"

"సరే! టెలిగ్రాం సంగతికూడ అయిపోయింది. ఇక పోతే డాక్టరు విషయం, రోజుకు కనీసం ఒకసారి అయినా నీ ఆరోగ్య పరిస్థితులనుగూర్చి డాక్టరు ప్రకటించాలి. దీక్ష మూడురోజులపాటు సాగిన తరువాత రోజుకు కనీసం రెండు మూడు సార్లనా్న ప్రకటనలు చెయ్యాలి"

"సరే మన మిత్రుడు నాగభూషణం డాక్టరే కాబట్టి, రోజుకు నేను ఎన్ని పౌనులు తగ్గిందీ, పల్సురేటు ఏవిధంగా ఉన్నదీ ప్రకటిస్తాడు" అన్నాను.

"ఆ విషయంకూడ సబబుగానే ఉన్నది. తరువాత ఈదీక్షసమయంలో నీవేమి పుచ్చుకోవాలి అన్న సంగతి ఆలోచిద్దాం. అన్నం కూరలు తినకూడదన్న విషయం నీకు తెలిసిన విషయమే కదా!"

"అదేమిటి? అసలు నీళ్లయినా ముట్టకూడదు" అన్నాడు నరసింహామూర్తి.

"నన్ను చంపవాకండి! ఇదే మొదటిసారి నాకు! ఇదే చివరిసారికూడ కానివ్వకండి! కొంచెం చూసీ చూడనట్లు పోనీండి" అన్నాను అతిదీనంగా.

"అయితే నీళ్లు త్రాగవచ్చు" అన్నాడు.

"నీళ్లగొడవ కాదు! నేను కాఫీ లేంది అసలు ఉండలేను" అన్నాను.

"కాఫీ అంటే నీళ్లేగా! ఈ రోజుల్లో మనం త్రాగేది నీళ్ల కాఫీయేగా" అని సమర్థించాడు.

"తరువాత యింకా యేమీ తినకూడదా?"

"ఊహూ" అని అందరూ నిష్కర్షగా తల లూపారు.

"అదేమిటి? మన యింట్లో వాళ్లందరూ యేకాదశినాడు ఉపవాసముండి ఉప్పుడు పిండి తినటం లేదా?" అని అడిగాను.

"అవు ననుకో!"—అన్నాడు రామమోహనరావు కొంచెము సంకోచిస్తూ.

"సరే పోనీ! పిండి తిను."

"పిండి కాదులే! ఆధునిక పరిస్థితులను బట్టి పిండిని ఉప్మాగా మారుద్దాం" అన్నాను. అందరూ అంగీకరించారు

"అన్ని విషయాలూ బాగానే ఉన్నవి కాని ఈవార్త పత్రికలలో ప్రకటించాలి. కనీసం ఒక అర డజను విలేఖర్లనన్నా రోజూ యిక్కడికి రప్పించాలి" అన్నాడు.

"అది యెంత పనిలే" అన్నాడు నారాయణ.

రెండు రోజులు గడిచింది. మా మామ గారివద్దనుండి సమాధానం రాలేదు. దానికి తోడు ఏ పత్రికలవాళ్ళుకూడ నా ఉపవాసదీక్షను గురించి ప్రకటించ లేదు. ఎందుకో నాకింతవరకూ అర్థం కాలేదు. పోనీ కరపత్రాలయినా పంచిపెట్టితే ప్రజల సానుభూతి కొంత ఉంటుంది అని మా మిత్రులందరూ సలహా యిచ్చారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రజల సానుభూతి లేనిది యే వ్యవహారం జరగటం అసంభవం. అయిదు వందల కరపత్రాలు నా నిరాహార దీక్ష, దాని ఆశయాలనుగూర్చి వివరించుతూ ప్రకటించాము. మా చుట్టాలకు, మా అందరి మిత్రులకు, మంత్రులకు, వివిధ పార్టీ నాయకులకు పంపాము. కాని ఎవ్వరివద్దనుండీ

(54-వ పేజీ చూడండి)

కృతజ్ఞత

ముళ్ళపూడి వెంకటరమణ

ముందు వేసవికాలంలో, ఒక రోజు రాత్రి, వెన్నెల పుష్కలంగా కాస్తోంది. పెదపంతులుగారి లోగిలి ముందు అరుబైట వేసిన తెల్లటి పక్కలమీద ఆ వెన్నెల విరగబడి నవ్వుతూ పొర్లాడింది.

వెండికొండ పరమేశ్వరుడివలె ఆ తెల్లటి పక్క వేసిన మంచంపైన సుబ్రహ్మణ్యం గారు ఉపవిష్టులయ్యారు. పక్క మంచం పైన పెదపంతులుగారు నభాభిముఖ వదనులై మందహాసంతో నీలి మాకాశాన వెలిగిపోతున్న చంద్రుణ్ణి చూస్తున్నారు. కొంచెం దూరంలో పెదరైతు బంగారయ్య గొంతుకిలా కూచుని పొలం సంగతులు చెప్తున్నాడు. అరుగుచివర దూరంగా నిల్చున్న పాలేరు ముళ్ళకర్ర పిడిమీద పెట్టుకున్న చేతిమణికట్లమీద గడ్డం ఆనించి కబుర్లు ఆలకిస్తున్నాడు.

సుబ్రహ్మణ్యం గారి సతీమణి కామేశ్వరి, పెదపంతులుగారి భార్య సుందరమ్మ గుమ్మం మెట్లమీద కూర్చున్నారు. వాళ్ళ తలలో తురుముకున్న మల్లెపూల చెండ్లూ మరువం, పరిమళాలు గుబాళిస్తున్నాయి.

హఠాత్తుగా ఒక పెద్ద గావుకేక గాలిని బద్దలుచేస్తూ వినవచ్చింది. అందరూ ఉలికి పడ్డారు.

"ఆగరా! ఆగు! విశ్వాస ఘాతకుడా! సిగ్గులేదూ! ఆగు." అంటూ అరుస్తూ మహా వేగంతో పరిగెత్తుకొచ్చాడు వెర్రివెంకన్న. పంతులుగారి ఇంటి గుమ్మం ముందు కొచ్చేసరికీ ఆగిపోయాడు వగురుస్తూ.

వెంకన్న నెత్తికి తలపాగా చుట్టాడు. ఒక నల్ల చింకికోటు తొడుక్కున్నాడు. గోచీ పెట్టుకున్నాడు. చేతులో చింతబరిక వుంది.

గభాలున వెంకన్న రోడ్డుమధ్య మఠ మేసుకుని కూచున్నాడు. ఎదురుగా అతని నీడ పడుతోంది. నీడతో చెప్పటం మొదలు పెట్టాడు, తన గోల——

"మాకావుటయ్యా! అదీ సంగతి. అప్పుడా గజేంద్రుడు పెట్టిన గోలకి, లక్ష్మీదేవితో చదరంగం ఆడుతున్న విష్ణుమూర్తి అదరిపడ్డాడు. చెవులు గింగిర్లెత్తిపోయాయి. అప్పుడేంచేశాడో తెలుసోయ్? సిరికిం జెప్పడు శంఖచక్ర యుగమున్ - ఆగాగు, అక్కడాగు. ఏవిటీ! మళ్లా అను ఆముక్క సిరికిం జెప్పడూ? అవును. వాడిష్టం. మధ్య నీదేమిటోయ్! సిరికే కాదు, గిరికైనా డా చెప్పడు. ఆఁ! చెప్పడు. వాడేం వాడి సొమ్ము తిన్నాడా ఏమన్నాను! అంచేత చెప్పడంటే చెప్పడోయ్. ఊఁ! తరవాత - శంఖ చక్ర యుగమున్ చేదోయి సంధింపడే పరివారమున్ జీరడు. ఆగాగు. అలా ఆగు. జీరడ మేవిఁటీ! ఎవర్ని జీరడం? పరివారాన్నే! హోరి! ఎందుకురా! పాపం వాళ్ళు వెట్టిచాకిరీ చేసినందుకు జీర మంటావా? విశ్వాసం వున్నవాడెవడేనా ఆపని చేస్తాడా అంట! అసలు విష్ణుమూర్తెవరనుకున్నావ్. సాక్షాత్తు దేవుడు. అంచేత అతడు జీరతాడా? జీరడని తాత్పర్యం. ఎంత దేవుడైనా అతగాడికి విశ్వాసం ఉంది. మా నేస్తం కామోజీ గాడికి విశ్వాసంలేదు. వాడు నాకు ద్రోహం చేశాడు. మోసంచేశాడు. నన్ను తన్నేడు. పదేళ్ళ స్నేహం మంటగలిపేశాడు దౌర్భాగ్యుడు. ఒరేయ్ కామోజీ! నువ్వు బాగుపడవ్. నీళ్ళు పుట్టవ్ రేయ్. ఆగు వస్తున్నా - అక్కడే అక్కడే ఆగు. నీకక్కడూ..."అంటూ నే జింకని తరిమే పులివేగంతో ఎవర్నో తరుముకుంటూ పరిగెత్తుకుపోయాడు.

ఎవరికీ నవ్వురాలేదు - వెంకన్న వెర్రి వేదాంతానికి. ఎందుకో భయం వేసింది. అతని వాక్శుద్ధికీ, ఈ స్థితికీ సంబంధం అంతుపట్టలేదు. పెదపంతులుగారు కూడా ఎపుడూ అతన్ని చూడలేదు. అందరూ జాలిగా చూశారు పరిగెడుతున్న వెంకన్న వైపు.

దూరంగా నించున్న పాలేరు కొంచెం సందేహంగా నవ్వాడు. అందరూ వాడి వంక చూశారు. తుపుక్కున పక్కకి ఉమ్మి వేసి ఉషారుగా వాడికి తెలిసింది చెప్పబోయాడు. "యీడి పేరు యెర్రెంకడు బాబయ్యా. బ్యామ్మలాయనేటండి. అయితేనేం. మతి సెడ్డది. దుర్ళ సంతకాడ తూమ్మీద కూకుని ఓ పద్దేలు సదివేత్తాడు. ఓడినో అమ్మాలి చేసి తిడతాడండి ఏ వూరాడో ఓరికీ తెల్దు. ఎర్రినంజకొడుకు. థూ!"

రైతు బంగారయ్య గసిరికొట్టాడు "ఛీ! యెదవా-యెదవా అని. నువ్వలాగుండెహె. పెద్దోరి ముంగల ఏటిరా ఆ మాటలు. ఎదవ నోటికొచ్చిందల్లా పెడపెడా ఓగేయడమే? చుద్దీబద్దం నేదు నోటికి. యెదవా యెదవాని"

"వాణ్ణి తిట్టకయ్యా. పాపం వాడికి తెలిసిందేదో చెప్పాడు తప్పేముంది లే" అన్నారు సుబ్రహ్మణ్యం గారు.

పెదపంతులుగారు రావలిస్తూ తమ అభిప్రాయం వెళ్ళబుచ్చారు "పాపం...ఎవళ్లో ...బదిగి చెళ్ళవాళ్ళయి యుళ్లాడు...హోయ్ ...స్నేహితు డెవడో...హుమ్మ...స్నేహితుడెవడో నమ్మించి ద్రోహం చేశాడు గావును. మతిపోయుంటుంది."

"అంతే మరి! స్నేహితు లన్నాక ఆమాత్రం విశ్వాసం వుండద్దూ. సాయం చెయ్యా చెయ్యాలి. పొందా పొందాలి. పాలిచ్చి సాకిన ఎదుర్రొమ్మని పొడిచిన వెధవలు బాగుపడతారా అని" అన్నది కామేశ్వరమ్మగారు జనాంతికంగా.

సుందరమ్మ అందుకుంది. "మనిషన్నాక ఆమాత్రం బుద్ధుండద్దూ. కుక్క కుంది విశ్వాసం. ఛీ..."

"అంతేనండంతేనండి" అంటూ వంత పలికాడు బంగారయ్య.

సుబ్రహ్మణ్యం గారు తలగడా కిందనించి పొగాకు తీసి తుంపడం మొదలెట్టారు చుట్ట నిర్మాణానికి నాందిగా.

అందరూ ఏకగ్రీవంగా ఛీత్కరించిన ఈ మహద్విషయంతో తనకేం సంబంధం లేనట్లుగా, కేవలం చుట్ట చుట్టుకోడం ఒక్కటే జీవితపరమావధి అన్న ధోరణిలో తల వంచుకుని ఏతత్కార్య నిర్వహణైక లక్ష్య నిమగ్నులైవున్న సుబ్రహ్మణ్యం గారి మౌనం పంతులుగారికేం నచ్చలేదు. తక్కిన జనం, అంటే, యిద్దరు స్త్రీలూ, రైతూ, పాలేరూ కూడా యిదే అభిప్రాయంలో వున్నారని రూఢి చేసుకుని ఇంక వుండబట్టలేక అడిగేశాడు పంతులుగారు. "ఏమండీ బావగారూ! మీరేమంటారు? నేనన్నది రైటేనా అని."

సావధానంగా వంచిన తల ఎత్తకుండా సుబ్రహ్మణ్యం గారు తిరుగు ప్రశ్న వేశారు "నువ్వనేది ఏమిటి అసలు?" అని.

"రెడ్డొచ్చి మొదలాడమన్నారట" అంది కామేశ్వరమ్మగారు నవ్వుతూ.

"రెడ్డి మొదటినించి యిక్కడే వున్నాడుగా! ఎటొచ్చీ అతని కర్థంకాలేదంతే. పోన్లే మొదటొస్తేనేం మధ్యనొస్తేనేం - రెడ్డి నాటకం చూడాలనుంటే మళ్ళీ ఆడచ్చుగా." అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"మీ కవిత్వాలు నాకు రావు బాబూ. ప్రతిదానికీ సవాలక్ష చదువుతారు" అన్నదావిడ.

"పోన్లే. నీకు రాకపోయినా మన పంతులికొచ్చుటలే. ఏదో చెపుతున్నాడుగా. మానవుడూ, కృతజతా, స్నేహం - అని..." అంటూ ఛలోక్తి విసిరారు సుబ్రహ్మణ్యంగారు, చుట్టంటిస్తూ.

పంతులుకోపం బుస్సుమంది "కవిత్వానికేవుందండీ. ఉన్నమాట అన్నాను. మనిషన్నాక విశ్వాసం ఉండాలంటాను. వెధవది కుక్కకి ఉంది కదండీ కృతజ్ఞత!"

చిద్విలాసంగా పొగ వదలి, నెమ్మదిగా నోట్లో చుట్టతీసి, శ్రద్ధగా దాని కొడి దులిపారు సుబ్రహ్మణ్యంగారు. అర్ధనిమీలిత నేత్రులై పదిక్షణాలు మౌనంవహించారు. తరవాత తాపీగా జవాబిచ్చారు.

చూడు పంతులూ. మనుష్యుల బతుకులు సూత్రాలమీద నడవ్వు. నువ్వు నాకు మహోపకారం చేశావనుకో. నేను విశ్వాసం కొద్దీ నీకో వెయ్యి రూపాయిలు దొరికే ఛాన్సు ఇప్పించాను నావల్ల నీకు డబ్బొచ్చిందన్న విశ్వాసంతో నువ్వు నాకు వంద రూపాయలిస్తావు. నా పరిస్థితులకొద్దీ "ఛా! వీడు నాకు వందే ఇచ్చాడు కృతఘ్నుడు." అంటాను నేను.

"చూశావా! వీడికి వంద కరుకులు దోసిట్లో పోస్తే అని పుచ్చుకుని నన్ను తిడుతున్నాడు" అంటావు నువ్వు. నా దృష్టిలో నీకు విశ్వాసం లేదు. నీ దృష్టిలో నాకు విశ్వాసం లేదు. ఇలాంటివి ఇదమిద్ధమని చెప్పలేం.

"నిబద్దేనండి ఆ ముక్క" అన్నాడు బంగారయ్య.

పంతులుగారు ఆలోచనలో పడ్డారు.

"కథ చెప్తారు విను సుందరమ్మా" అంది కామేశ్వరమ్మగారు నవ్వుతూ.

సుబ్రహ్మణ్యంగారు మందరస్థాయిలో ప్రవచించారు.

"నీ కళ్ళఎదట మంచివాడు అపకీర్తిపాలై అడుక్కు తింటూంటే - ఒకొక్కసారి నువ్వే ఆ మంచివాడవయితే నీకీ కృతజ్ఞతలో నమ్మకం పోతుంది. మా వూళ్లో సింగారం, దీక్షితులూ యాభైఏళ్ళనించి స్నేహితులు. సింగారం పెంపుడు కుక్క విశ్వాసం లేకుండా ఆ స్నేహితులమధ్య అపోహలు కల్పించింది. మరి అన్నేళ్ళ స్నేహం ఏ గంగలో కలిసిందో కానీ ఇద్దరూ ఇపుడు పరమశత్రువులు. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వాడు వెధవంటాడు సింగారం. సింగారం వెధవన్నర అంటాడు దీక్షితులు.

చూడు పంతులూ ఇలాంటివి చూస్తే కృతజ్ఞతనే మాటలో అర్థం కనిపించదు. స్వార్థం కనిపిస్తుంది. దానికోసం వెతికడం కన్నా ఆంధ్రుల్లో ఐకమత్యం సాధించడం సులభమేమో అనిపిస్తుంది నవ్వకు. సింగారం కథనింటే నువ్వల్లా నవ్వవ్. చెప్తాను విను. చిన్నదేలే. ఈ చుట్టయ్యేలోగా పూర్తి చేస్తా."

(సుబ్రహ్మణ్యేన ఉవాచ। ఇతి కథా ప్రారంభః)

"అనగనగా మీకు తెలీని ఊళ్లో, ముత్యాలమ్మ గుడి వీధిలో దీక్షితులని ఒక సద్బ్రాహ్మణుడుండేవాడు. సంత బజారులో జవహర్లాలు కాఫీహోటలు పొరుగున సింగారం అనే వణిగ్వరుడుండేవాడు. పరమ నిష్ఠాగరిష్ఠులు, బహుశ్రుతులు, పకెంగితజ్ఞులు అని పేరందిన సద్వంశంలో జన్మించాడు దీక్షితులు. దిట్టమైన కోమటింట అవతరించాడు సింగారం. సింగారం బట్టల వర్తకం చేసేవాడు. దీక్షితులు తాత పువ్వులమ్మినవాడు, సింగారంతాత కట్టెలు అమ్మేవాడు. ఇపుడు దీక్షితులు కట్టెలమ్ముతున్నాడు. సింగారం పువ్వులు విరజిమ్మగల స్తోమత సంపాదించాడు

"ఈ కథకి నాంది ఏమిటంటే ఈ బ్రాహ్మడికీ, ఆ కోమటికీ పొత్తు కుదరటం. ఇందులో ఒక విచిత్రం ఉంది. వాళ్ల పొత్తు పోట్లాటతో ప్రారంభమయింది. నేనూ దీక్షితులూ గోచీలు పెట్టుకుని గోళీ లాడుకుంటున్నాం ఒకరోజు మధ్యాహ్నం. మాకు పదేళ్లుంటాయేమో అప్పుడు. సింగారం నా కొద్దిగా తెలుసు. ఎక్కడ్నించో వచ్చి, నుంచుని మా ఆట చూస్తున్నాడు. బొడ్డుకిందకి చెడ్డీ కట్టుకుని, బొజ్జ

ప్రొహిబిషన్‌కి పూర్వం

అది ఒక పెద్దహోటల్. ఇద్దరు తాగుబోతులు లోపలికి వచ్చివాళ్లకేం కావాలో చెప్పటానికి. చాలాసేపు తంటాలు పడ్డారు వాళ్లలో ఒకడు చివరికి ఎల్లాగో ఓపిక తెచ్చుకొని "మాకూ... రెండు... గదులున్న ...మంచంకావాలి...అని అనగలిగాడు.

హోటల్‌గుమస్తా అందుకొని "ఓ, అదా! రెండు మంచాలున్న గది కావాలా మీకు" అన్నాడు.

కొద్దిక్షణాలు గడిచాక వాళ్ళిద్దరూ రెండుమంచాలు ఏట్టే ఒకగదిలో, ఒకేమంచం మీదపడుకొని వున్నారు.

"ఒరేయ్ సాంబీ! నా పక్కమీద ఎవడో వున్నాడ్రా" అన్నాడు పరంధామయ్య.

"ఓస్! నీపక్కమీదే కాదు లేవోయ్! నా పక్కమీదా ఎవడో పడుకొనివున్నాడు."

"సిగ్గులేక ఆ మాట నాకు చెప్పతున్నావా? ఈడ్చిపెట్టి వాణ్ణి ఒక్కటి తన్నరా"

కొద్ది నిమిషాలపాటు ఆ గదిలోనుంచీ ఫెడీ ఫెడీ మని తన్నులు వినిపించాయి.

"అరేయ్ పరంధామం! నా పక్కలోవాడిపీడ వదిలిందిరా"

"నా పక్కలో వాడెవడో వుద్దండుడురా! నన్నే తరిమేశాడు."

"అలాగా! పోతే పోయిందిలే - నువ్వు యిలా వచ్చి నా పక్కలో పడుకో!"

★ కృతజ్ఞత ★

-శైట పడేసుకుని, బండబ్బాయిలా ఉంటే వాడు సింగారం. ఆవేళ బెల్లపు జీడి తింటు న్నాడు.

"దీక్షితులు ఆట ఆపి వాడి వంక చూశాడు. జీడి చూడగానే నోరూరింది. మట్టిచేతులు పీ(రలకి తుడుచుకుంటూ, సింగారందగ్గర కెళ్ళాడు. ఎగా దిగా చూశాడు. నిర్లక్ష్యంగా జీడి చీకుతు న్నాడు సింగారం.

"ఈ చెడ్డీ నీదిగాదు" అన్నాడు దీక్షితులు.

'నాదే' అన్నాడు సింగారం (శద్ధగా జీడిని చూస్తూ.

"'నీదికాదు. మీ తమ్ముడిది'

"'కాదు నాదే. మాకు తమ్ముడులేడు'

"'అయితే నీ చిన్నప్పటిది'

"'పోన్లే. నా యిష్టం' అన్నాడు సింగారం. కొంచెం అవతలగా నించున్న అంబోతుని చూస్తూ.

"దీక్షితులి కింక ఏంచెప్పాలో తోచ లేదు. సింగారం, జేబులోంచి యింకో జీడి తీసి నావేపు చూశాడు.

'జీడి కావాల్రా సుబ్బులూ'

'అక్కర్లేదు. కానీ నీ యిష్టం. ఇస్తే ఇయ్యి' అంటూనే జీడి అందుకున్నాను నేను. దీక్షితులికి మరీ నోరూరింది—

'జీళ్ళు బాగుంటాయి' అన్నాడు గుటక మింగి, మిటకరించి.

"సరే అప్పుడు సింగారం యింకో జీడి తీసి, 'నీ క్కూడా జీడి కావాలా?' అన్నాడు.

'అవున'ని తల పంకించాడు దీక్షితులు.

జీళ్ళు తింటూ గోళీకాయలాట సాగించాం. సింగారం నుంచుని ఆట చూస్తు న్నాడు. దీక్షితులి గోళీకాయ ఒకసారి సింగారం కాలిదగ్గరకొచ్చి ఆగింది. చిరు నవ్వుతో చిద్విలాసంగా ఆ గోళీని కాల్తో తన్నాడు సింగారం.

ఆట మధ్యలో చెడినందుకు దీక్షితులికి ఒళ్ళు మండిపోయింది. పిడికిళ్ళు బిగించి సింగారంమీద కెళ్ళాడు. "ఎవ్వడ్రా నిన్ను తన్నమన్నది-పెద్ద పొనకంలో పుడకలాగ" అన్నాడు.

సింగారం వికిలిగా యికిలించాడు నా వంక చూసి. "నేను జీడిపెట్టాగా-ఆమా(త్రం గోళీ తంతే ఏం?" అన్నాడు.

"పోన్లేరా దీక్షితులూ వదిలెయ్. జీడి పెట్టాడుగా' అన్నా నేను. దీక్షితులు వది లేశాడు. 'జీడి పెట్టావుగానీ – లేపోతేనా' అంటూ మాపుడువేలుతో సింగారం బొజ్జ మీద పొడిచాడు. ఆట ఆడేశాం.

ఇళ్ళకి వెళ్ళే సందర్భంలో దీక్షితులు గంగ్రడు పిల్లిలా మొహంపెట్టి వీడ్కోలు చెప్పాడు. సింగారం రెండడుగులు వేసి కొండముచ్చులా మొహంపెట్టి – 'హుఁ!' అన్నాడు.

కానీ ఆ సాయంత్రం పది జీడి కడ్డీలు తెచ్చాడు సింగారం వాళ్ల నాన్నకి తెలీ కుండా. స్వయంగా దీక్షితుల్ని పలకరించి వియ్యపురాలి జీళ్ళూ బెల్లపుజీళ్ళూ కూడా ఇచ్చాడు: చీకటి పడేసరికి ఇద్దరూ జట్టా పట్టాలేసుకుని తిరిగారు. చూశావా పంతులూ – పదోవిట వాళ్ళకి పొత్తు కుది రింది. రోజురోజుకీ వాళ్ళ స్నేహం దృఢ తరమైంది. కలిసి ఆడుకున్నారు. కలిసి చదువుకున్నారు. కష్టం సుఖం చెప్పు కున్నారు. దరిమిలాను వాళ్లు పెద్దవా ళ్లయారు. ఈవిధంగా యిద్దరూకలిసి నాలుగు పుష్కరాలు చూశారు. ఊళ్ళోవాళ్ళ కెంతో చిత్రంగా వుండేది వాళ్ల స్నేహం. దీక్షితులు బీదవాడయినా నోరువిప్పి సింగా రాన్ని ఏనాడూ కానీ అడగలేదు. సింగారం కూడా – కావాలా అని అడగడు. తనే తెలుసుకుని డబ్బో దస్కమో సంభారాలో పంపేవాడు ఇంటికి.

"దీక్షితులికి పిత్రార్జితమైన లోగిలొకటి మిగిలింది. అదివినా పొలం గిలం లేదు. ఆ యింటి వెనకున్న దొడ్లోనే పెరట్లోనూ దోస కాయలో పొట్లకాయలో కాపించి సంతకి పంపేవాడు. పోతే ఏదో అచ్చెన్నా బుచ్చెన్నా పోట్లాడుకుంటే వాళ్ళ మధ్య దూరి తగవు తీర్చి అయిదో పదో తెచ్చు కునేవాడు. అదీ ఇదీ లేపోతే రామమంది రంలో కూర్చుని చాదరికీ నాయుడికీ సల హాలు చెప్పేవాడు. సాయంత్రం మటుకు

సింగారం, గుడివేపు రాగానే, ఇద్దరూ కలిసి పొలాలవైపు పోయి, లోకాభిరామాయణం మాట్లాడుకునేవారు. సింగారాన్ని ఆకర్షించినది దీక్షితులి ఋజువర్తనా, సౌజన్యతానూ. ఊళ్లో వాళ్లుకూడా ఇందుకే అతన్ని గౌరవించేవారు. అతని మాట పాటించేవారు. ఈవిధంగా ఏళ్ళతరబడి సాగింది వాళ్ళ స్నేహం. ఊళ్లోవాళ్ళకెంతో చిత్రంగావుండేది వీళ్ల ధోరణి... చూశావా పంతులూ, ఇరూ్ళ, వేషభాషలూ మన స్తత్వాలూ, ఆఖరికి పెళ్లాలూ కూడా రోజురోజుకీ మార్చేస్తున్న ఈ పాడురోజుల్లో వీళ్ళు కేవలం, యింత స్వేక్ష మంగా, బొత్తిగా ఇంత కల్తీలేని ప్రేమతో స్నేహితుల్ని మార్చుకోకుండా బతుకుతున్నారంటే చిత్రంగాదూ! ఎంత స్నేహమయినా, దానమ్మకడుపు బంగారంగానూ, మరీ బొత్తిగా అన్నాళ్ళా! పల్లెత్తు పొల్లు మాటకూడా వాళ్ళ నోటంట దొల్లలేదంటే నమ్మ బంగారయ్యా."

"మంచోళ్ల నోట మంచిమాట రాక యింకేటొస్తదండి బాబయ్యా" అన్నాడు బంగారయ్య చతికిలబడుతూ.

"ఎందుకు రాదయ్యా? మనిషిలో ఉండే చిత్రమే అది. మంచీ చెడూ కలిస్తేనే మనిషి - ఏడురంగులు కలిస్తే తెలుపయినట్లు. 'అనగనగా ఓ రాజూ రాణీ ఉండేవారూ - వాళ్ళకి కొడుకూ కూతురూ పుట్టారూ - రాజ్యం సుభిక్షంగా వుండేదీ- రోజులు హాయిగా, వెళ్లేవి - కానీ యిలా వుండగా ఒకనాడేమయిందంటే—' ఆ పటాలిని ఎన్ని వేల కథలు చెప్పుకుంటామయ్యా! అదంతే! భగవద్విలాసమే అంత! ఏదో ఓనాడేదో పోటీ జరుగుతుంది. చిన్న అపశ్రుతి పలుకుతుంది ఆ జీవితమనే వీణమీద. ఒక్కొకసారి ఆ అపశ్రుతి దిద్దటం జరిగి పాట సాఫీగా సాగిపోతుంది. కానీ—ఏది చూశావా - కానీ ఒక్కొసారి ఆ అపశ్రుతి దిద్దటంలో తీగ తుపుక్కున తెగి పూరుకుంటుంది. అపుడా వీణ వాయించే ఆసామీకి చిరాకేసి, వీణమీద కోపంవచ్చి, దాన్ని తోసేస్తే వీణ భగ్నవీణవుతుంది. అయినా ఇదంతా మనకెందుకులే - ఏదో కవులూ గట్రా పుస్తకాల్లో రాసుకేడిచేది - కథ కానిద్దాం... ఒరేయ్ పాలేరబ్బాయ్ - నీ పేరేమిటో గానీ-అలా ఎంతసేపు నించుంటావ్ - కూచో కూచో- అః! ఏ రేనయ్యా - ఆ విధంగా రోజులు సాఫీగా జరిగిపోతున్నాయి. ఒకరోజు పొద్దున్నే దీక్షితులు వంటింట్లో కూచుని, కూర తరగడం యూపేణా పెళ్లానికి వంట సాయం చేస్తున్నాడు. బయటనించి కేక వినబడింది. దీక్షితులిభార్యవెళ్ళి తలుపు తీసింది. ఆ వచ్చిన మనిషి సరాసరి వంటింట్లో జొరబడి పోయాడు.

"ఏవుండోయ్. దీచ్చితులుగోరూ - చింగారంగోరు తమర్ని వున్నపడంగా లగేసుకు రమ్మన్నారు." అన్నాడు.

'ఏమిట్రా కథా?' అన్నాడు దీక్షితులు ఆశ్చర్యంగా. 'సింగారం ఎన్నడూ ఈ విధంగా యింటికి కవురంపలేదు. దీక్షితులు భార్యకి తమ స్నేహం రుచించదని అతనికి బాగా తెలుసు. అసలే ఆవిడ గయ్యాళి. కాకి నలుపంటే కాదు తెలుపనే రకం.

ఈ కబురు వినగానే ఆవిడ గంయ్యిమంది "అయ్యో హయ్యో నీకేం పొయే కాలంవచ్చిందిరా అంటమెధవా - శూద్రాడివలా వంటింటిమీదికొచ్చిపడిపోతేఎలాగా! నా మడి మంటిగడ్డలైనట్టే వుంది. నవ్వుతావేమిట్రా నీనవ్వు నష్టేట కలవా. ముండవ తలకి నడువు రాలుగాయి వెధవాఅని. అన్నా! మరీ బరితెగించి పోయారమ్మా!"

కబురు తెచ్చిన తొందర్లో సరాసరి వటింట్లోకొచ్చేసిన విసిరయ్య నవ్వుకుంటూనే వీధి గుమ్మంలో కెళ్ళాడు. వాడికీ ధోరణి బాగా అలవాటే.

కంద దుంపల చెక్కు తీసి చెయ్యి కడుక్కొస్తున్న దీక్షితులిగారిమీదకి తిరిగిందావిడ విసురు. "ఇంకేం - దయచెయ్యండి దర్బారుకి. జోడు గుర్రాలబండి బయట కాసుక్కుందిగావును. వెళ్లండి. వంటా వార్పూ ఆఖరికి కూర తరగడంకూడా నేనే చేసుకేడుస్తాను. రవ్వంత జాలిలేదు కదా మనిషికి." అంటూనే దీక్షితులికంటెముందరే ఆవిడ పెద్దపెద్ద అంగలేస్తూ వాకిట్లోకి బయల్దేరింది.

దీక్షితులు గోచీ సవరించుకుంటూ ఆవిడ వెనకాలే వచ్చాడు. "అవునే! ఒసే! నువ్వుండవే. నే కనుక్కుంటాగా ఏవిటో. ఏవిట్రా అసిరయ్యా? ఏవిట్రా సంగతి? సరిగ్గా చెప్పేడు." అన్నాడు.

"ఏటేంటి బాబుగోరూ! బోలెడుండది. నిన్నరేత్రి చింగారంగోరు మామూలుగానే బువ్వ తిని తొంగున్నారంట. మూడు జాముల పుడు కామోసు - ఏడు కొండల యెంకటేశరులోరు ఆపడాన్న కల్లో కొపడి ముదరయ్యగోర్ని యీడ్చి సెంపకాయ కొట్టారంటండి. ఆకాడ్నించి 'ఎదవా నీకు బుద్ధుందా? నా కొండకొత్తానని మొక్కుకున్నావుగందా. ఎగదొబ్బుదామని ఎత్తే సావుగానీ సంపేత్తాకబడ్దార్. ఇపుడు సెగిచి నాకూడా రారా' అంటా జబ్బ గట్టిగా ఒట్టుకుని నిల్దీసినారంటండి. అయ్యగోరు పెద్ద పెద్ద కేకలేసి ఎంటనే తెలివితెచ్చుకుని, మమ్మల్నందర్నీ లేపి కలసొప్పి, ఎంటనే కాళ్ళూ మొగం కడుక్కుని రేపే కొండకొత్తానని సామికి దణ్ణవెట్టారండి. పొద్దు పొడిచేవరకూ మా కోరికీ కంటిమీద కునుకు నేదండి. ఆ ఎంకన్నమాత్తెం గురించి ఊసులాడుకుంటూ కూకున్నామండి. అదీ సంగతి-అయ్యగోరు ఇయ్యాళ్నే ఉప్పుడు కొండకి బయల్దేరినారండి మిమ్మల్నోసారి కేకేసుకు రమ్మన్నారండి. అంతా అరిజంటు." అంటూ ఒగిర్చి, "అమ్మ కూసిని మంచీలొయ్యండి. చల్లని తల్లి." అన్నాడు అసిరయ్య

"దీక్షితులుభార్య పూర్తిగా చల్లబడిపోయింది. "పరగడుపున మంచినీళ్లేవిట్రా వెర్రివెధవా" అంటూ లోపలికివెళ్లి అన్నం వార్చిన వేడిగంజిలో కొంచెం ఉప్పూ మజ్జిగా వేసి తెచ్చింది. ఈలోగా దీక్షితులు నీర్కావిపంచె కట్టి, విభూది తీర్చిదిద్ది, అంగవస్త్రం కప్పుకుని, పంచాంగం చంక

★ కృతజ్ఞత ★

పెట్టుకుని కిర్రుచెప్పులు తొడిగి బయలు దేరాడు సింగారం ఇంటికి.

"ఏకాఏకిని సింగారం ఇంటికి చేరేసరికి, గుమ్మంలో రెండెడ్లబండి పూన్చి సిద్ధంగా ఉంది సామాన్లు సర్దేశారు బండిలో. సింగారం, అతని పెళ్లాం, ఆవిడ ముసలితల్లి ముగ్గురూ పసుపుబట్టలు కట్టుకున్నారు. సింగారం పట్టెవర్ధనాలు తీర్చి దిద్దాడు.

దుకాణం నౌకరు గుమ్మంలో నించున్నాడు చేతులు కట్టుకుని. ఇరుగూ పొరుగులు సింగారం భార్యచేతికి వాళ్లవాళ్ల మొక్కుబడులూ అదీ తెచ్చిస్తున్నారు. కొందరు తిరపతి వడలూ పటికబెల్లం తెమ్మని డబ్బు లిస్తున్నారు.

"దీక్షితులిని చూడగానే సింగారం పరమానందభరితుడు అయిపోయాడు. 'రావయ్యా! రా! నీకోసమే ఆగాను. ముహూర్తం మించిపోతోంది. రైలుకి వేళయిపోతోంది. మరేం లేదు. నీతో ఒక్క - ముక్క. ఒక - విన్నపం - ఒక్క ప్రార్థన చెప్పుకోవాలి. రెండు ముక్కల్లో చెప్పేస్తా. నా గదిలోకి రా...ఒరేయ్! అసిరా సామాన్లన్నీ బండిలో పెట్టార్రా. పెరటి తలుపులూ అవీ కూడా చూసిరా." అని హెచ్చరిస్తూ దీక్షితులు చెయ్యి పట్టుకుని లోపలికి పిలుచుకు వెళ్ళాడు.

లోపల దీక్షితులిని కుర్చీలో కూచోపెట్టి మొదట రాత్రి తనకి వచ్చిన కల వైనం తెలియచెప్పి, ప్రయాణంసంగతి వివరించాడు.

'సరే ఇంక అసలు సంగతి చెప్పవయ్యా' అన్నాడు దీక్షితులు.

సింగారం తటాలున దీక్షితులు రెండు చేతుల్నీ పట్టుకున్నాడు. "దీక్షితులూ! ఇవి చేతులుకావు కాళ్లు అనుకో. మన ఏభైఏళ్ల స్నేహం గుర్తుకు తెచ్చుకో. నేను నీకు చేసిన ఉపకారాలు అన్నిటికీ బదులుగా ఇవాళ నువ్వు నాకు ఒక్క సాయం చెయ్యాలని నా ప్రార్థన. ఆ సహాయం చేస్తావనే నమ్మకంతోనే నేను నీకు ఈ జేబు గడియారం బహుమానం చేస్తున్నా. నీకు ఎప్పటినుంచో దానిమీద మనసుందని నాకు తెలుసు. ఇదేకాదు. నేను తిరిగి వచ్చేవరకూ - మాయింటి పాడి ఆవు మాలక్ష్మిని తోలుకెళ్ళి, పాడి కమ్మగా భోంచెయ్యి, మేత పాలేరుతెచ్చి పెడతాడు. మన స్నేహం అంతా..." అంటూ మళ్ళా మొదలుపెట్టాడు.

దీక్షితులు ఉబ్బితబ్బిబ్బులయిపోయాడు— సింగారం ప్రేమకి. అతనికి కూడా ప్రేమ పెల్లుబికింది. "సింగారం! చెప్పరాదుటోయ్! నీకన్న నా క్కావలసినవాళ్లు ఎవరున్నారు చెప్పు? నీమాట నేను త్రోసిరాజంటానా...నా ప్రాణం అర్పించినా నీ ఋణం తీర్చుకోగలనోయ్!... చెప్పు సంగతి" అన్నాడు.

సింగారం కంట నీరెట్టుకున్నాడు "నాకు తెలుసు దీక్షితులూ. మన స్నేహం వృధా కాదని. నాకు తెలుసు. కాని ఈపని కష్టమైనది. ఇది నువ్వే చెయ్యగలవు. నువ్వే చెయ్యాలి. వాగ్దానం చెయ్యి." అన్నాడు.

దీక్షితులికి ఓర్పు తగ్గిపోయింది. ఆరాటం ఎక్కువైంది. గాయత్రి సాక్షిగా చేస్తాను అని ప్రమాణం చేశాడు. అయినా సింగారం ఉపోద్ఘాతం పునః పునః వర్ణించాడు. "చంపకు చెప్పవయ్యా. నే చేస్తానన్నాగా" అన్నాడు దీక్షితులు.

సింగారం రెండు క్షణాలు ఆగి, నిశ్చలంగా దీక్షితులి కళ్ళలోకి పరీక్షగా చూసి చెప్పేశాడు. "ఏం లేదు. నేను తిరపతినించి తిరిగి వచ్చేవరకూ నా ప్రాణతుల్యమూ, నా బిడ్డవంటిదీ అయిన "టైగర్"ని నీకళ్లలో వత్తులు పెట్టుకు కాపాడాలి. ఈ భూప్రపంచంలో నా పరోక్షాన దాన్ని పాలించి రక్షించేవాళ్లు నువ్వుతప్ప ఇంకెవ్వరూ లేరు. టైగర్ ఎంతో పెంకిది. కొంత అజాగ్రత్తగా ఉంటే అది ఓఘాయిత్యప్పనులు చేసి ప్రాణంమీదకి తెచ్చుకుంటుంది. నీకు తెలీందేముంది" అన్నాడు.

దీక్షితులికి మతిపోయింది. తల గిఱ్ఱున తిరిగింది."

కథ వింటున్న జనం ఫెళ్లున నవ్వారు. "పీడిల్లు బంగారంగానూ. ఇదిటయ్యా వీడు అడిగింది?-ఇంత గొడవా చేస్తే?" అన్నాడు పంతులుగారు.

"అదిగో సరిగ్గా ఆ ముక్కే దీక్షితులు అనుకున్నాడు - సింగారం కోరిక వినగానే. అతనికి ప్రాణం ఉసూరుమనిపించింది. అవమానించబడ్డట్లయింది. సింగారం కోరబోయేది ఆ దంత పెద్దకోరికో అని అంచనాలు వేసుకున్నాడు. శిబి దధీచి బలి కర్ణుడూ మొదలయినవాళ్లకు మల్లె తనుకూడా మహాత్యాగం చేసే అవకాశం లభిస్తుందని ఉవ్విళ్ళూరిపోయాడు. చివరకి "కుక్కని పెంచు పెనవాయా!" అని అతను అడిగే సరికి దీక్షితుల ముఖం పాలిపోయింది. నోట మాటరాలేదు. కళ్లు తేలేశాడు.

దీక్షితులు జావగారిపోయినవిధం చూసి, సింగారం శతవిధాల కంగారుపడి, గబాగబా దీక్షితుల్ని అపార్థం చేసుకోడానికి ఉపక్రమించాడు - "హా! మిత్రమా, ఈ ముద్దు చెల్లింపవా" అంటూ.

దీక్షితులు బుద్ధిమంతుడు. పరేంగితజ్ఞుడు. అందువల్ల తత్క్షణం చిరునవ్వుతో సింగారాన్నూరడించాడు. "నీ యిల్లు బంగారంగానూ ఇదిటయ్యా నువ్వడిగింది!" ఏం పెద్దకోరికో అనుకున్నాను. చేస్తాను గానీ నామాట కొంచెం విను. ఈ కుక్కని ప్రేమించేవాళ్లు యీ లోకంలో నువ్వుతప్ప, నేను మినహా, ఇంకెవ్వరూ లేరు

★ కృతజ్ఞత ★

దీన్ని చూస్తే మండిపడేవాళ్ళలో మొదటిది నా పెళ్ళాం. బద్ధవైరం వాళ్ళిద్దరికీ. ఇపుడు నేను యీ 'టైగర్'ని వెంటేసుకెళ్తే నాకు మా యింట్లో తీర్థంచుక్క పుట్టదు. కానీ సింగారం - నీ కోరిక నేను తప్పకుండా చెల్లిస్తాను. ఒకేమాట, ఒకే పత్ని - ఒకే బాణం అన్నారు. అదీగాక శత్రుని మిత్రుడు నీకు శత్రువైనట్లే మిత్రుని మిత్రుడు నీకు మిత్రుడే అనికూడా అన్నారు సింగారం - ధైర్యంగా వుండు. టైగర్ని నేను కాపాడ్తాను. నువు మాత్రం తొరగారా. అంతవరకూ నేను నిద్రాహారాలు లేకుండా దీన్ని కనిపెట్టుకునుంటా. నువ్వు నిశ్చింతగా పోయిరా" అంటూ దీర్ఘోపన్యాసం చేశాడు. కృతజ్ఞతా, జేబు గడియారం, టైగర్, దాంతోపాటు తన హృదయం అప్పగించాడు సింగారం, దీక్షితులికి. ఇద్దరూ గుమ్మంలోకొచ్చారు. దీక్షితులి కింక అక్కడుండానికి మనసొప్పలేదు. టైగర్ నెలా కాపాడాలో మళ్ళామళ్ళా చెపుతూ సందుమొగదాకా వెళ్ళాడు సింగారం.

"సరే నేవుంటా సింగారం - క్షేమాన పోయి, లాభానరా ఏడుకొండలవాడికి నా దండాలందచెయ్యి" అన్నాడు దీక్షితులు.

దమయంతిని విడిపోయే నలుడిలాగా, కంటిపిల్లని పొరిగింటావిడకి అప్పగించి సినిమాకెడుతున్న తొలిచూలు బాలింతరాలిలాగా తిరిగి తిరిగి టైగర్ వంక చూస్తూ సింగారం బరువెక్కిన గుండెల్తో తన యింటి ముందున్న బండివేపెళ్ళాడు - చెమ్మగిల్లిన కళ్ళని తుడుచుకుంటూ.

దీక్షితులు టైగర్ని తీసుకుని యింటివేపు బయల్దేరాడు. ఇక దీక్షితులి జీవితంలో దుర్దశ ప్రారంభించిందయ్యా. ఇంటికి నడుస్తున్నాడుకానీ మనస్సు పరిపరివిధాల పోయింది. టైగర్ కూడా శాయశక్తులా అతన్ని పరిపరివిధాలుగా లాగుతోంది. అడ్డమైన ప్రతి ఊరకుక్కనీ పలకరించడం, ఆ తరువాత కంయ్ బొంయ్మని తాండవమాడిపోడం. దీక్షితులు దాన్ని అదుపుచెయ్యలేక తిప్పలు పడడం - ఈ భాగోతంచూసి జనం విరగబడి నవ్వడం. ఇంకోటి చూశావూ - ఆ ఊరకుక్కలున్నాయే అవి లోకువ కట్టేశాయి 'టైగర్'ని దీక్షితులు ఎలాగా వదలడూ అన్న ధీమాతో అవి మరీ పేట్రేగిపోయి బంధుమిత్ర బలగంతో సహా మొరుగుతూ పదిగజాలదూరంలో వెంబడించాయి. ఒక చిన్నసైజు రాజుగారూ పరివారమూ ఊరేగినంత వైభవంగా జరిగింది అదృశ్యం.

నాలుగు వీధులూ తిరిగేసరికి కుక్కలూ, జనంకూడా విసుగెత్తి ఎవరిపనులమీద వాళ్ళు వెళ్ళిపోయారు. మొత్తానికి దీక్షితులు కొండకి చేరేసరికి గుడ్లు గూట్లోకొచ్చాయంటేనమ్ము.

'హరిశ్చంద్రుడంతటివాడికి కష్టాలొచ్చాయి. వసుదేవుడు స్వయంగా గాడిద కాళ్ళుపట్టుకొన్నాడు. దీక్షితులూ, సింగారం పట్ల ప్రేమకొద్దీ, మిత్రధర్మం దృష్ట్యా ఓ పాడుకుక్కని పట్టుకుని 'ఊరేగాను' అని తన్నుతనే ఓదార్చుకుంటూ ఇల్లు చేరాడు దీక్షితులు.

ఆసరికే దీక్షితులుభార్యకి, ఊళ్ళో ప్రజ, అంచీలమీద కబురందించేశారు - దీక్షితులుగారు ఊరకుక్కలవెంట ఊరేగుతున్నారని. తెనాలిరామకృష్ణుడు పాలూ పెరుగూ కలిపి జమిలిగా తాగిపారేసిన సందర్భంలో కోపంవచ్చి కాళిక పెట్టినపోజుని తలదన్నే పోజులో, రౌద్రస్వరూపిణియై గుమ్మంలో నుంచుంది దీక్షితులు భార్య.

రాగానే పతిదేవుడికి స్వాగతం చెప్పింది "అయ్యో! హయ్యో! నా బ్రాహ్మణీకం బొగ్గులవా! ఈ పాడుకుక్క మీ కెక్కడ దాపరించిందండీ. ఇదేం బుద్ధొచ్చిపడిందండి మీకూ హవ్వ! ఎవరన్నా చూస్తే చెప్పుతీసి కొట్టి మరీ వెళేస్తారండీ. ఆ వెధవ చెప్పు - మీరు దాన్ని తేనూనా!"

దీక్షితులు అనుకున్నంతా అయింది. కానీ రోటిలో తలదూర్చి రోకటి పోటుకి వెరవనేల? అనటూఅని ధైర్యం చిక్కబట్టుకుని కొద్దిగా సకిలించి యేదో చెప్తూ మెట్లెక్కబోయాడు.

సరిగా సమయంచూసి ఆ యొక్క టైగర్ విజృంభించింది ఆవిడమీదికి బొంయ్ మంటూ.

దీక్షితులు గొలుసు బిగించిపట్టి కిందికి దిగిపోయాడు.

ఆవిడ ఈమాటు భర్తమీదా టైగర్ మీదా కూడా ద్విగుణీకృతమైన కోపంతో దుమ్మెత్తిపోసింది. "ఆ వల్లకాట్లో కుక్కని వాడి ఎదాన కొట్టిరండి. నేను మాలకూడు తినలేను. కాదు కావాలీ అంటే అదీ మీరూ ఈ ఇంట్లో కాపురం చెయ్యండి. నేను మా అన్నయ్యగారింటి కెళ్ళిపోతాను." అంటూనే ఏడుస్తూ భళ్ళున తలుపుమూసి లోపలికి పోయింది. ఇంతసేపూ మొరుగుతున్న టైగరు, ఆపి, మెట్లమీద పడుకుని విశ్రాంతి తీసుకోడానికి ఉపక్రమించింది.

దీక్షితులికి కంట నీరు తిరిగింది. ఉసూరుమంటూ దానిపక్కనే కూర్చున్నాడు.

పదిగంటలైంది. ఆకలివేసింది. ఇంటో కెళ్ళే దోవ కనపడటం లేదు.

"ఛీ — ఈ వెధవకుక్క ..." అనుకుంటూనే నాలిక కరుచుకున్నాడు. తుళ్ళిపడ్డాడు. టైగర్ ఏదీ? తను పరాగ్గావుంటే తప్పించుకుపోయింది. లేచి అటూ ఇటూ చూశాడు. పెరటివేపు వెళ్ళాడు.

హరహర అంటూ నెత్తికొట్టుకున్నాడు. తను పెంచిన కూరమొక్కల్నీ, పూలమొక్కల్నీ, కొత్తిమీరనీ నాశనం చెయ్యడం పూర్తిచేసింది టైగర్.

ఆలోచన మెరిసి కిటికీలోంచి లోపలికి చూశాడు. తన భార్య వీధి తలుపు చిల్లులోంచి బయటికి చూస్తోంది తనకోసం కాబోలు!

ఇపుడు వెనక్కొచ్చి పెరట్లో జరిగిన ఘోరం చూస్తే తనకి పుట్టగతులుండవు - పై ప్రాణాలు పైన పోయాయి. గబుక్కున టైగరు గొలుసు పట్టుకుని బరబర ఈడ్చుకుంటూ రోడ్డునపడి నడక సాగించాడు.

సంతరోడ్డు దాటి కాలవగట్టు చేరేసరికి పొరుగూరినించి వచ్చే నావ రేవు చేరింది. పక్క ఊరిలో ఉంటున్న దీక్షితులి దూరపు చుట్టం గున్నయ్య నావ దిగాడు, సంచీ, ఓ కూరల బుట్టా పట్టుకుని—

"ఓహో భావగారు! ఏవిషి ఏవిషీ. ఆడబోయిన తీర్థం ఎదురయింది వెదకబోయిన తీగ కాలికి తగిలింది షికారుగా వచ్చారు కామోసు. అయినా యిదేమిటండీ - కుక్కని వెంటబెట్టుకు తిరుగుతున్నారు! అక్కగారు కులాసేనా?" అంటూ లకు చదివాడు.

దీక్షితులు జవాబివ్వలేదు. ఆ బిక్కమొహంలో చలనం లేదు.

గున్నయ్య విస్తుబోయాడు.

"ఏవిటండీ బావగారు! మాట్లాడరు. అంతా క్షేమమేనా?" అన్నాడు కంగారుగా.

"ఆఁ! క్షేమమే" అన్నాడు దీక్షితులు నీరసంగా.

"మరయితే నే ఒచ్చిన పని చెబుతా వినండి. ఇవా చల్లకొచ్చి ముంత దాచనేల! మరేవీ లేదూ - మా పొరుగింటి శాస్త్రుల్తో తగాయిదా ముదిరింది పెరటిగోడ విషయమై. దావాపడేశాను. రేపు కోరటులో హాజరు కమ్మన్నారు. తమరి అనుమతి లేకుండా సాక్షిగా వేశాను. మరోలా అనుకోకండా...అయినా ఇంటికి దయచెయ్యండి వివరాలు చెబుతాను. అక్కగారి కిష్టమని మాంఛి నవనవలాడే వంకాయలూ అవీకూడా తెచ్చాను."

దీక్షితులు కొంచెం కంగారు పడ్డాడు "కాదులే గున్నయ్యా. ఇంటికి వద్దు. ఆవిడ

విశ్వరూపం ఎత్తివుంది. ఈ వళాన నేను వచ్చేస్తా. తిరుగునావకి పోదాం" అన్నాడు.

గున్నయ్య బ్రహ్మానంద పడిపోయాడు "బావగారి శేవిదయ ఏవిదయ! అల్లాగే కానీండి నేను అనుక్కునాన్నండీ! తమరు నా మాట కాదనరని...ఆఁ...తిరుగునావ మధ్యాహ్నం రొండుఘంటలకి బయలుదేరుతుంది...అంతవరకూ..." అంటూ నసిగాడు.

"ఏం లేదు. అలా షంత వేపు పోయి నాలుగు పళ్ళు ఫలాలు తిని మళ్ళావచ్చి ఇక్కడే పడుందాం...అన్నట్టు గున్నయా. ఈ కుక్క ఉంది చూశావూ - దీన్ని ఓ మిత్రుడు అప్పగించి తిరుపతెళ్లాడు అతను వచ్చేవరకూ. అతను వచ్చే వరకూ దీన్ని కంట్లో గుడ్డులా కాపాడాల్సిన బాధ్యత నామీద వుంది. మరి - నేను నీతో వస్తే దీన్ని వెంటబెట్టుకెళ్ళాలి మనం"

"ఎంతమా ఒంతమాట! అవశ్యం అలాగే చేదాం. మరోటి బావగారూ - తమరి శ్రమ ఊరికే ఉంచుకోను - ఇదుగో - ఇది చిల్లర-కర్చులకి ఉంచండి - అందాకా..." అన్నాడు గున్నయ్య రొంటినుంచి రెండు పదులు తీసిస్తూ.

రెండుగంటలకి నావవాడి కొళ్ళావేళ్ళా ప్రాధేయపడి కుక్కా, దీక్షితులూ, గున్నయ్యా నావఎక్కారు. కబుర్లమీద దీక్షితులు "అసలు ఎందుకయ్యా మీకూ మీకూ పోట్లాట?" అన్నాడు.

"ఆఁ బావుంది. అది లేపోతే మా గొప్పేముంది" అన్నాడు గున్నయ్య నవ్వుతూ.

సరే సాయంకాలానికి గున్నయ్య ఊరు చేరారు. కుక్కకి జాగ్రత్తగా నీళ్ళుపోసి పాలూ అన్నంపెట్టి బుజ్జగించి బబ్బోబెట్టాడు దీక్షితులు.

ఆరాత్రి టైగర్ పెట్టిన పోరుకి దీక్షితులుపడిన యాతన ఇద్దరికే తెలుసు. ఒకడు దీక్షితులు - రెండోవాడు పరమాత్ముడూనూ.

ఆఊళ్లో కుక్కలన్నీ ఆరాత్రి దీక్షితులు మంచందగ్గర జాగారం చేశాయి; టైగర్ ఆగమనంపట్ల నిరసన ప్రకటిస్తూ. చామాలమ్మ జాతరకూడా అంత సందడిగా ఉండి ఉండదు. ఏకుక్క ఏక్షణాన మీద పడి కరుస్తుందో అని దీక్షితులు ప్రాణా లుగ్గబట్టుక్కూచున్నాడు.

చాలీచాలని జీతంతో యాతనపడే గుమాస్తాపాలిట ఒకటో తారీఖు వచ్చినంత ఆలశ్యంగా తెల్లవారింది దీక్షితులికి. స్నానం సంధ్య కానిచ్చుకుందికి కాలవకి వెళ్లాడు దీక్షితులు. టైగర్ ని వీధిఅరుగుమీద స్థంభానికి కట్టి మరీ వెళ్ళాడు. కానీ తిరిగి వచ్చేసరికి టైగర్ అక్కడ లేదు. ఉట్టి గొలుసుంది. గుండె గుభేలుమంది.

ఒక్కమాటుగా లోపలకి పరిగెత్తాడు. "టైగర్! గున్నయ్యేదీ! గున్నయ్యా టైగర్ ఏడీ" అంటూ.

సరాసరి పెరట్లోకెళ్లేసరికి టైగర్ గదమాయించి మొరుగుతోంది పక్కింటి పెరట్లో.

తగాయిదావున్న గోడ కానుకుని వినోదం చూస్తున్నాడు గున్నయ్య. "రండి బావగారు! రండి! త్వరగా" అన్నాడు. దీక్షితులు గోడదగ్గరకువెళ్ళి ఆ వైపు చూశాడు.

మూడ చక్కటి దృశ్యం గోచరమైంది పక్కపెరట్లో.

పొరుగింటి శాస్తుర్లుగారికీ, టైగర్ కీ అత్యున్నతస్థాయిలో తీవ్రతమ సంఘర్షణ జరుగుతోంది.

సంధ్యావందనం ముగించుకుని, నీళ్ళు తులసికోటలో పోసి లోపలకి వెళ్ళబోతున్నారు శాస్తుర్లుగారు. టైగర్ చివరి విషయంలో శాస్త్రిలుగారితో ఏకీభవించలేకపోయింది - ఆయన దారికడ్డుగా కూర్చుంది.

గావంచాకట్టుకుని, చేతిలో పంచపాత్ర పట్టుకుని ధుమధుమలాడిపోతున్నారు ఆయన. టైగర్ జోరుగా మొరుగుతోంది.

గోడవతల, తన శత్రువు గున్నయ్యా, టైగర్ యజమాని దీక్షితులూ నించుని తనని చూడటం గమనించిన శాస్తుర్లు గంగవెర్రులెత్తిపోయాడు. టైగర్ ని దుమ్మెత్తిపోశాడు.

"ఛీ - ఛీ! వెధవకుక్కా - అడ్డులే... డొక్క వాలికలు చేసేస్తా నేమనుకుంటున్నావో ఏవిటో - ఛడవా...ఎవడో వెధవ ఉసికొల్పితే, వాడి ఉచ్ఛిష్టం కతికి, నామీద పడతావూ...వాడికి బుద్ధిలేకపోతే నీకన్నా వుండద్దూ...లేవ్వేం ... ఇదుగో చెబుతున్నా - కోపంవస్తే నేను మనిషిని గాను ముప్పు తిప్పలాపెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించేస్తా కబడ్దార్—మరి చూస్కోనా తడాఖా" అంటూ.

టైగర్ ఒక్కక్షణం, వేదాంతిలా ముఖంపెట్టి తల పక్కకి వంచి శాస్త్రిల్ని చూసింది, మొరగడం ఆపి. వెంటనే విజృంభించింది మళ్ళీ. మొరుగుతూ ఒక్కడుగు ముందుకు వేసేసరికి శాస్త్రి కంగారు పడిపోయాడు. "ఆఁయ్! ఆఁయ్! వెధవా-అక్కడే ఆగు - అడుగు ముందరికి వేశావా ఫంపేస్తా —ఈ చెంబుతో కొడతా - " అన్నాడు.

"పెన్నిగారూ — ఒళ్ళు నిప్పర వ్వాడతారూ?" అంటూ వచ్చిన పక్కింటి పూర్వసువాసిని రాజమ్మ కొయ్యబారిపోయింది - శాస్త్రి మాటలు వినగానే.

ఆవిడ మొహం చెక్కుతీసిన కందగడ్డలా అయిపోయింది. "ఔరా ఔరా ఎంత మాటన్నావూ!" అంటూ విజృంభించింది.

గంభీరమైన ఆ గొంతు వినగానే టైగర్ బెదరిపోయి శాస్త్రివైపు రెండడుగులేసింది.

టైగర్ కరవడానికొస్తోందన్న దురభిప్రాయంతో శాస్త్రి 'హుఁ' అని గర్జించాడు.

"నీకేం పోగాలం వచ్చిందయ్యా. చెట్టంత మొగాడివి. నామీద అలా విరుచుకు పడిపోతావ్ - ఛీ!" అంటూ తిరిగిపోయిందావిడ.

ఈలోగానే శాస్త్రి "హుఁ!" అని ఇంకోమాటు గర్జించాడు. టైగర్ శాస్త్రిని పూర్తిగా అపార్థం చేసుకుంది. పైగా వెనకనించి రాజమ్మగారు 'ఛీ' అంది. పౌరుషంతో ముందుకు లంఘించింది టైగర్.

శాస్త్రి పంచపాత్ర పారవేశాడు. బాబు మంటూ పిట్టగోడ ఎక్కి ఊడిన గోచీ లెక్కచేయకుండా అవతల రోడ్డుమీదకి దూకి పరుగు లంకించుకున్నాడు.

మురిడీలు, కమ్మలూ తగిలించుకుని, నల్లకోటు వేసుకుని, వెండిపొన్ను కర్ర పట్టుకుని, చెమికీచెడావులు తొడిగి, విలాసంగా కులుకుతూ, హాయిలుతో, చిరునవ్వుతో మీసాలు మెలేసుకుంటూ, నీళ్లు పట్టికెడుతున్న సాతాని పిల్లవంక తళుకులు విసురుతూ రీవిగా నడుస్తూ వస్తున్న నాయుణ్ని సరాసరి ఢీకొన్నాడు శాస్త్రి - ఇద్దరూ రోడ్డుమీద పడ్డారు.

నాయుడు తటాలున లేచిపోయాడు. శాస్త్రిని తిట్టడానిక్కూడా టైము లేదు. దుమ్ము దులుపుకుని, సాతానిపిల్లని మాలీసు చెయ్యడానికి తిరిగి రీవితో నడక సాగించాడు. అయిదారడుగులు వేసేలోగా, అప్పుడే గోడ దాటిన టైగర్ నాయుడి నల్లకోటు చూసి ముచ్చటపడి, అతనిమీదకి లంఘించింది. నాయుడు బెంబేలెత్తిపోయాడు. దెబ్బతో, పొన్నుకర్రా రీవీ వగయిరా వదిలేసి కాలికి బుద్ధిచెప్పి సరాసరి చౌదరిగారి పెద్దరుగెక్కిపోయాడు. ఆ కంగారులో అతడు అరుగుమీదఉండుకున్న అరటిపండుతొక్కని చూసుకోకపోడం వల్ల దానిమీద కాలువేసినవాడై, ఆ సమయానికి తరుముతూ అరుగుకిందకి వచ్చివున్న టైగర్ మీదే పడ్డాడు. టైగర్ కంయ్యో మంటూ నాయుడిమీద మోజు తగ్గిపోయి, అప్పటికి లేచి పరిగెత్తుతున్న శాస్త్రిని వెంబడించింది. తృటిలో శాస్త్రి మీద పడి పిక్కమీద తేలిగ్గా కాటేసింది

శాస్త్రి లబోదిబో మన్నాడు రక్తం చూసుకుని.

ఈలోగా దీక్షితులు పరిగెత్తుకువచ్చి, టైగర్ని పట్టుకుని దాని మెడకి గొలుసుకట్టి



రజకులు; రమణులు

ఫొటో: జి. ఎస్. భూషన్ (మద్రాసు)

★ కృతజ్ఞత ★

గబగబా కొంప జేరాడు. గున్నయ్యకి కోటు విషయం తెలీగానే గుండె గుభేలుమంది.

"ఏమయ్యా! దీక్షితులూ - కుక్కని మనమే ఊసికొలిపామనీ శాస్త్రి మనమీద క్రిమినల్ దావా పడెయ్యడుగదా!" అన్నాడు.

"ఏం ఖర్మమో ఏమిటోనయ్యా. నా ప్రాణాని కొచ్చిందంతా. నాకు పిచ్చెత్తుతోంది" అన్నాడు దీక్షితులు.

టైగర్ పక్కగదిలో మొరిగింది ఇద్దరూ ఒక్కమాటు పరిగెత్తారు. గున్నయ్య పట్నంనించి తెచ్చుకున్న పట్టు తలగడాతో హోరాహోరి పోట్లాడి, ఆ దిండుని తునకలుచేసి అప్పుడే విజయగర్జన చేస్తోంది టైగర్.

"దవ్వ వీళ్ళల్లాంటి ఆరుకరుకు రూపాయిలు పోసి తెచ్చిన పట్టుతలగడా నాశనం అయిపోవడం చూడగానే గున్నయ్య వీరావేశం ఎత్తిపోయాడు.

"నీ కుక్క నాశనం అయిపోనూ! నీ పిండం పిల్లులుతినా! నాకర్మం కాలి నిన్నెందుకు తెచ్చుకున్నానయ్యా పాపిష్టి నికీ! డబ్బిచ్చి దద్దినం తెచ్చుకున్నట్టూ... నాదీ వెధవబుద్ధి. హుఁ!" అంటూ నెత్తి కొట్టుకున్నాడు గున్నయ్య. అక్కడితో ఆగలేక టైగర్ మీద కురికాడు; "వెధవ కుక్కా. నా దిండు నీ ఎదాన పెట్టుకుంటావా" అంటూ.

సంప్రదాయం దృష్ట్యా ఏదో మాట వరసకి కొంచెం మొరిగి గున్నయ్య పిక్క పట్టుకుంది టైగర్. దీక్షితులు తాత్కాలిక స్వంతదారుని ధీమాతో రంగభూమి కురికాడు. "టైగర్! దా! దా!" అంటూనే దాన్ని పీక పట్టుకోబోయి తొందర్లో తోక పట్టుకున్నాడు.

వెంటనే టైగర్ తన వంతుగా, దీక్షితులి చెయ్యటుకుంది.

సద్బ్రాహ్మణు లిద్దరూ పెంకు లెగిరిపోయేట్టు గావు కేకలు పెట్టారు. గున్నయ్యభార్య వంటింటిలోంచి పరిగెట్టుకొచ్చింది పోపు గరిటతో సహా. "హామ్మో! నేనేంచేతునమ్మ-నా మొగుణ్ణి మాయదారి కుక్క కరిచిందర్రోయ్! హామ్మో దేవుడోయ్" అంటూ అందుకుంది.


టైగర్ బెంబేలెత్తిపోయింది. ఆవిడమీద కొచ్చింది. తక్షణం ఆవిడ జాగర్తపడి, ఎర్రగా కాలి, మరుగుతూన్న నూనెతో వున్న ఆయొక్క పోపుగరిటితో టైగర్ పొట్టమీద కొట్టింది.

టైగర్ హృదయ విదారకంగా ఒక్క కేకపెట్టి వీధివైపు పరిగెత్తింది - "ఓ యజమానీ! నువ్వు నన్ను విదలబెట్టిగదా - నేను ఇన్ని హింసలపాలయ్యాను!" అని.

కుక్క కరచిన నెప్పికన్నా, ఈ అరుపు విని, టైగర్ బాధ ఊహించుకున్నాడు దీక్షితులు. ఇది తెలిస్తే తన మిత్రుడు సింగారం పడేబాధ, తలపుకి తెచ్చుకునేసరికి దీక్షితులికి కడుపు తరుక్కుపోయింది.

"టైగర్! నేనుండగా నీకు భయంలేదు. తొందరపడకు - ఆగు - నే రక్షిస్తా" అంటూ అతను వీధిలోకి పరిగెత్తాడు.

వీధిలో ఇంటిముందు పాలికమంది



పరమపావని గౌతమి ఫొటో: జి ఎన్. భూషణ్ (మద్రాసు)

క్రరలూ కత్తులూ పట్టుకుని కదం తొక్కుతున్నారు.

నల్లకోటు నాయుడూ, అంగోస్త్రంతో శాస్త్రులూ శివమెత్తి ఆడిపోతున్నారు గున్నయ్య పొరుగూరినించీ దయ్యాలమారి గాణ్ణి తెచ్చి, వాడి కుక్క చేత తన శత్రువుల్ని కరిపించేస్తున్నాడన్న వార్త ఊళ్ళో అపుడే పాక్కి పోయినందువల్ల రకరకాల పార్టీలవాళ్ళు, నాయుడి కమతగాళ్ళూ, శాస్త్రి ముటపక్కాలూ సందు దొరికితే సరదాకి కొట్టేవాళ్ళూ, రకరకాల జనాభా, ఒకకనిస్టేపూ తయారయ్యారు.

గంగవెర్రులెత్తిపోయిన టైగర్, జనం మీద పడింది. అందినకాడికి తలో ఇంజక్షనూ ఇచ్చింది.

దీక్షితులు ఆ గగ్గోలులో, తొక్కిడిలో టైగర్ని పట్టుకుందికి ప్రయత్నించాడు కానీ వల్లకాలేదు.

ఐదునిమిషాల్లో జనం నిలదొక్కుకుని చిన్న వలయంగా ఏర్పడ్డారు.

మరణించిన టైగర్ మధ్య పడి ఉంది.

చితకపాడి చేశారు దాన్ని. 'పిచ్చి కుక్క'ని చంపినందుకు జనం 'హమ్మయ్య' అనుకున్నారు.

పారిపోయి దూరంనించి చూసిన దీక్షితులు రెండు కన్నీటి బొట్లు విడిచాడు - మిత్రుడు సింగారాన్ని తలచుకొని.

ఈడిగాడు వచ్చి కుక్కని ఈడ్చుకుపోయాడు.

దీక్షితులు బరువెక్కిన హృదయంతో పడవలరేవు చేరి నావ ఎక్కాడు. గున్నయ్య పరుగు పరుగున ఒగరుస్తూ వచ్చి, బయలుదేరిన నావని ఆపి, చెడామడా తిట్టాడు దీక్షితుల్ని. "నీమూలాన నా కోర్టుదావా తగలడింది. శనివెధవా. దయచెయ్యి - నాకు చేసింది చాలుకానీ నా డబ్బు నాకిలా తగలెయ్!" అంటూ దీక్షితులు రొండిన ఉన్న పందొమ్మిది రూపాయల అరణాలనీ ఊడలాక్కుని నావ దిగాడు.

"అన్నట్టు నా గడియారం! నా గడియారం గున్నయ్యా!" అన్నాడు దీక్షితులు.

"నీ గడియారం రోడ్డుమీద పడి జనం కాళ్ళ కిందపడి చితికిపోయింది. ఈడిగాడు పట్టుకుపోయాడు. వెళ్ళి తెచ్చుకో" అంటూ వెళ్ళిపోయాడు గున్నయ్య.

కుక్కనీ, గడియారాన్నీ, మంచిపేరునీ, స్నేహాన్నీ పోగొట్టుకున్నందుకు ఏకధారగా ఏడ్చాడు దీక్షితులు.

సాయంత్రానికి ఇల్లు చేరాడు.

మొగుడి వాటం, తీరూ చూసి అప్పటికే బెంగటిల్లిపోయిన అతని భార్య భోరున ఏడ్చి ఉపచర్య చేసి, దాహం ఇచ్చి పడుకోబెట్టి, విసురుతూ చెడామడా తిట్టింది - తనని యిలా రాసి రంపాన్న పెడుతున్నందుకు.

బెదిరిపోయిన దీక్షితులికి దీపాల వేళకల్లా అంపకంపాలతో జ్వరం వచ్చేసింది. ఘనవైద్యుడు దేవరగారు వచ్చి, చేదుమందు పోసి చెడామడా చివాట్లు పెట్టిపోయాడు. బంగారంవంటి బ్రాహ్మడికి ఊరకుక్కల సావాసం చెడిసికొట్టిందన్నారు ఇరుగూ పొరుగూ. దీక్షితులి భార్య పొరిగింటి బామ్మగారిచేత దిష్టి తీయించి చారెడు ఉప్పూ, గుప్పెడు మిరపకాయలూ, కణకణలాడే నిప్పుల్లో పోయించి ఊహాశత్రువుల్ని దుమ్మెత్తిపోసింది.

ఆ రాత్రి దీక్షితులికి పీడకలలొచ్చాయి. టైగరూ, గున్నయ్యా, నాయుడూ, సింగారం, అందరూ కనపడ్డారు. టైగరు తనమీద చాడీలు చెప్తోంది సింగారంతో. చీటికీ మాటికీ ఉలికులికిపడి కలవరించాడు దీక్షి

★ కృతజ్ఞత ★

తులు. తెలివితెచ్చుకుని భోరున ఏడిచాడు, తన అశక్తతకి. ఆ పట్టుపట్టు ఐదుపూటలు కటికలంకణం చేశాడు. మూడో నాడు ఉదయం లేచికూచుని నాలుగు చారూ మెతుకులు ఎంగిలిపడ్డాడు.

"జౌనే అమ్మా - నిన్నా మొన్నా నాకోసం ఎవరేనా ఒచ్చారటే" అన్నాడు నీసరంగా.

"ఏం? కచ్చేరీ కెళ్లాలా. దయచెయ్యండి. ఈబోడి కచేరీతే నా కొంపకి తిప్పలు తెచ్చాయి. వాడి ఆవునికూడా తోలాడు నా కొంపకి. దాన్నికూడా తీసుకపొండి. ఇంతోటిపాడికి నే నేం మొహం వాచ లేదు."అం దావిడ.

"దీచ్చితులుగోరూ! చింగారంగో రొచ్చేసినారండి. తవ ర్నింటనే టైగ ర్నెట్టుకుని రమ్మన్నారండి. - పెసాదం అదీ ఎడతారంట" అంటూ లోపలి కొచ్చే శాడు సింగారం నవుకరు.

గుండె గుభేలుమంది దీక్షితులికి.

"దయచెయ్యండి. దూత సిద్ధమయ్యాడు" అంటూ గసురుకుంది దీక్షితులి అర్ధాంగి.

ఒక్క క్షణం ఆలోచించాడు దీక్షితులు. "సరే వెళ్తున్నా. ఒరేయ్-పెరట్లో ఆవుంది తోలుకుపోరా" అంటూ అంగోస్త్రం భుజాన వేసుకుని బయల్దేరాడు.

ఆవిడగారు కొయ్యబారిపోయారు.

సింగారంగారి చావిడి సందడిగా ఉంది. వాళ్ళూ వీళ్ళూ, మునసబూ, కరణంగారి తమ్ముడూ, నాలుగైదుగురు బ్రాహ్మలూ, ఇతరత్రా కొందరూ, తిరపతిముచ్చటలు విని ప్రసాదాలూ అవీ పుచ్చుకొంటు న్నారు. గుమ్మంలో నీరసంగా, నిర్జీవంగా జంకుతూ, నించున్న దీక్షితుల్ని చూడ గానే సింగారం చెంగున గంతేశాడు.

"టైగ రేది దీక్షితులూ?......దాదా - అలా పాలిపోయావేం. వంట్లో కులాసా? టైగర్ బావుందా - ఏదీ—" అంటూ శర వేగంతో ప్రశ్నలు వేశాడు.

దీక్షితులు నివ్వెరబోయాడు. మనసు కలుక్కుమంది. శవమల్లె వున్న తన సంగతి అడక్కుండా ముందు టైగర్ సంగతడి గాడు సింగారం. ఇదా వీడి ప్రేమ అనుకు న్నాడు. ఈలోగా సింగారం తాండవమూ చే స్తున్నాడు టైగరు భజనతో.

జనం అందరూ మాటలు మానేసి గుడ్లప్ప చెప్పి ఈ దృశ్యం చూస్తున్నారు.

గుండె దిట్టం చేస్కుని చావుకబురు చల్లగా చెప్పేశాడు దీక్షితులు. "సింగారం-కోప్పడకు - టైగర్ మరణించింది. నాకు చావు తప్పి కను లొట్టపోయింది. నన్ను కూడా కరిచింది."

సింగారం ఇంకేం వినలేదు.

గోల్లు మన్నాడు. భోయ్యి మన్నాడు. బావురు మన్నాడు. భోరు మన్నాడు. ఒక్క నిమిషం ఊరుకున్నాడు. అంతా నిశ్శబ్దం.

తిరిగి ఒక్కమాటుగా మహోకసితో అప హ్యంగా అడిగాడు.

"నా ఆ వేదీ? దాన్ని కూడా చంపావా?"

"లేదు. ఇపుడే మీ నౌకరుకి అప్ప చెప్పాను."

"నా గడియారం ఏదీ?"

"లేదు. జనం టైగర్ని కొడుతూఉంటే నేను కాపాడబోయి కిందపడ్డాను. ఆ గోలలో కిందపడి జనం కాళ్ళకిందపడి చితికిపోయింది.

"సద్బ్రాహ్మడివనీ, సజ్జనుడవనీ, సన్మిత్రుడవనీ నిన్ను నమ్మి టైగర్ని అప్పచె ప్పాను దానికి ముడుపుగా వందరూపా యల గడియారం ఇచ్చా. ఆవుని ఇచ్చా. దాని పాడి తాగి, గడియారం అమ్ముకుని, ఇన్నేళ్ళగా నా సాయంపొంది, నువ్వు నాకు చేసిన ఉపకారం ఏవిటయ్యా అంటే - నాకుక్కని చంపించడం. కృతఘ్నత అంటే నీదేనయ్యా! వినండయ్యా పెద్ద మనుషులూ - పాలిచ్చిన ఎదుర్రొమ్ము గుద్దిన వీరుడిగాథ - సరేలే దీక్షితులూ - నీకు నీతి లేదుగానీ నాకు ఉంది. నువ్వెళ్లు. ఇంకెపుడూ నా మొహం చూడవద్దు. నా గుమ్మం తొక్కకు. నీకూ నాకూ టైగర్తోనే ఋణం తీరిపోయింది. దయచెయ్. నీకూ నీ పెద్దలకీ ఓ నమస్కారం." అన్నాడు సింగారం.

దీక్షితులు కొయ్యబారిపోయాడు. నోట మాట రాలేదు. తల తిరిగిపోయింది. జనం లోంచి నిట్టూర్పులూ, హాహాకారాలు, ఛీఛీలు వినబడ్డాయి. ఇంక తనేం చెప్పినా లాభం లేదు.

ఇక్కడా అక్కడా కూడా పుణ్యాని కెళ్ళితే పాపం ఎదురైంది. అతనికి మనస్సు విరిగిపోయింది. ఆత్మవిశ్వాసం, పర విశ్వాసం నశించాయి. హృదయం శత ఛిద్రాలైపోయింది.

తల వంచుకుని ఇంటికి నడిచి వెళ్ళిపో యాడు. అప్పుడేకాదు - ఇప్పుడూ - ఎప్పుడూ - అంతే-అతను మళ్ళా ఎన్నడూ తలఎత్తి నడవలేదు.

కృతజ్ఞత పొందవలసిన తనని, సింగారం, అతనితో బాటు లోకం, కృతఘ్నుడంది. అంచేత అబ్బాయ్ - అది అంతే. లోకం అంతే.

నీతి చెబుతా విను. ఈ భూప్రపంచంలో ఎదటివాడిలో కృతజ్ఞతకోసం ఆశించేకన్న ఆంధ్ర రాజకీయనాయకుల్లో ఐకమత్యా నికి ఆశించు. ఆంధ్రుల్లో కార్యశూరత్వాన్ని ఆశించు.

నువ్వు సఫలీకృతమనోరథుడవడానికి అవకాశాలు లేకపోలేదని నేను అనబోటం లేదు. ★

టెలిఫోన్ మోగింది.

"హాల్లో!"

"హాల్లో!"

"రావుగారా!"

"అవునండి"

"రావుగారేనా?"

"అవునండీ"

"రావుగారి కంఠంలా లేదే!"


"రావు నేనండి! చెప్పండి!"

"నేనూ మూర్తినిలెండి."

"ఆఁ! ఏమండీ?"

"మరేం లేదు - నాకు అర్జంటుగా ఐదురూపాయలు అప్పు కావాలి"

"సరేలెండి - రావుగారువస్తే చెప్పుతాలెండి.!"



సీరియల్ "శారద"

13

లంకపల్లినుంచి తిరిగి బెజవాడ వచ్చారు పద్మ భాస్కర్రావులు. భద్రయ్యగారికి సుస్తీ ఎక్కువగావుంది. సుదర్శనం గారు వొచ్చి చూసి వెళ్ళాడు. భాస్కర్రావు, పద్మ కంగారుపడి పెద్ద డాక్టర్ని పిలిచి చూపించారు. ఆయన ఏమీ ఫర్వాలేదన్నాడు. సుదర్శనంగారు భద్రయ్యగారితో భాస్కర్రావు వివాహం విషయం ఎత్తాడు. భద్రయ్యగారు "అబ్బాయి కిష్టమైతే నా దేమిటంసి సుదర్శనంగారు!" అన్నాడు.

పద్మకి చిరాకనిపించింది. భాస్కర్రావుకి పెళ్ళా! తన కేదో అన్యాయం జరుగుతున్నట్టుంది ఆమెకి.

సుదర్శనంగార్ని చూస్తే ఆపాదమస్తకం మండిపోతున్నది. తనని ఈ ముసలాడికిచ్చి పెళ్ళిచేసి తన కూతుర్ని భాస్కర్రావు కిచ్చి పెళ్ళిచేద్దామని ఈయన ఉద్దేశమా!

స్నేహితు లిద్దరి సంభాషణా కొనసాగింది; తన ఆస్తి యావత్తూ తన కూతురుకేనన్నాడు సుదర్శనంగారు భద్రయ్యగారి ముఖం వికసించింది. ఏదో అంతర్యం తెలిసినవాడల్లే సాలోచనగా సుదర్శనంగారు—పద్మకేసి చూసి "అమ్మాయిని చూడ్డానికి రండి సాయంకాలం, వస్తావుగదమ్మా!" అన్నాడు.

పద్మ తలవూపింది. లోలోపల ద్వేషం. తనకి స్వంతమైన వాణ్ణి వీళ్ళందరూ కలిసి కుట్రచేసి తననించి వేరుచేస్తున్నారనిపించింది. కాని మాట్లాడ్డానికి నోరు రాలేదు—ఎలాగ!

సుదర్శనంగారు వెళ్ళిపోయాడు. భద్రయ్యగారు కొడుకుతో చెప్పాడీ సంగతి. భాస్కర్రావు మౌనంగా విని వూరుకున్నాడు. అతని మనస్సులో ఏ వుద్రేకమూ లేదు. తండ్రికోసం వెళ్ళి సాంప్రదాయం ప్రకారం పిల్లను చూసివద్దాం...అనుకున్నాడు. సరోజని ఎందుకో కంటబడకుండా తప్పించుకు తిరుగుతోంది. ఆ యీడు పిల్లలకు సిగ్గు సహజం అనుకున్నాడు.

ఆవేళే సుదర్శనంగారు తన కూతురుతో పెళ్ళిసంగతి చెప్పి "ఇవ్వాళ వాళ్ళు నిన్ను చూడ్డానికి వస్తారు అమ్మాయి" అన్నాడు.

"ఎట్లా?" అన్న దామె.

"ఎట్లాగని నేను ఆలోచిస్తున్నాను. కాని ఎట్లాగో నెరవేర్చెయ్యాలి మరి. భాస్కర్రావువంటి అల్లుడు దొరకడం మాటలా మరి!"

"నాకు పెళ్ళి వద్దు నాన్నా!"

"ఛా-ఛా-అవేంమాటలే పిచ్చి పిల్లా! నా యావదాస్తి సర్వశక్తీ ధారపోసి నీకు పెళ్ళిచేస్తాను, దిగులుపడకు. నీకంటే ఎక్కువ నా కింకేముంది?"

"అదంతా సరే నాన్నా. అతను పెళ్ళికి వొప్పుకుంటాడా అని!"

"వొప్పించే భారం నాది! నేను చెప్పినట్టు చెయ్యి నువ్వు."

"ఏం చెయ్యమంటారో చెప్పండి. అయినా నాకీ పెళ్ళి ఎందుకో వొద్దనిపిస్తోంది."

"అమ్మాయి! డబ్బే లేకపోతే నేనూ నీకు మల్లే అధైర్యపడే వాణ్ణే. కాని, డబ్బుకుండేశక్తి నాకు బాగా తెలుసు. నువ్వల్లా నేను చెప్పినట్టు చెయ్యి. అంతే"

"సరే" అంది కూతురు.

ఇద్దరి మనస్సుల్లోనూ ఆశ, నిరాశలు అలలుగా పైకిలేస్తూ, కిందికి పడుతూ గదిలోనుంచి తండ్రి వెళ్ళాక, సరోజని అద్దం ముందు నిల్చుని, మేలిముసుగుగుండా తన మొహం చూసుకుంది. ఆమెకళ్ళల్లో భయంకరా వేదన కనిపించింది. ఇంకో గంటలో వాళ్లు వస్తారు. వాళ్ళకంటబడి, తన పక్షాన డబ్బొక్కటే అండపెట్టుకొని వాళ్ళను చూడాలి!...దారుణం! తనకి పెళ్ళిలేకపోతే ఏం ఒకవేళ ఏదైనా అవమానం పాలుకావచ్చు...ఆమె మనస్సులో ఆలోచనలన్నీ రాబోయ్యే ఆక్షణంచుట్టూ తిరుగుతున్నాయి.

పదీ, పదిన్నర అవుతోంది. ఎండ తీక్షణంగా వుంది. జట్కాలో భాస్కర్రావు, భద్రయ్యగారు, పద్మ ముగ్గురూ సుదర్శనంగారింటిముందు దిగారు. పద్మ మనస్సులో, పెనుతుపాను చెలరేగింది. భద్రయ్యగారు, సుదర్శనంగారి ఆస్తి విలువను ఇప్పటికి పదోసారి అంచనా వేసుకున్నాడు. భాస్కర్రావు ఏ ఆలోచనా లేకండా నిర్మలంగా వున్నాడు. సుదర్శనంగారూ, కమలమ్మ ఎదురువచ్చి ముగ్గుర్నీ లోపలికి తీసుకువెళ్ళారు. ఇల్లు ప్రశాంతంగా ఉంది.

పద్మ లోపలికెళ్ళి కమలమ్మగారితో మాట్లాడుతోంది. భద్రయ్యగారితో సుదర్శనంగారు మాట్లాడుతున్నారు. సుదర్శనం

★ మంచీ - చెడూ ★

గారి మొహం క్షణానికోసారి తెల్లబడిపోతూ వుంది. సరోజనిని తీసుకురావాలి-ఆయన మనస్సు అక్కడే ఆగిఆలోచిస్తోంది. భాస్కర్రావు చుట్టూ చూస్తూ కూర్చున్నాడు. కమలమ్మగారు పద్మతో కూడా కలిసి మేడమీదికి వెళ్ళింది—కూతుర్ని తీసుకురావటానికి. సుదర్శనంగారి గుండెలు దడదడలాడుతున్నాయి ఆక్షణం! సరోజనివొచ్చి అందరిఎదుటా కూర్చుని, మేలిముసుగుతీసే క్షణం—తన లక్షలఆస్తి—తన పదిహేనేళ్ళ స్నేహం—పలుకుబడి, ఎన్ని కలిసినా, అన్నీ తాకట్టుపెట్టినా—తనను రక్షించగలవా!...ఆయనకు పిచ్చెక్కిపోతోంది.

ముగ్గురూ మేడమీదినించి కిందికి వచ్చారు. భద్రయ్యగారు నవ్వుతున్నాడు. సుదర్శనంగారు గట్టిగా కళ్లు మూసుకుందామని కనిపెట్టుకు కూచున్నాడు...భాస్కర్రావు, సరోజని—ఈ ఇద్దరే ఆయనకి మారిమారి కనిపిస్తున్నారు. సుదర్శనంగారిదృష్టికి అంతా మసిబారిన అద్దంగుండా కనిపించినట్టు మసకమసకగా కనిపిస్తోంది. మనిషి రానురాను అచేతనుడౌతున్నాడు.

ఎదురుగా చాపమీద సరోజని కూర్చుంది. కమలమ్మగారు వంటవాడిచేతికి అందరికీ కాఫీలు పంపించింది. భాస్కర్రావు సరోజనివైపు అతిమామూలుగా చూస్తున్నాడు. ఆమె కళ్లు మిలమిల్లాడుతున్నాయి. చక్కని శరీర నిర్మాణం. అందమైనవొంపులు. మేలిముసుగు అలాగే వుంది. ఎందుకో భయపడుతోంది పులుల మధ్య జింకలాగుంది. ఎదురుగుండా వున్న సుదర్శనంగారు కాని, ఆయన డబ్బుకాని ఆమెకు ఏమాత్రం ధైర్యం కలిగించలేక పోతున్నాయి. ఏక్షణాన అయినా ఆమెకు ఏడుపుకట్టలు తెంచుకు రావచ్చు. భాస్కర్రావు నోరు మెదపకుండా కాఫీగాసు చేత పట్టుకుని కూర్చున్నాడు. సుదర్శనంగారి మనస్సులో—ఒక ఆలోచన మెరిసింది.

"అమ్మాయి! ఏదీ ఒకపాట పాడు, బావ వింటాడు" అన్నాడు.

సరోజని తల వూపింది.

పద్మ సరోజనివేపు చూస్తున్నది. ఆమె మనస్సులో ప్రతి అణువూ తీవ్రంగా పనిచేస్తోంది. ఎలాగైనా ఈ పెళ్ళి ఆగిపోతే—ఆమె తాపత్రయం మిక్కుటమైపోతున్నది. కాని అన్నివేపులా దారులు కట్టేసినట్టు నోరు మెదపడానికి వీల్లేదు.

శివరంజనిరాగంలో సరోజని కమ్మగా కీర్తన పాడుతున్నది, భాస్కర్రావు నిర్వికారంగా వింటున్నాడు. పాట అయిపోయింది. భాస్కర్రావు, 'శభాష్' అనేశాడు. సుదర్శనంగారు కళ్ళు పెద్దవిచేసి అతనికేసి చూస్తున్నాడు. అతను, "మావయ్యా! మీఅమ్మాయి కళ్ళు బాగుపడ్డాయా? ఇంకా మేలిముసుగు తియ్యనియ్యవేమిటి?" అన్నాడు చనువుగా.

సుదర్శనంగారికి సరోజనికీ కమలమ్మగారికి పిడుగుపడ్డట్టయింది. పద్మ వీళ్ళ మొహాలవంక అయోమయంగా చూస్తోంది. వాళ్లకంగారుకి కారణం ఏమై వుంటుందీ?...ఏదో కీటుకున్నది. ఆమె మెదడు అతిచురుకుగా పనిచేస్తున్నది మెల్లిగా అందుకుంది. "తియ్యమ్మా - ముసుగు. సిగ్గుపడకు" అన్నది.

సరోజని ఏమైతే అదే అవుతుందని ముసుగు తీసింది. పద్మ ఆమెమొహంకేసి చూసి కెవ్వునఅరిచి కళ్లు మూసేసుకుంది. భాస్కర్రావుకి కనురెప్పలు మూసుకొందామన్న ఊహకూడా మనస్సుకి తట్టలేదు. భద్రయ్యగారు అయోమయం అయిపోయాడు. సరోజని రెండునిమిషాలు కళ్లు అప్పజెప్పిచూస్తూ అలాగేఉంది. సుదర్శనంగారు—తల వంచుకుని బలిపీఠంమీద గండ్రగొడలిదెబ్బకు ఎదురుచూసే మేకలా—నిశ్చేష్టుడై వుండిపోయాడు. కమలమ్మగారు పద్మ దగ్గిరే కూచుని ఆమెకు పరిచర్యలు చేస్తోంది.

సరోజినికి కళ్ళు మినహా మొహం అంతా, నిప్పులో కాలిన జీడిగింజలా నల్లగా మాడిపోయింది నోట్లో పళ్లు, నాలుక, పెదాలు పైకి వంగిపోవడంతో, ముఖం మరీ భయంకరంగా కన్పిస్తోంది. నున్నని చర్మం నిగనిగలాడుతూవుంది. ముక్కు చప్పబడి, మాంసపుముద్ద అతికించినట్టుంది.

సుదర్శనంగారు దిగ్గున లేచి, "అమ్మాయీ! మేలిముసుగు వేసేసుకో—లోపలికి పద—" అన్నాడు ప్రేమతో. దీనికంతకీ ఫలితం ఏమౌతుందో ఆయనకి తెలుసు. భాస్కర్రావు లేచి అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఏమిటీ రూపం? ఎంత ఘోరవికారం! ఇది దాచటానికే కాబోలు ఆమె ఆ మేలిముసుగు ఎప్పుడూ వేసుకొనే వుంచేది! ఎందుకైంది అట్లా? సుదర్శనంగారు అతనివైపు చూశాడు అయోమయంగా.

భాస్కరరావు తండ్రివైపు తిరిగి, "నాన్నా! మామయ్య ఏమీ అనుకోకుండావుంటే ఒక్క మాట చెబుతా" అన్నాడు. సుదర్శనంగారు "నేనేమీ అనుకోనులే నాయనా, చెప్పు" అన్నాడు.

భాస్కర్రావు తడుముకోకుండా, "నేనసలు ఈజన్మకి పెళ్ళి చేసుకోదల్చుకోలేదు నాన్నా. అంతే" అన్నాడు చాలా సహజంగా. పద్మ కమలమ్మగారి పక్కన నిల్చున్నదల్లా అతనివేపు తిరిగి చూసింది. ఆమె కెందుకో సంతోషంతో చేతులు చరిచి చప్పట్లు కొట్టాలనిపించింది. సుదర్శనం తనకు చేసిన అన్యాయానికి, ఆయనకి ఈ అవమానం చాలదు అనుకుందామె. సుదర్శనంగారి మొహం చాలా తీవ్రంగా మారిపోయింది. "నీ కూతురు నచ్చలేదు" అంటే, ఆయనకి అంతబాధ అనిపించేది కాదు; ఇంకేమైనా సూటిగా అంటే సహించేవాడే. కాని భాస్కర్రావు మాటల్లోని తీవ్రమైన వ్యంగ్యం ఆయన గుండెల్లో గుచ్చుకున్నట్టయింది; ఆయన కళ్ళు ఎర్రబారిపోయినాయి కమలమ్మగారు పద్మదగిర నుంచి గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది. భద్రయ్యగారు ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. మెల్లిగా లేచి సుదర్శనంగారి రెండు చేతులూ పట్టుకున్నాడాయన. "ఇది చాలా దురదృష్టం సుదర్శనం! ఈ సంగతి—ఇన్నాళ్ళబట్టి నాతో ఎప్పుడూ ఒక్కసారైనా చెప్పావుకావేం?" అన్నాడు జాలితో. ఆయనకి తన మిత్రునిపట్ల గొప్ప స్నేహభావం వుంది. సుదర్శనం చేతులు విదిలించుకుంటూ, "నీకే కాదు! ఇంతవరకూ నా ఆప్త బంధువులకే ఈ విషయం చెప్పలేదు. ఎట్లా చెప్పగలనని వూహించావు? నీ కొడుకు ఇష్టపడకపోతే అతన్నేమీ అనను. కాని అతని వ్యంగ్యం—నాకు శూలంలా తగిలింది. భద్రయ్యా! నా కూతుర్ని ఎవడికో ఒక అనాథుకిచ్చి వాడికి నా ఆస్తంతా ఇచ్చి పెళ్ళిచేసి, నేను కూర్చోమంటే కూర్చుని, నుల్చోమంటే నుల్చునేట్టు చెయ్యగలను—చేస్తాను. చూడు కావాలిస్తే" అన్నాడు మండిపడుతూ.

భాస్కర్రావు కొంచెం నివ్వెరబోయి తమాయించుకున్నాడు. "మామయ్యా! నువ్వు నీ డబ్బుతో సరోజినికి ఒక మనిషిని కొనిపెట్టగలవు గాని, ప్రేమనీ హృదయాన్నీ కూడా కొనిపెట్టలేవు. నీ పట్టుదలతో వాళ్లిద్దర్నీ శాశ్వతంగా బాధపెట్టినవాడవుతావు అంతే" అని, నాన్నతో, "లే నాన్నా, వెళ్దాం" అంటూ బైటికి దారితీశాడు. పద్మ మారుమాట్లాడకుండా వాళ్ళను అనుసరించింది. భద్రయ్యగారు తలొంచుకుని నడుస్తున్నాడు.

వాళ్లు అలా గడప దిగి రోడ్డుమీద అడుగుపెట్టడంతోటే సుదర్శనంగారి వీధివాకిలి దభేలున మూసుకుంది. ఆ తలుపువెనక—

వెళ్ళిపోతున్న సుదర్శనంగారు వెర్రికోపంతో కళ్ళనీరు దెబ్బతిన్న సింహంలా నిలుచుండిపోయాడు క్షణంసేపు.

14

పాలల్లో ఒక్క చుక్క విషం! అంతులేని దయాగల మనస్సుకు ఒక్క పుల్లవిరుపుమాట! సరోజిని తన పుమీద పడి వెక్కి వెక్కి ఏడ్చేదల్లా లోపలికి వచ్చిన పినతల్లిని చూసి, మరింత దుఃఖం పొంగేసరికి భోరు ...డి. సుదర్శనంగారు ఆమె పక్కనే కూర్చుని తల నిమురుతూ, "ఎందుకమ్మా ఏడుస్తావు? ఏడవకు. ఇట్లాగే జరుగుతుందని—మనం అందరం అనుకున్నదేగా!" అన్నాడు ప్రేమగా.

సరోజిని వెక్కుతూనే అంది. "నాకు పెళ్ళి వద్దంటే విన్నావా నాన్నా! ఎవర్నని ఏం ప్రయోజనం! నా రాత అట్లా వుంది."

"ఛా—ఛా! ఆ మాటలు నాకు చెప్పకు సరోజని. ఇష్టం లేకపోతే పోవచ్చుగాక. దానికోసం వాడు అట్లా మాట్లాడతాడా? చూడు వాణ్ణి ఏం చేస్తానో!"

"ఎందుకులే నాన్నా! పోనీ."

"పోనీయటమా! వాళ్ళనా! నా కడుపు ఎట్లా మండిపోతోంది అనుకుంటున్నావు! అమ్మాయి నువ్వేం మాట్లాడకుండా చూస్తూవుండు. నీకు మన్మథుడులాంటి వరుణ్ణి చిటికలో తెస్తాను" అంటూ చిటికవేసి ఆగ్రహం, ఆకస్మికమైన సంతోషం కలసిన ఒక ఉద్రేకంతో ఊగిపోతూ అన్నాడు సుదర్శనంగారు.

కమలమ్మగారు, "మీకు చాదస్తం కాకపోతే దాన్ని అట్లా మనదగ్గిరే హాయిగా వుండనీయరాదటండి! ఎవడో పెళ్ళిచేసుకుని హింసిస్తే కాని మీకు తృప్తి లేదా?" అంది.

"నీమొహం! హింసా? ఎవడేవాడు? వాడల్లా డబ్బుకు దాసుడై, సరోజని కనుసన్నల్లో మెలిగేవాడు అయివుంటాడు గాడికితోడు హింసకూడానా! చూస్తావుగా!" అంటూ నవ్వుతూ.

...దిలోనుంచి నిష్క్రమించాడు నాన్న వెళ్ళాక సరోజని ...న్నిని కౌగలించుకుని చాలాసేపు ఏడ్చింది. ఆమెకి జీవితం వ్యర్థ ...నిపిస్తోంది! ఎవడైనాగాని, వాడు భాస్కర్రావులాంటి వాడు ...దా! మనస్సును మాత్రం అచ్చగా ప్రేమించేవాళ్లు ఈ భూమం ...లంమీద ఎక్కడైనా ఉంటారా? భార్య అందమైనదైనా ఇత ...లవంక వెర్రిగా చూసే మగవాళ్ళ చంచల హృదయాలలో తన ...లాంటి స్థానం వుండదు. అది స్పష్టమే. ఇంక తనకు పెళ్ళి ...య్యాలనేది నాన్నకి పట్టుదలగా, పరిణమించింది. అది ఆయన ...మానిపించలేం. ఈ అవమానాలు తప్పవులాగున్నది.—అని ...చిస్తున్నదా అమాయకురాలు. ఆమెకి భాస్కర్రావుమీద ...వంటి ద్వేషంలేదు.

సుదర్శనంగారు ఆ క్షణంనించీ అసలైన వెంకటేశ్వరావ ...రం ఎత్తాడు. వరమివ్వటంలోకాదు; నీలాలు మొదలంటా ...ంచటంలో! ఆయన గబగబ తన ఇనప్పెట్టెగదిలోకివెళ్ళి, ...యర్ దగ్గిర స్థిమితంగా కూర్చుని, డ్రాయర్ వెనక అల్మారాలో ...చి భద్రయ్యగారి ఖాతా పుస్తకాలు తీసి చదవసాగాడు. ఆయ ...ఆ లెఖ్ఖల్లో ఒకచోట కొద్దిగా సందుదొరికింది భద్రయ్యగారు, ... ఆరునెలలకీ లెఖ్ఖలుచూసి దస్కతు పెట్టేవాడు, ఈ ఆరు ...నించీ ఆయన లెఖ్ఖ లింకా తనిఖీ చూడలేదు తను ఏదో ఒక ... మారిస్తే, భద్రయ్యగారి జుట్టు తన చేతుల్లోకి అతి సులభంగా ...స్తుంది. వాడికి అంత ఎగతాళా? వాడికేం తెలుసు తన బాధ? ...కూతురు పుటకలో అలావుందా? ఎంత అందంగా వుండేది?... ...ర్శనంగారు ఖాతా పేజీలు తిరగేస్తూంటే—కోపం, దుఃఖం కలిసిన మానసికాందోళనలో పుస్తకంలో పుటలులాగా జ్ఞాపకాలు గబగబ తిరగబడసాగినై. ఆయన కళ్లల్లో నీళ్ళు తిరిగినాయి. తన కూతురి కపుడు తొమ్మిదేళ్ళు వుంటాయి. తల్లిలేని పిల్ల. తను అప్పుడే రెండోపెళ్ళి చేసుకున్నాడు; తన రెండో భార్య సౌందర్యవతి; తనకా వ్యామోహంలో కళ్లు కనపడేవికావు. కూతురు ముద్దు ముచ్చట్లుకన్న ఇల్లాలు సుందరి మీద తనకి ఎక్కడ లేని ప్రేమ. ఆమెకోసం తనేమైనా చేస్తాడు. ఆమె అందం, తన కళ్ళకు మెరుపులా మిరుమిట్లు గొల్పేది. అంధకారం కమ్మేసిన తన కళ్ళకు ఆమె అనన్య సౌందర్య సంపద వెనక దాగివున్న ఘోర సర్పాకృతి కనపడిందికాదు. అది సహజమేకూడా. ఆమె సరోజనిని, ఆ దిక్కులేని వొంటరిపాటు ఇంట్లో, నిజంగా నరకబాధలు పెట్టింది; తనెప్పుడూ వ్యాపారంకోసం కొట్టుదగ్గిరే వుండాల్సి వచ్చేది. సరోజని తనతో ఏంచెప్పటానికీ భయపడేది; పినతల్లి అంటే ఆమెకి సింహస్వప్నంగా ఉండేది.

సరోజని సున్నితమైన స్వభావంగలది. ఆమెకి ఇతరులను కసరటమూ, ఇతరులను దూషించటమూ సుతరామూ చేతకాదు. ఆ పిచ్చిపిల్ల పిన్నిని ప్రేమించేదికూడా. అయితే ఎంత సహానానికీ మితిఅనేది వున్నది. ఆవేళ తను ఇంటికి వచ్చేసరికి, సరోజని ఏడుస్తూ ఎదురొచ్చి తనను కౌగలించుకుంది. ఏదో చెప్పాలనే బాధ ఆమె గొంతులో వ్యక్తమౌతోంది. దాన్ని తా నానాడు నిర్లక్ష్యంచేసి గుర్తించలేదు. "ఎందుకమ్మా ఏడుస్తున్నావు?" అని తను ప్రశ్నించేలోగా, సుందరి వచ్చేసింది; పసిదాని నోరు మూతబడిపోయింది. భార్యవైపు చూశాడు. ఆమె మనోజ్ఞ సౌందర్యం ముందు తనకి మిగతా విషయాలన్నీ మరుపుకొచ్చినాయి. అంతేగాని ఆమె చంద్రబింబంవంటి చక్కని మొహం వెనక, జగన్మోహనమైన ఆ చిరునవ్వు వెనక, పడగఎత్తి బుసలుకొడ్తూ విషం కక్కుతూన్న నల్లతాచును తాను గుర్తించలేకపోయాడు. తన కూతురు కళ్ళకు ఆమె పిన్ని ఆకృతి అలాగే కన్పించివుంటుంది.

అప్పుడే తను సరోజిని వీపును పరీక్షించివుంటే రెండు సరికొత్త వాతలు ఎర్రగా నెత్తురు చారల్లా నిగనిగలాడుతూ కనిపించి వుండును. అయితే తను కళ్లుతెరిచి తన భార్య నిజస్వరూపాన్ని గుర్తించేవరకే అంతా అయిపోయింది.

ఆవేళ, తను కొట్లో వుండగా వంటమనిషి పరిగెత్తుకొచ్చాడు; చెప్పలేక చెప్పలేక తడబడుతూ, "అయ్యగారూ, వెంటనే ఇంటికి రండి, అమ్మాయిగారికీ..." అని మాత్రం అనగలిగాడు. తన గుండెలు ఝల్లుమన్నయ్. జట్కా ఎక్కి పరిగెత్తాడు. ఏం లాభం! ఆ పిశాచి అందం అనే ముసుగులోవున్న కాలసర్పం—ఏమీ ఎరగని దేవతలాంటి తన ముద్దుకూతుర్ని అంతపని చేసింది... సరోజని—వంటఇంట్లోకి వెళ్ళి, సాయంత్రం టిఫిన్ అడిగిందట, పిన్నతల్లి, వంటవాణ్ని మేడమీదికి దేనికోసమో పంపించింది; అదే స్వయంగా, పొయ్యిదగ్గిర కూచుంది. ఆమె కొన్నాళ్ళనించో సరోజనిమీద చాలా కోపంగావుంది అకారణంగా. కొట్టినా తిట్టినా ఆ కసి తీరలేదు కామాలు. పొయ్యిదగ్గిరనుంచి విసురుగా లేచి, నోటికొచ్చినట్టు ఏదో నానా మాటలూ అని, ఆ ఆత్రం తీరక, "అదిగో పొయ్యిమీద వండి వార్చాను—నీ బొందమీద కొట్టుకో" అని—ఆ పసిదాన్ని ఏమాత్రం కనికరమన్నా లేకండా విసురుగా మండుతున్న పొయ్యివేపు నెట్టింది; సరోజని—కాలుకి పరికిణీ అడ్డంపడి, మండుతున్న పొయ్యిమీద బోర్లపడింది; వంటవాడు ఇంతలో వచ్చాడు గబుక్కున చిన్నదాన్ని చేతులోకి తీసుకున్నాడు; అప్పటికే అమ్మాయి మొహంలో, నుదురు—కళ్లూ తప్ప మిగతా భాగంఅంతా—నల్లగా మాడి మసిబి మాంసం వుడికి పోయింది.

వంటవాడు, పిల్లదే కాలుజారి పడ్డదన్న మాట నమ్మలేదు;

★ మంచీ - చెడూ ★

అమ్మాయిని వెంటనే డాక్టర్ దగ్గిరకి తీసుకెళ్ళి వొదిలిపెట్టి, యజమాని దగ్గిరకొచ్చి చెప్పాడు. అమ్మాయి, ఆ గండంనించి బతికి బైటబడింది కాని, ఆమె మొహం మాత్రం చాలా దారుణంగా, మారిపోయింది. ఏపాపమూ ఎరుగని పసిదాన్ని మండే మండే పొయ్యిలో, పడేసి తన భార్య కాల్చటానికి సిద్ధమైందనే సంగతి తనకు, తన కూతురు, నయమైనాక చెప్పింది ఆస్పత్రిలో; కాని, తను ఏమీ చెయ్యలేకపోయాడు, బైటకి చెబితే సిగ్గుచేటు.

అయితే—ఆ పాపం, వెంటనే ఫలితంలోకి వచ్చినట్టు, సుందరి ఒకనాడు, వొయ్యారంగా మేడ దిగబోతూ, కాలుజారి కింద పడింది. కాలు విరిగి, ఆస్పత్రిలో నరకబాధ పడి, ఆ కాలు తీసేశాక, ఖాతంకమ్మి చచ్చిపోయింది; అయితే చచ్చే క్షణం వరకూ ఆ నరరూప రాక్షసి తన తప్పును ఒప్పుకోలేదు.

తన కూతురు, చిన్నతనంలోనే ఏ పాపమూ ఎరుగకపోయినా అలా అనాకారి అయిపోయింది; ఆమె మేలిముసుగు వుంటేనే తప్ప తనే భరించలేని స్థితికి వచ్చేశాడు. మేలిముసుగులో గుండా ఆమె కళ్ళ అందాని సంతోషించవచ్చు. ఆమె కళ్ళల్లో కనుపించే నిర్మలా దయార్ద్ర హృదయం, పరిపూర్ణమైన మానవత్వం— ఎన్నటికీ తొలగని శిక్షగా పరిణమించాయి అప్పణ్ణించీ, కోసం తను ఏ త్యాగమైనా చెయ్యాలని తీర్మానించుకున్నాడు తనకు ఎంత యిష్టం లేకపోయినాకూడా చివరికి అమ్మాయి పట్టుదల మూలంగా మూడో పెళ్ళి చేసుకున్నాడు. అయితే, ఈ మూడో భార్య తన రెండో భార్యలాంటిది గాదు; చాలా మంచిది. త కూతురుని సొంత కూతురల్లే చూసుకుంటోంది...

సుదర్శనంగారి జ్ఞాపకాలు ఈ రకంగా సాగి, ఆయనను చి రికి, మళ్ళీ, ఇందాకటి పెళ్ళిచూపుల దృశ్యంలోనే తెచ్చి ప

గాయి: ఆయన మళ్ళీ రెచ్చిపోయాడు. తన కూతురు అనాకారి అయినంత మాత్రాన, ఆమె హృదయాన్ని, ఆమె సౌజన్యాన్ని కాస్తయినా గుర్తించగూడదా? ఆ గుంటవెధవ ఈమాత్రానికే—"ఈ జన్మలో పెళ్ళి చేసుకోను నాన్నా" అని ఎత్తి పొడవాలా? వాడి మదం అణచాలి...సుదర్శనంగారు, తన ముందున్న ఖాతా పుస్తకంమీద కోపంతో బలంగా ఒక్క గుద్దు గుద్దాడు. ఆ తర్వాత ఆయన గంటసేపు పాతపుస్తకాలు, కొత్త పుస్తకాలు తిరగేస్తూ ఏదో రాస్తూ కూర్చున్నాడు. చివరికి లేచేప్పుడు ఆయన మొహంలో సంతోషం మెరిసింది.

15

భాస్కర్రావు మనస్సుకూడా మొగల్రాజపురంలో తన ఇంట్లో అడుగుపెట్టగానే కాస్త కలుక్కుమనే పని ఒకటి జరిగింది. భద్రయ్యగారి మొహం వివర్ణమైవుంది; సుదర్శనంగారి కూతురు అంత అందవికారంగా ఉండటమే కాదు; తన కొడుకు సహజంగా అతని స్వభావంప్రకారం ఏదో అన్నదాన్ని సుదర్శనం గబుక్కున అపార్థం చేసుకుని తనను విదిలించుకోటం ఆయనకి చాలా బాధగావుంది. ఆయన ఇంట్లో ప్రవేశించి భార్యని కేకేశాడు, కాసిని మంచినీళ్ళు తెమ్మని; పద్మ ఎండలో పడి రావటంవల కాస్త చిరాకుగా వుంది. మంచినీళ్ళు తెచ్చి ఆయనకిస్తూ "ఏం చక్కని కూతురు! ఆ మొహాన్ని చూడడానికి ఈ మండే ఎండలో చంపావు" అంది ఎవర్నీ ఉద్దేశించకండానే. భద్రయ్యగారు మంచినీళ్ళు తాగి, "అట్లా మాట్లాడకు, వాళ్ళు బాధపడతారు వింటే" అని కాస్త మందలించారు.

పద్మ, మొహం చిట్లించుకుని, "నేనెవర్నీ అనటానికి! ఆ చిలకని ఈ గోరువంక కిచ్చి పెళ్ళిచేయండి సరిపోతుంది! నాదేంపోయింది" అంది విసురుగా, దానికి కారణం వేరేవుంది. భద్రయ్యగారు ఆమెకేసి తేరపారచూశాడు. ఈ సంభాషణవింటూ లోపలకి వచ్చిన భాస్కర్రావు "పిన్నీ! నాన్నతో దేనికీ నీకు వాదన? పెళ్ళిచేసుకోవల్సింది నేను! నాకసలు పెళ్ళే వద్దంటున్నాగా. ఇంకెందుకు? వొదిలెయ్యి!" అన్నాడు.

"ఉన్నమాట అంటే మీ నాయన వాళ్ళను వెనకేసుకొస్తున్నారు చూడుమరి" అంది పద్మ స్థాయి తగ్గించకుండా.

"ఉన్నమాట ఐతేమాత్రం మనం దేనికీ అనటం? మనకి కానప్పుడు ఆ అమ్మాయి ఎట్లావుంటే ఏమిటి అంటున్నాను నేను" అన్నాడు భద్రయ్యగారు దగ్గరగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"నీకు తెలీదులే నాన్నా! 'కోడలు' అని పేరు పెట్టగానే కాబోయే అత్తగారికి ఎక్కడలేని అధికార వాంఛా ప్రబలుతుంది కాబోలు" అన్నాడు భాస్కర్రావు నవ్వుతూ.

పద్మలో చెలరేగిన కోపజ్వాలలకి యిది ఇంకా ఆజ్యం పోసినట్లయింది. ఆ క్షణాన తండ్రీ కొడుకు లిద్దరూ తనతోబాటు సరోజని అందవికారాన్ని గురించి, హేళనగా మాట్లాడివున్నట్లయితే ఆమె కెంతో సంతృప్తికలిగేది. భాస్కర్రావు రాజీగా మాట్లాడటం ఆమె సహించలేకపోతోంది. ఫలించని ప్రేమోద్రేకాలు ఆమెలో ఇప్పుడిప్పుడే కోపంగా, అహంకారంగా పరిణామం చెందుతున్నాయి.

"నీ పెళ్ళంతా నా మూలంగానే ఆగిపోయినట్టుగా మాట్లాడుతున్నావేం?" అంటూ ఆమె విసురుగా లోపలికి వెళ్లిపోయింది.

భాస్కర్రావు మనస్సు కొంచెం చిన్నబుచ్చుకున్నాడు. తను పిన్నిని ఏమీ అనలేదే! ఎందుకట్లా కోప్పడిపోయింది. అది స్త్రీ సహజలక్షణమా?

ఆవేళ సాయంత్రం భాస్కర్రావు, పాండురంగను కలుసుకున్నాడు, గవర్నర్పేట సెంటర్లో. ఇద్దరూ, ఏదో ఇతర విషయాలు మాట్లాడుకుంటూ గాంధీనగరంలోని పార్కులో కొచ్చి కూర్చున్నారు. భాస్కర్రావు సిగరెట్టు ముట్టించి, మిత్రునితో "అబ్బాయి, విన్నావా సంగతి, నిన్న నేను సుదర్శనంగారి అమ్మాయినిచూసి వచ్చాను." అన్నాడు, పొగ వయ్యారంగా సుడులు సుడులుగా వదులుతో.

"అయితే వారసత్వంలేని ఆస్తంతా నీకే కలుస్తుం దన్నమాట!" అన్నాడు పాండు.

"అప్పుడే ఈర్ష్యపడుతున్నావు కాబోలు!"

"ఈర్ష్యా? దేనికీ? నాకూ పెళ్లి కాబోతుంటేనూ? నీ అంత ఆస్తిగల మామ కాదు గాని, అందమైన పిల్ల."

"శభాష్! ఇంక నేను చెబుతా విను. నేను అసలు పెళ్ళే చేసుకోబోవటం లేదు."

"ఎందుకని? కట్నందగ్గర పేచీ వచ్చిందా? కాస్త కూస్తకీ పేచీ పెట్టుకోకురా; పెళ్ళిపోనీ. మామ పిలక నీ చేతులోకి వచ్చేస్తుంది. లక్షలతో జూదం ఆడవచ్చు. మీ మామ సామాన్యుడు కాదురోయ్. బెజవాడలో సగం ఆయనదే. వట్టి తిరపతిగాడు."

"నిజమేనట. ఐతే ఒక్క తిరుకుడొచ్చిందిరా. ఆయన కూతురు వర్ణనాతీతంగా వుంది; ఒక్కసారి చూశావో, నీకు తప్పకండా, స్త్రీ జాతిమీదే విరక్తి పుట్టుకువస్తుంది!"

"అలాగా?"

"అబద్ధం గాదురా. సుదర్శనంగారు తన యావదాస్తీ ఆ కూతురుకు పోటీపెట్టినా కూడా, ఆమెని ఎవరూ పెళ్లిచేసుకోరు." అంటూ భాస్కర్రావు తను నిన్న జరిగిన వ్యవహారమంతా వర్ణించి "ఏమంటావురా?" అని అడిగాడు.

"నే నేమంటానోయ్?—నువ్వు వొద్దంటే వొద్దనవచ్చు గాని సుదర్శనంగారు సమర్థుడు. ఇంకొకణ్ణి ఎవణ్ణో పట్టుకొస్తాడు. డబ్బుకు సాధ్యం కానిది ఉందటోయ్? ఒక్క పూట తిండి 'గారంటీ' ఇస్తే భూలోకం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణంచేసి రమ్మంటే చేసేవాళ్లున్నారు. తెలుసా?"

"తప్పకుండా ఉంటారు. కాని నేను అట్లాటివాణ్ణి కాను."

"నువ్వే కాదోయ్. చాలామంది వున్నారు నీకు మల్లేనే. కాని, వాళ్లకి డబ్బులు లేవు; వాళ్ల పట్టుదలలు ఆకలికీ, దరిద్రానికీ సడలిపోయి నీళ్లు కారిపోతాయి. ఏం చేస్తారు వాళ్లు? ఏ పనికైనా సిద్ధపడతారు పిడికెడు అన్నంకోసం; ఒకపూట సుఖనిద్రకోసం;"

భాస్కర్రావు నవ్వాడు. పాండు, లేచి, "అరే పదవోయ్, కాఫీ తాగి వద్దాం. తలనెప్పిగా వుంది" అన్నాడు. ఇద్దరూ—మౌనంగా హోటల్లోకి పోయారు. సప్లైయర్ కాఫీ ఇచ్చాడు. భాస్కర్రావు ఓ గుక్కెడు తాగి, పాండు వంక చూసి ముఖం చిట్లించుకుని, సప్లైయర్ వంక తిరిగి, "కొంచెం పెసరపప్పుకూడా దాన వేసుకురా సరిపోతుంది." అన్నాడు.

పాండు, ఆశ్చర్యపడి "దేనికిరా' అని అడిగాడు.

భాస్కర్రావు కాఫీ అట్లాగే వుంచి, "ఇదిగో పానకం ఇచ్చాడుగా. ఇది చైత్రమాసమాయె. వడపప్పుకూడావుంటే చలవ చేస్తుంది" అన్నాడు.

పాండు విరగబడి నవ్వసాగాడు. నవ్వినవ్వి అతని కళ్ళల్లో నీళ్లు నిండాయి. చివరికి సప్లైయర్ కుర్రాడికికూడానవ్వొచ్చేసింది. కొంచెం డికాక్షన్ వేసుకుని కాఫీ పూర్తిచేశారు ఇద్దరూ. అట్లా అట్లా షికారుతిరిగి రాత్రి పొద్దుపోయాక కొంప చేరుకున్నారు. ఇద్దరూ జీవితం ఇంకా చవిచూడనివాళ్లే; సంపాయించి తినాల్సిన అవసరం లేనివాళ్లు. అయితే భాస్కర్రావు త్వరలో అటువంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని కలలోకూడా ఊహించి ఎరగడు.

(ఇంకావుంది)



ఇంటి దొంగ

ఫొటో:



బి. రబీంద్రనాథ్
గుంటూరు)

పిలుపు

"ఎల్లోరా"

మముచూసి మబ్బులో
　　దాగేటి జాబిలీ!
మముచూసి మనసులో
　　మురిసేటి జాబిలీ!
మా అమ్మ ఒడిలోన
　　నే బువ్వ తినువేళ
మము పిలచి దాగుదు
　　మూతలాడే మామ!
చేయెత్తి పిలిచినా
　　పలుకనీ ఓ మామ!
పంతాని కొస్తావ
　　పరుగు పందెంతోన?

నువు మింట పరుగిడగ
　　ఓ చందమామా!
నీతోటి పరువెత్త
　　వరదాలు నాకు.
కొలనులో, కలువల్లో
　　పద్మపుష్పము వోలె
కొండపై చుక్కలకు
　　రాజువై వెలుగుదువు.
ఓమామ నామామ
　　బంగారుమామ!
జగమెల్ల మురిపించు
　　ఓ చందమామ! ★



కర్పూరద్వీపయాత్ర

(బొమ్మరిల్లు సీరియల్)

నోరి నరసింహశాస్త్రి

28

హంసలు పోయిపోయి ఒక పెద్ద కొండమీద వాలినై. అక్కడే మన అప్పల నరసయ్య వెలసి భక్తులను ఉద్ధరిస్తున్నాడు. ఆదేవుణ్ణిబట్టి ఆకొండకు సింహాచలమని పేరువచ్చింది. ఆకొండలో ఎన్నో తీర్థాలు పుట్టి కొండంతా తడుపుతున్నవి. మంచి సంపెంగమానులు మామిడిచెట్లు కావలసినన్ని ఉన్నై. అక్కడేగా కోకిలా కోకిలమ్మా ఉంటున్నది!

రాజహంసతో హంసలుపోయి ఆకొండమీద కృష్ణతీర్థం దగ్గరవాలి సరస్సులో ఈదులాడుతున్నవి. పక్కనే ఎత్తుగా పెరిగిఉన్న తియ్యమామిడిమీద కూచున్న కోకిలా కోకిలమ్మా వాటివంక ముచ్చటగా చూస్తున్నవి. సంతోషం పట్టలేక కోకిల కూఊ అంటే కోకిలమ్మ కుహూకుహూ అని వంతపాడింది.

రాజహంస ఉలిక్కిపడి ముక్కుతో వీపు చరుచుకొన్నది.

కాని వెంటనే అది కోకిలజంట కూత అని తెలుసుకున్నది. ఆ పంచమస్వరం వింటూ ముగ్ధమై రాజహంస తదేకధ్యానంతో ఆలకిస్తున్నది.

హంస కడుపులో ఒకవిధమైన గుబులు పుట్టుకొని వచ్చింది. ఆగుబులెందుకో దానికే తెలియదు.

ఏదన్నా ఒక విషయం జ్ఞాపకానికి వచ్చినట్లే ఉండి, తీరా జ్ఞాపకం రాకపోవడము మీ కనుభవమేనా? మాట నోటిదాకా వచ్చినట్లుంది కాని రాదు. పోనీ, ఇంకోపని చూసుకుందామా అంటే బుద్ధి ఇంకోవైపుకు పోదు. మాటిమాటికీ అదే జ్ఞాపకం రావడానికి ప్రయత్నిస్తూ వేధిస్తూ ఉంటుంది. అట్లాంటి అవస్థే పడుతున్న దిప్పుడా రాజహంస!

ఆపాట వింటూంటే మరిచిపోయిన విషయాలెన్నో జ్ఞాపకానికి వచ్చినట్లే ఉంటవికాని తీరా రావు. ఏదో ఎప్పుడో ఎక్కడో ఏరూపంతోనో ఈ గొంతువిన్నట్లా తోస్తుంది. కాని ఏదో ఎప్పుడో ఎక్కడో ...డో జ్ఞాపకం రాదు. దానిగుండెలో దడ ప్రారంభమైనది. మంటగా ఉంది. పైకి గుండె లేచిపోతున్నది. అది విచారమో ఆనందమో—కుంగోపొంగో—దానికి బోధపడ లేదు.

వారంరోజులపాటు అట్లాగే అక్కడే రాజహంస తనపిండుతో ఉండిపోయింది. కోకిలజంటకూ ...జహంసకూ చూపులలో స్నేహమేర్పడ్డది.

అంతలో మేఘాలు తరుముకొని వస్తున్నట్లయింది. రాజహంస తన పిండుతో ఉత్తరంగా బయలు ...ంది.

"పోవద్దు! పోవద్దు!" అంటున్నట్లు కోకిలజంట కూకుహూ కూకుహూమంటూ వెంటపడ్డది.

★ కర్పూర ద్వీప యాత్ర ★

అయితే హంసలతో పాటు పోగలశక్తి ఉందా!

అక్కడినుంచి హంసలు జగన్నాథం చేరుకొన్నవి. భువనేశ్వరం దాటినై. గంగాసాగరసంగమం చేరి అక్కడ విదురుడు యమధర్మరాజులో ఐక్యమైనచోటూ, ధృతరాష్ట్రుడు గాంధారి కుంతి దావాగ్నిలో హుతమైనచోటూ సుందరవనములలో చూచుకుంటూ కాళీఘాటు చేరినై. అక్కడినుంచి అవి గంగ వెంబడే పడి వాయవ్యంగా పోయి కాశీ వెళ్ళినై; గయమీదుగా ప్రయాగపోయినై.

హరిద్వారం చేరుకుంటేనే గాని హంసల మనస్సు కుదటపడలేదు. అక్కడ దూరంగా కనబడే హిమాలయపర్వతాలు చూస్తూ ఇతరము సమస్తము మరచినవి.

అక్కడినుంచి హృషీకేశం చేరి అక్కడ ఉండే రెండువేలమంది సన్యాసివేషధారులలో నీరక్షీర విభాగం చేసి ఉచితంగా వందనాలు చేసినై.

ఆపైన నెమ్మదినెమ్మదిగా హిమాలయపర్వతపంక్తికి అడ్డంపడి అటూ ఇటూ విహారం చేస్తూ కేదారం బదరీనాథం బ్రహ్మకపాలం చూసుకుంటూ పోయిపోయి కైలాసగిరి ప్రదక్షిణం చేసి ఆ హంసలపిండు మానస సరోవరం చేరుకున్నది.

29

అక్కడికి చేరుకోగానే హంసలకు కలిగిన ఆనందానికి హద్దు లేదు. ఆ సరస్సుకు ఆ పేరు ఎందుకు పెట్టారోగాని అది భూదేవి శిరస్సుమీద నేఉన్న అద్భుతమైన సరస్సు. అది సముద్రపు నీటిమట్టానికి పదిహేను వేల అడుగుల ఎత్తున ఉన్నదట. యాభైనాలుగు మైళ్లు చుట్టుకొలతా పదహారుమైళ్లు అడ్డకొలతా ఉన్న సరస్సు. హంసకూ ఆ సరస్సుకూ అనుబంధమేమో తెలియదు. మానససరోవరానికి చేరిన హంసకు కవులు యోగులు భక్తులూ ఏమేమో వర్ణిస్తారు!

అత్తవారింట్లో అత్తమామల కోరంటికముతా ఆడుబిడ్డ ఒత్తిడీ పడిపడి మళ్లీ పురుడుపోసుకోడానికి పుట్టింటికి హాయిగా చేరుకున్న ఆడబడుచుకువలెనే ఉంటుందేమో అది!

లేకపోతే చదువుకు ఏ పట్నమోపోయి, కాళ్లు జాపుకునేందుకైనా సరిగ్గా జాగాలేని గదిలో కాలక్షేపం చేసి, అసహ్యంగానూ అపరిశుభ్రంగానూ ఉండే ఏ హోటల్లోనో—అన్నం గొంతు దిగకపోయినా—ఆకలి తీర్చుకోడానికి ఏదో కాస్త నోట కొట్టుకుంటూ, పరీక్షకు చదువుతూ రాత్రిళ్లు నిద్రపోక పగలు తీరికలేకుండా గడిపి, సెలవులకు సుఖంగా ఇంటికి చేరుకున్న విద్యార్థులకువలెనే ఉంటుందో మరి!

కాక పగలల్లా ఒళ్లువంచి పనిచేసి అలసిసొలసి సాయంత్రానికి పెళ్లాం బిడ్డలుండే ఇంటికి చేరుకున్న గుమాస్తావలె కర్షకుడివలె ఉంటుందో!

ఏమోగాని హంసలకక్కడ హాయిగా ఉంటుంది.

ప్రపంచంలో అక్కడే తప్ప మరెక్కడా వెయ్యిరేకులుండే కమలాలుండవు. వాటికే సహస్ర దళ పద్మాలని పేరు. ఇంకో చోట ఆగింజలు తెచ్చి వేసినా మొలవవు.

ఆ కమలాలు కొన్ని ఎఱ్ఱగా ఉంటవి. ఏమి ఎరుపు! అది ఈవిధంగా ఉంటుందని వర్ణించేదెట్లా? అందుకనే దానికి పద్మరాగమని పేరుపెట్టారు. సూర్యోదయసమయంలో ఒక్కొక్కసారి సూర్యబింబము ఆ పద్మానికి సరిపోలికగా ఉంటుంది. అందుకనే సూర్యుడికీ పద్మాలకూ నేస్తం!

మరికొన్ని కమలాలు స్వచ్ఛంగా తెల్లగా ఉంటవి. వాటికే పుండరీకాలని ప్రత్యేకము పేరు. ఆ తెలుపు ఏమని వర్ణించేట్లు? హంసరెక్కల తెలుపు. హంసనెక్కే సరస్వతీదేవివంటి తెలుపు. అప్పుడు తీసిన గంగిగోవు పాలతెలుపు. హిమవంతంలో మంచులాంటి తెలుపు. కైలాసశిఖరమంటి తెలుపు. అందులో వుండే సదాశివుడివంటి తెలుపు గంగవంటి తెలుపు. ఇన్ని తెలుపులు చెప్పినా దాని తెలుపు దానిదే.

ఇహా కొన్నికమలాలు పచ్చగా ఉంటవి. ఏమి పసిమి అనుకున్నారు? ఆరంగునుబట్టే బంగారానికి సువర్ణమనేపేరు వచ్చి ఉండవచ్చు. అవి కావలెనంటేనే వెనకటికి ద్రౌపదికోసము భీముడు బయలుదేరి నానా అవస్థలూ పడి యక్షరాక్షసులతో పోట్లాడి ఎట్లాగో తెచ్చాడంటారు.

★ కర్పూర ద్వీప యాత్ర ★

వాటి సుగంధము?—పద్మగంధమే!

వాటిరుచో? మూడూ మూడు విధాలుగా ఉంటవి. ఐతే ఆ మూడురుచులూ కలిస్తే ప్రపంచంలో మన మెరిగిన రుచులన్నీ వస్తవి—త్రివర్ణచిత్రాలలో రంగులన్నీ వచ్చినట్లే! అసలు ఇంత అద్భుతమైన భేదాలతో కనిపించే ఈ సృష్టిఅంతాకూడా మూడుగుణాలు—సత్వము రజస్సు తమస్సు—రకరకాలుగా కలవడం మూలానేగా ఏర్పడ్డది!

ఇక అక్కడి గాలి ఎట్లా ఉంటుందనీ? బహు తేలిక. అది పీలిస్తే మనగుండెలు ఆగలేక విచ్చుకుపోతవి. అందులో దుమ్మూధూళీ ఏమాత్ర ముండదు.

రాజహంస కోకనద మనే ఎర్రటికమలంమీద వాలితే ఒక అందము! పుండరీకంమీద ఉంటే ఇంకోఅందము! సువర్ణకమలంమీద చేరితే మరో అందమూ!

అక్కడ తామరతూళ్లు హంసకు ముఖ్యమైన ఆహారము. తినేప్పుడు అందులో పీచు పరిహారిస్తవి. అందుకనే దానికి బిస మనిపేరు. హంసలు తింటవి కాబట్టే తామరతూడుకు మృణాలమని పేరు. దేవభాషలో పేర్లన్నీ ఇట్లాగే ఆవస్తువు స్వభావాన్ని సూచనచేస్తూ ఉంటవి—మరి ఏ ఇతరభాషలోనూ ఆ గొప్ప లేదుసుమండీ!

ఆవిధంగా తామరతూళ్లు తింటూ పద్మగంధంతో పరిమళించే అక్కడి చల్లటి పరిశుభ్రమైన గాలి పీలుస్తూ ఆ సరోవరంలో విహరిస్తూ ఆ హంసలు అక్కడ చాలాకాలం గడిపినై.

మన రాజహంస తన పిండుతో చేరుకోవడంవల్ల అందంలో ముల్లోకాలలో సాటిలేని మానససరోవరానికే ఒక కొత్త అందం వచ్చినట్లయింది.

30

ఒకనాడు సాయంకాల మయింది. ఆనాడు అమావాస్య. ఏ అమావాస్యో బాగా గుర్తులేదు. మహాలయ అమావాస్యా అనే భాద్రపద బహుళ అమావాస్యో, ఫాల్గుణ బహుళ అమావాస్యో! ఆకాశంలో చుక్కలు మిలమిల లాడుతున్నవి. దక్షిణంగా అగస్త్యనక్షత్రం ఉదయించి క్షణానికి ఒకరంగుచూపుతూ మెరిసిపోతున్నాడు. ఆచుక్క రంగులుచూసిన పిల్లలే అదృష్టవంతులు. అగస్త్యుడికి కొంచెముపైగా ఆకాశమధ్యంలో పునర్వసు నక్షత్రంకూడా అట్లాగే మెరుస్తున్నది. ఆపైన ఉత్తరాన ఆకాశాన్ని సప్తఋషులు ధ్రువనక్షత్రానికి ప్రదక్షిణ మారంభించారు.

రెండుపాయలుగా చీలి పాలపుంత చూపుకు అందని దూరలోకాల జ్యోతులను చూచాయగా కాంతుల మబ్బులతో ప్రదర్శిస్తున్నది.

పద్మగంధం కలిసిన చల్లనిగాలి మెల్లగా వీస్తున్నది.

రాజహంస ఒక శ్వేతపద్మంమీద కూర్చొనిఉన్నది. దాని పక్కనే కాంచనకమలంమీద హంసకాంత ఒకటి కూచున్నది. రెండూ నక్షత్రాలవంక చూస్తూ ఏమేమో ఆలోచనలు చేస్తూ పాలపుంతవైపు ఉబలాటంతో మెడలు తిప్పినై. పాలపుంతలో ఒక చివరను ఈరాత్రి ఏదో కొత్తకదలిక కనబడుతున్నది.

మానససరోవరంలో ఏదో చిన్నచప్పుడయింది. ఏమి చప్పుడు? మద్దెలవాయించడం చాలించేప్పుడు ముక్తాయింపు వేస్తారే, అట్లాంటి చప్పుడనండి. తాళముగా వేసే చిటికచప్పుడనండి. యోగులు మూలాధార చక్రంలోనుంచి కుండలినీశక్తిని లేవదీసేప్పుడు ఒకధ్వని వినబడుతుందట. అటువంటి చప్పుడే అనుకోండి, పోని! కాకపోతే పసిపిల్లవాడు కేకినలుకొట్టుతూ నవ్వేచప్పు డనుకోండి.

ఆ చిట్టిధ్వనికి అవికూర్చున్న రెండుకమలాలనాళాలూ ఊడినై—తల్లి కడుపులోనుంచి పాపాయి పుట్టినప్పుడు బొడ్డు ఊడినట్లే. ఆ రెండుహంసలతో సహా రెండు కమలాలూ ఆకాశంలోకి లేచినై. నెమ్మ

దిగా అవి పైకెగిరిపోతున్నై. ఆ రెండు కమలాలూ రెండువిమానాలయినై. చెవులు గింగురుమనేట్లు పాడు రొదచేసే మనమెరిగిన విమానాలవంటివి కావవి. ఐతే ఈపూలవిమానాలు ఎగురుతూంటే చప్పుడు అసలు లేకపోలేదు. తుమ్మెదలు ఝుంకారము చేసే శ్రావ్యమైన సునాదమిది. సంగీతం ప్రారంభించేందుకు పూర్వము పట్టే శ్రుతి నాదము వంటిది.

ఇటువంటివాటిని బట్టే పూర్వము పుష్పక విమానమని కవులు వర్ణించారు కాబోలు.

ఆ రెండు పుష్పకవిమానాల్లోనూ వాళ్లిద్దరూ పోతూఉంటే భూమిమీద అన్నిదిక్కులనుంచీ జయజయధ్వానాలు వినిపించినై. అంతలో ఒక మహారాజు కీర్తిని వైభవంగా వర్ణించే వందిమాగధుల పరాకులు వినవచ్చినై.

వాళ్లిద్దరూ అది విని పక్కకు మెడలు తిప్పగా మరి రెండు విమానాలు కనిపించినై. అవి రత్నాల విమానాలు. అందులో ఒకదానిలో మయూరరాజూ రెండవదానిలో మయూరరాణీ ఉన్నారు.


మరి కొంతపైకి పోగా మళ్లీ కొన్ని జయజయధ్వనులు వినిపించినై. చూడగా రెండుపచ్చల విమానాలలో భద్రాద్రి మీదినుంచి పంచరంగుల రామచిలకా ఇంకో రామచిలకా వస్తున్నవి.

మరి కొంత సేపటికి వాళ్లందరి మనస్సులను ఆకట్టివేసే అద్భుతమైన సంగీతం వినిపించింది. కింద ఉన్న భూమిఅంతాకూడా సంగీతప్రవాహపు వెల్లువలో మునిగినట్లు తోచింది. ఆ ప్రవాహపు తరంగాల మీద తేలుతూ లయానుకూలంగా ఊగుతూ ఆడుతూ సింహాచలంవేపునుంచి రెండు ఇంద్రనీలవిమానాలు బయలుదేరినై. ఆ విమానాలు పైకి వస్తున్నకొద్దీ ఆ సంగీతపు వెల్లువకూడా పొంగి పైపైకి ఉబుకుతున్నట్లుగా తోచింది. వాటి రెంటిలో మన రెండు కోకిలలూ వస్తూన్నై.

ఈ ఎనిమిది విమానాలూ ఆకాశవీధిలో పైపైకి పోతున్నవి. భూమిమీద అన్నిదిక్కులనుంచీ వెనక మనము విన్న చక్రవర్తి సత్కార్యాలూ ఆయన మంత్రీ కోశాధికారీ గాయకుడూ చేసిన మహాత్కార్యాలూ కీర్తించే మాటలూ వాక్యాలూ, పాటలూ పద్యాలూ, పదాలూ గీతాలూ వినబడుతున్నై.

వాళ్ల యశస్సును లోకమంతా ఒక్క గొంతుతో బిగ్గరగా మధురంగా శ్రావ్యంగా కీర్తిస్తున్నట్లు తోచింది.

[ఇంకా వుంది]



పి. నాగేశ్వరరావు

వేలం తెచ్చిన గోల

లంక శారదాదేవి

పండక్కి అక్కా బావ వస్తారని ఆరోజే ఉత్తరం వచ్చింది. అది చదువుతూవుంటే పోయిన సంక్రాంతికి జరిగిన విషయాలన్నీ జ్ఞాపకంవచ్చి మనస్సుకలచివేశాయి.

పోయినసారి పండుగ రెండు రోజులుందనగా బావవచ్చాడు. అక్కయ్య కాపురానికి వెళ్ళిం తరువాత బావరావటం అదే మొదటిసారి. వస్తూనే "హలో అమ్మాజీ!" అంటూ మునపటిలాగే నన్ను ఎత్తుకోవచ్చాడు. నాకు సిగ్గేసి వెనక్కి తగ్గాను. అప్పుడే లోపలనుండి వచ్చిన అక్క— "అహాహ మునుపటి అమ్మాజీ కాదండోయ్ కాస్త పెద్దదయింది. ఫిఫ్తుఫారం చదువుతోంది. మీరు కాస్త తగ్గాలి" అంది నవ్వుతూ.

బావ నావంక తేరిపారచూచి నేను వెనక్కి తగ్గినా నా చెయ్యి పట్టుకుని తన వళ్ళోకూర్చో పెట్టుకుని "మీ అందరికి ఎంత పెద్దదయినా నాకుమాత్రం యింకా చంటిపాపే! ఏం అమ్మాజీ! అంతే కదూ!" అని అడిగాడు.

బావ యిదివరకు వచ్చినప్పుడల్లా మళ్ళీ వెళ్ళేవరకు నన్ను వదిలి వుండేవాడుకాదు. నేను కూడా బావతోనే భోజనం, బావతోనే బజారు. బావతోనే పడక అంతా బావే లోకంగా గడిపేదాన్ని. అలాంటిది బావకు బొంబాయిలో వుద్యోగం అవటంవల్ల రెండు సంవత్సరాలుగా మావూరు రాలేకపోయాడు. ఆఖరికి బావని వదిలి వుండలేక అక్క నాన్నని తీసుకుని బొంబాయి వెళ్ళింది.

బొంబాయి చపాతీల వేడివల్లనో మరేమోగాని అక్క ఆరోగ్యం పాడైంది. బావ ఆమాట వ్రాస్తే నాన్న వెళ్ళి అక్కనితీసుకొచ్చారు. మందులు అవసరం లేకుండానే పుట్టిన వూరు వచ్చిన అక్క ఆరోగ్యం బాగుపడింది.

వంట్లో కులాసా చిక్కగానే బొంబాయి ప్రయాణం కట్టింది అక్క. సంక్రాంతి దగ్గర కొచ్చింది తరువాత వెడుదువుగాని అని, అమ్మ నాన్న బలవంతం చెయ్యటం వల్ల ఆగిపోయింది. నాన్నగారు బావను కూడా పండక్కి రమ్మని ఉత్తరం వ్రాశారు. అక్క కూడా వ్రాసింది. ఈసారి రాకపోతే యిక అసలు బావతో మాట్లాడనని వ్రాయమన్నాను. ఎలా అయితేనేం బావ శలవుపెట్టి వచ్చాడు.

ప్రయాణపు బడలిక తీరేదాకా నిద్రపోయి లేచిన బావ కాఫీ తాగి బట్టలువేసుకు బయటకు పోతూ "అమ్మాజీ! రా!" అని పిలిచాడు. నేను డ్రస్సుమార్చుకు బయలుదేరుదామనుకుంటుండగా అమ్మ పిలిచింది. విసుక్కుంటూ లోపలకుపోయాను. అమ్మ నన్ను చాటుగాపిల్చి- "చూడు! అమ్మాజీ! అతగాడితో అలా గెంతుకుంటూ బజారుపోతే యిప్పటికే పెళ్ళికాలేదని నోళ్ళునొక్కుకునే యిరుగమ్మ పొరుగమ్మ కళ్ళల్లో నిప్పులుపోసుకుంటారు. వద్దమ్మా! వెళ్ళద్దు" అంది. అమ్మమాటకు అడ్డు చెప్పటం ఎప్పుడూ లేదు. అక్క వెళ్ళి బావతో ఏదో చెప్పింది. బావ వంటరిగా వెళ్ళిపోయాడు. బావతో బజారు వెళ్ళనీకుండా చేసిన నా పెద్దతనాన్ని తిట్టుకుంటూ వుండిపోయాను

రాత్రి తొమ్మిది గంటలవేళ బావ యింటికి తిరిగి వచ్చాడు. చేతిలోవున్న పొట్లం అక్కకి యిచ్చి ఎవరితోటీ మాట్లాడకుండా మేడమీద గదిలోకి వెళ్ళిపోయాడు. ముఖం కూడా అదోమాదిరిగా వుంది. కాసిని ఖబుర్లు చెపుదామని నేను కూడా మేడపైకి వెళ్ళాను. అక్కడ బావ చొక్కా అన్నా విప్పకుండా మంచంమీద పడుకుని దూలాలు లెఖపెడుతున్నాడా అన్నట్టు పైకిచూస్తున్నాడు. కొంచెం వూరుకుని "బావా" అని పిలిచాను. పలకలా. దగ్గరగాపోయి చెయ్యి పట్టుకుని "ఏం బావా! అలా వున్నావు" అని అడిగాను. బావ అదిరిపడి నావంక చూచి "ఓ! నువ్వా అమ్మాజీ" అని తిరిగి దూలాలు లెఖపెట్టసాగించాడు.

బావ ముఖంలో ఎప్పుడూ కనపడే చిరునవ్వుగాని ఉత్సాహంగాని కనుపించలా. అతని ప్రవర్తన నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. "నేను బజారు రాలేదని కోపం వచ్చిందా బావా!" అని అడిగాను. ఈసారి బావ బలవంతంగా నవ్వు తెచ్చిపెట్టుకుంటూ "అబ్బే! అదేంకాదు అమ్మాజీ! నన్ను కొంచెంసేపు వంటరిగా వదిలేయ్ నీకు పుణ్యముంటుంది" అన్నాడు. ఈసారి బావ మాటలు నాకు ఆశ్చర్యం కాదు చాలా బాధ కలిగించాయి. బావేనా యిలా మాట్లాడుతోంది అనిపించింది. మళ్ళీ మాట్లాడకుండా క్రిందకు వచ్చాను.

చావడిలో అక్క బావ తెచ్చిన పొట్లం విప్పి చూస్తూంది. అందులో క్రీమ్‌కలర్ శిఫాన్ చీర ఒకటి అదే రంగులో పరికిణాకు జాకెట్‌కు ఒక గుడ్డ, పాప్పులైను చారల షర్టుగుడ్డ వున్నాయి. చీర అక్కకి పరికిణా గుడ్డ నాకు అని వూహించుకో గలిగాను. కాని షర్టుగుడ్డ ఎవరికో అర్థం కాలేదు. మా యింట్లో మగపిల్లలు ఎవరూ లేరు. నాన్న బావ కూడా తెల్లసిల్కు చొక్కాలు తప్ప చారల చొక్కాలుతొడగరు. మరి ఆ గుడ్డ ఎవరికో అర్థంగాక తికమకపడ్డాను. ఇంతలో అమ్మ లోపలనుంచి "బావను భోజనానికి రమ్మని చెప్పు అమ్మాజీ! అని కేక వేసింది. బావ ఏకాగ్రతను భంగం చెయ్యటానికి యిష్టంలేక పోయినా తప్పని సరిగా పైకిపోయి "బావా! భోజనానికి లే" అన్నాను.

"మీరందరూ కానియ్యండి అమ్మాజీ! నేను యీపూట భోజనం చెయ్యను" అన్నాడు.



"ఏం బావా! అలా వున్నావు?" అని అడిగాను.

బావకు తప్పకుండా కోపం వచ్చి వుంటుందని గబగబా క్రిందకు పోయి అమ్మకు చెప్పాను. అమ్మ కూడ గాబరాపడుతూ బావకోసం ఎదురుచూస్తూ భోజనానికి పీట మీద కూర్చున్న నాన్నతో చెప్పింది. నాన్న, అమ్మ, అక్క గబగబా పైకివచ్చారు. బావ యింకా దూలాలు లెఖపెడుతూనే వున్నాడు. నాన్న బావ మంచం దగ్గిరగా వెళ్ళి—"కాళ్లు కడుక్కురావోయ్! భోజనం చేదాం—" అన్నారు. అంతవరకు ఏ ప్రపంచంలో వున్నాడో కాని బావ నాన్న మాటకు వులికిపడి లేచి మంచంమీద కూర్చుని మా అందరి వంక అదోమాదిరిగా చూస్తూ "నాకివాళ వంట్లో ఏమీ బాగు లేదు. మీరు భోజనం చెయ్యండి" అన్నాడు.

"అలా అయితే డాక్టరుకు కబురు పంపుదాం" అని బావతో అని నాతో "అమ్మాజీ! సుబ్బడిని వెళ్లి సుందర్రావుగారిని తీసుకు

వేలంతెచ్చిన గోల ★

రమ్మని చెప్పు" అన్నారు నాన్న. ఇంతలో బావ అడ్డు తగిలి "యీ మాత్రం భాగ్యానికి డాక్టరూ, మందు ఎందుకండి. నాకోసం మీరు కూడా యింకా కూర్చోవటం దేనికి? అప్పుడే పదవుతూంది మీరు వెళ్లి భోంచెయ్యండి" అని గోడవేపు తిరిగి పడుకున్నాడు. ఇక చేసేదేంలేక అక్కని అక్కడ వదిలి మేమంతా కిందికి వచ్చాం.

అన్నంముందర కూర్చున్నామే గాని ఎవరికీ వుత్సాహం లేదు. అమ్మ గుడ్లనీరు కక్కుకుంటూ "పాపిష్టిదాన్ని అమ్మాజీని అతడితో బజారు వెళ్లద్దన్నాను. అతనికి కోపంవచ్చి వుంటుంది" అంది. అమ్మ తెలివితక్కువకు నాన్నగారు చివాట్లు పెట్టారు.

* * *

మరునాడు కూడా బావ అలానే వున్నాడు. నాన్న అక్కని పిలచి "ఏమమ్మా! మీ యిద్దరూ ఏదన్నా మాటా మాటాగాని..." అనబోయే లోపల అక్క అందుకుని "అబ్బే అటువంటిదేమీ లేదు నాన్నారూ!" అంది. మరి బావ మౌనవ్రతానికి కారణం ఏమిటో ఎంత బుర్ర బగలగొట్టుకున్నా అర్థంకాలా.

మధ్యాహ్నం భోజనాలముందర బావను ఉత్సాహపరుద్దామని నాన్నగారు "ఏమోయి యీసారి నువ్వు "ట్వీడు" కుట్టించుకుంటావా! మంచి సిల్కుపంచలు వచ్చాయి తీయమంటావా" అని అడిగేసరికి బావ ముఖంలో పెద్ద మార్పు కనిపించింది. "మీయిష్టం" అని ఒక్కక్షణం వూరుకుని చివాల్న లేచి నాన్నగారితో మాత్రం "క్షమించండి" అని చెయ్యి కడుక్కుని గబగబా పైకి వెళ్ళిపోయాడు.

నాన్నగారూ మేమూ నిర్విణ్ణులమైపోయాం. ప్రతిసారి వచ్చినప్పుడల్లా నాకు ఫలాని సూటు కావాలి అని అడిగి కొనిపించుకునే బావ యీ ప్రవర్తన మమ్మల్ని పిచ్చివాళ్ళను చేసింది. నాన్నగారు కూడా వెండి కంచంలోనే చెయ్యి కడుక్కు లేచిపోయారు. అమ్మ దిగులుగా అక్కనిచూస్తూ "రాత్రి అతడు ఏమన్నా కారణం చెప్పాడటే" అంది. అక్క వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ మాట్లాడలేక "లేదు" అన్నట్టు తలకాయ తిప్పి వూరుకుంది. అమ్మ దీనంగా నా వంకచూస్తూ "అమ్మాజీ! బావ మనస్సులో దిగులు ఏమిటో నువ్వే కనుక్కోవాలి తల్లీ! యిక మా చేత కాదు" అంది. నేను కూడా అందుకే నిశ్చయించుకున్నాను. అన్నము వదిలి లేచి చెయ్యి కడుక్కుని మేడమీద గదిలోకి వెళ్ళాను. అక్కడ వున్న కుర్చీ బావ మంచం దగ్గరగా లాక్కుని కూర్చుని "ఏం బావా! మావల్ల ఏమైనా తప్పు వుంటే క్షమించాలిగాని యిలా తింటున్న అన్నం వదిలిపెట్టి వస్తే మాకెంత బాధగా వుంటుంది. నాన్నగారు కూడా భోజనం పూర్తి కాకుండానే లేచిపోయారు. నిన్నటినుంచి మా హృదయాలు ఎలా వున్నాయో గమనించావా! అసలు సంగతి ఏమిటో చెప్పు బావా! అని జాలిగా అడిగాను.

> "మన రామానికి మూడొందలు జీతంకదా! అంత డబ్బు ఏం చేస్తున్నాడో బోధపడటం లేదు. తనదగ్గిర నిన్నా ఏమీ డబ్బులేదన్నాడు; ఇవ్వాళా లేదన్నాడు."
>
> "ఏం? నిన్నేమైనా అప్పు అడిగాడా?"
>
> "ఎబ్బే! నేనే వాణ్ణి అడుగుదామని చూస్తున్నాను.

బావ ఒకక్షణం వూరుకుని "అవును అమ్మాజీ! నేను చేసింది చాల పొరపాటని తెలుసు. కాని అసలే బాధపడుతున్న నా హృదయానికి మీ నాన్నగారి ప్రశ్న శూలంలాగా తగిలింది. ఆ క్షణంలో యుక్తాయుక్త విచక్షణ లేకుండా ప్రవర్తించాను. దానికి యిప్పుడు బాధపడుతున్నాను" అన్నాడు. నీ హృదయాన్ని అంతగా బాధపెట్టే విషయం ఏమిటో మాతో చెప్పకూడదా బావా?" అని అడిగాను.

బావ వకనిట్టూర్పు విడిచి "[illegible] అమ్మాజీ! మనస్సులో బాధ యింకొకరితో చెప్పితే తగ్గుతుందంటారు. నిన్నసాయంకాలం నేను బజారు వెళ్లిన సంగతి నీకు తెలుసు గదా! నాలుగుబజార్లు తిరిగి 'యీవినింగ్ మార్కెట్'కు వెళ్ళాను. అక్కడవక పెద్దగుంపు పోగైవుంది అది ఏమిటో చూడాలన్న ఆశతో నేనుకూడా గుంపులోకి జొరపడ్డాను. గుంపుమధ్య ఒక పెట్టెమీద



కోతిపిల్ల కోమలం

ఫొటో: ఎస్. వి. కె. పర్వతాలు (మద్రాసు)

షాహుకారు కూర్చుని తన చుట్టూ వున్న అనేక రకాల గుడ్డలను వేలాంలో అమ్ముతున్నాడు నిన్న నేను యింటికి తెచ్చిన చీర అప్పుడే వేలం ప్రారంభించాడు. ఆ చీర చూడటానికి చాలాగుంది. మా అక్క యిదివరలో చాలాసార్లు 'క్రీమ్‌కలర్' శిఫాన్ కావాలని అడిగిందికూడ. అందుకు అది కొనాలని అనిపించింది. కాని నాకు వేలంలో వస్తువులుకొనటం అంటే అసహ్యం, భయంకూడా. చిన్నప్పుడు ఒకసారి యిలాగే మంచి 'ఫౌంటెన్ పెన్' ఒకటి వేలంలోకొని స్కూలుకు తీసుకు వెళ్లాను. అక్కడ పోలీసు యినస్పెక్టరుగారి అబ్బాయి ఒకడు అది తనదేనని, రెండు రోజులక్రింద దానిని ఎవరో 'డ్రిల్లు' క్లాసులో దొంగిలించారని అది నా దగ్గర వుంది కాబట్టి నేనే దొంగనని 'హెడ్ మాష్టర్'గారితో 'రిపోర్టు' చెయ్యటం, చివరకు నాన్నగారు నేను పోలీసు స్టేషన్‌కు పోవలసి రావటం, అక్కడ నేను ఆ పెన్ను దొంగిలించలేదని వేలంలోకొన్నానని ఎంత చెప్పినా యినస్పెక్టరుగారు నమ్మక నేను దొంగనని నామీద కేసుపెడతానని బెదిరించటం, దాంతో ఆ పెన్ను ఆయనకు సమర్పించి నమస్కరించటం జరిగింది. అందుకనే వేలంలో వస్తువులుకొనటం నాకు చాలా భయం.

★ వేలం తెచ్చిన గోల ★

కాని నా చుట్టూ వున్న వాళ్ళు విరగబడి కొనటంతో నాకు కూడా కొనాలని బుద్ధిపుట్టింది. అందుకని చీర, పరికిణా జాకెట్టుగుడ్డలుకొని వచ్చేదామనుకుంటుండగా సాహు కారు ఒక పట్టుగుడ్డ తీసి వేలం ప్రారంభించాడు. మొదటగా "రెండు రూపాయల"మీద 'పాట' ప్రారంభించాడు. ఇంతలో గుంపులో ఒక మూలనుంచి "రెండుం బేడ" అన్నమాట సన్నగా వినిపించింది. సాహుకారుతోసహా మేమందరము ఆవైపుచూచాము. అక్కడ ఒక పది పన్నెండేళ్ళ పిల్లవాడు నుంచుని వున్నాడు. తొడుక్కున్న చొక్కా లాగూ దాదాపు శిధిలావస్థలో వున్నాయి. "పాట" పెంచింది ఆ కుర్రాడే. "పెట్రోమేక్సు లైటు" కాంతిలో ధగధగ మెరిసే గుడ్డవంక ఆశతో చూస్తున్న అతనికి మేమంద రము అతని వంక చూస్తున్నామని తెలియగానే చాలా సిగ్గుపడిపో యాడు. గుంపంతా వక్కసారి గొల్లున నవ్వారు. దాంతో ఆ కుర్రవాడు మరీ కుంచుకపోయాడు.

సాహుకారుకూడ అతని వంక మహాపాడేవులే "బేడ" అన్నట్టు చూస్తూ-"మొత్తం మూడు గజాల పట్టుగుడ్డ పావులైనుది. రెండుం బేడ" అన్నాడు. మరొకరు "రెండుం పావలా" అన్నారు. ఆ అబ్బాయి తన చేతిలో డబ్బు లెఖ పెట్టుకుంటూ "రెండు రూపాయల ఆరణాలు" అన్నాడు. ఈ విధంగా "పాట" పెరిగి మూడు రూపాయల పదణాలవరకు వచ్చింది. ఆ అబ్బాయి మాటిమాటికి తన చేతిలో చిల్లర లెఖపెట్టుకుంటూ "పాట" పెంచుతూనే వచ్చాడు. ఇంతలో కేవలం పంతంకోసం అన్నట్టు ఒక సూటువాలా "నాలుగు రూపాయులు" అన్నాడు. ఆ కుర్రవాడు ఆదుర్దాగా తన చేతిలో చిల్లర లెఖ పెట్టుకుని దీనంగా గుడ్డవంకచూస్తూ నిట్టూర్పువిడచి వూరుకున్నాడు. సూటువాలా ఆకుర్రాడివంకచూచి ఒక వెకిలినవ్వు నవ్వాడు. నాకు ఆ సూటువాలామీద విపరీతంగా కోపంవచ్చింది. పాపం ఆకుర్రాడు ఎంతో ఆశతో కొనుక్కోవాలని చూసిన గుడ్డని అతను అలా పాడు చెయ్యటం నేను సహించలేక పోయాను. ఎలాగైనా ఆ గుడ్డని ఆకుర్రాడికి కొని యివ్వాలని నిశ్చ యించుకున్నాను. ఇంతలో సావు కారు "పట్టుగుడ్డ నాలుగు రూపా యలు. వకసారి రెండోసారి. మూడో......" అనబోతున్నాడు. నాకు వళ్లు తెలియలేదు. 'పది రూపాయులు' అని బిగ్గరగా అర చాను. గుంపంతా విచిత్రంగా నావంక చూచారు. సూటువాలా నావైపు కొరకొరచూస్తూ వెళ్లి పోయాడు. తను ఎప్పుడూ అను కోని ధర ఆగుడ్డకు వచ్చినందుకు సంతోషిస్తూ సావుకారు ఆ గుడ్డ నామీదకు విసిరాడు. లైటు కాంతిలో దూరంనుంచి ధగధగ మెరిసిన ఆ గుడ్డ దగ్గరకు రాగానే పదిరూపాయల వెల చెయ్యదని తెలిసిపోయింది. ఏమైనా ఆగుడ్డ ఆ అబ్బాయికి కొని యివ్వగలుగు తున్నానుగదా అన్న సంతృప్తితో వెంటనే పదిరూపాయులు చెల్లించి ఆ కుర్రవాడు వున్నవైపు గబగబ నడి చాను. అక్కడకు వెళ్లి చూడగా అతనక్కడ లేదు. అక్కడే నిలబడి వున్న యిద్దరుముగ్గుర్ని ఆ అబ్బాయి ఎక్కడ అని అడిగాను. వాళ్లు నా వంక అదోమాదిరిగా చూస్తూ "మీరు పదిరూపాయులు అనగానే అతను ఏడుస్తూ వెళ్లిపోయినాడు. అని చెప్పారు. నాకు పిచ్చెత్తినట్ట యింది. వాడికోసం బజార్లన్నీ తిరిగాను కాని ఎక్కడా కనుపిం చలా. ఇందాక మీ నాన్నగారు నన్ను "ట్వీడు"కావాలా సిల్కు పంచలుకావాలా" అని అడిగేసరికి ఏడుస్తూ వెళ్ళిపోయిన ఆ అబ్బాయి రూపం నాకళ్ళముందు కనిపించింది. అందుకని అలా లేచివచ్చాను" అంటూ బావ తనకథ ముగించాడు.

బావ విశాలహృదయాన్ని మెచ్చు కుంటూ అతనిముఖం వంకచూసే సరికి బావ ఎంత బాధపడుతున్నా డో తెలిసింది. బావను ఎలా ఓదార్చాలో తెలియక క్రిందకి వచ్చి నాన్నగారితో సంగతంతా చెప్పాను. అక్కడ నిలబడివింటున్న అక్కయ్య, అమ్మలముఖాలు విప్పా రాయి. నాన్నగారు పైకివెళ్ళి అను నయవాక్యాలతో బావను ఉత్సాహ

...రించారు. శావ ఉదారహృదయా అప్పటికి బావముఖం డబ్బులు 'ట్వీడుసూటు' ఖరీదు చేసే డబ్బులో ...న్న మెచ్చుకుంటూ సాన్న గారు విడచిన ఆకాశంలాగ అయింది. బీదపిల్లలకు చొక్కాలాగూలుకొని ...ఓ చిన్న ఉపన్యాసం యిచ్చారు. శావ కోరికమీద సాన్న గారు పంచిపెట్టారు. ★

కలలో కోతి

పన్నాల మధులత


ఆరోజు మా బుల్లిమామయ్య మెయిలుకు వస్తాడని ఉత్తరం వచ్చింది. నేనూ, మా అక్కా టయిమవకండానే వాకట్లోకి, ఇంట్లోకీ తెగ తిరుగుతున్నాము. రోజూకంటే ఆరోజు బండీ లేటు గూడా అయినట్లు వున్నది.

ఎల్లాగయితేనేమి రిక్షాలో నవ్వుకుంటూ దిగాడు మామయ్య. మా ఇద్దరకూ బిస్కట్ల టిన్ను యిచ్చాడు. అమ్మావాళ్లతో గుక్క తిప్పుకోకండా క్షేమసమాచారములన్నీ మాట్లాడుతున్నాడు. ఆ డబ్బా మూత రాక అక్కా నేనూ చాలాసేపు తంటాలుపడి చివరకు ఎల్లాగో ఒకప్రక్కనుండి బిస్కట్లు పైకిలాగి పంచుకుని తింటున్నాము. మామయ్య పనంతా పూర్తి చేసుకుని మావద్దకు వచ్చాడు. అక్కకూ నాకూ కథలంటే ఎంతో సరదా. ఎవరు మా యింటికివచ్చినా వాళ్ల ప్రాణాలు తీసేవాళ్లము కథలు చెప్పమని. ఆఖరికి వంటావిడగూడా మాబాధ భరించలేక రోజూ ఎక్కడో నేర్చుకునివచ్చి మాకు చెప్పేది. అల్లాంటప్పుడు మామయ్యని వదలిపెడతామా!


"మామయ్యా మంచిసినిమాలు ఏమయినా చూశావా" అని అడిగింది అక్క.

రాత్రికి వెన్నెట్లో పడుకుని చూసినవన్నీ చెబుతాగా అన్నాడు మామయ్య. రాత్రవగానే భోజనాలుచేసి చల్లగాలికి అందరూ బయటచేరాము. మామయ్య మధ్యనా అటు అక్కా ఇటు నేనూ పడుకున్నాము. ఏవో పిల్లలకు సినిమాలు వస్తున్నవిట, ఇంకా ఏవో తను చూసిన సినీమాలూ చెబుతున్నాడు. అక్క అతిశ్రద్ధగా వింటున్నది. నాకు మాత్రం విసుగెత్తుతున్నది. అసలే సినిమాలంటేనాకు చిరాకు. జోలెడంతసేపు కూర్చోవాలి. అదిగాక కాసేపు నవ్వుతో పాటలుపాడుతారు. వాళ్లే మళ్లా ఏడుస్తో పాడతారు. మళ్లాకాసేపు చచ్చిపోతారు, ఆఖరికి బ్రతకడం.

(౫౬-వ పేజీ చూడండి)



పులికాదిది—పిల్లి!
(ఫొటో: రంగనాథన్—మద్రాసు)



పక్షి వ్యూహము

కొంగలు మొదలైన కొన్ని రకాలపక్షులు గుంపులు గుంపులుగా ఎగిరిపోయేటప్పుడు V అనే ఇంగ్లీషు అక్షరం మాదిరిగా వ్యూహం పన్ని ఎగురుతూండడం సాధారణంగా మీరు చూసే ఉంటారు. ఆకాశంలో చాలా ఎత్తుగా ఎగిరే పక్షులు మాత్రమే ఇలా ఒక వ్యూహాకారంలో ఎగురుతాయి. వాటిలోకూడా చాలా దూరప్రయాణం చేసే పక్షులు మాత్రమే అలా వ్యూహంగా ఏర్పడతాయి. దీనికి కారణమేమిటి ?

పడవయొక్క ముందరిభాగం కోసుదేలి నీటిని చీల్చుకుపోవడానికి అనువుగా నిర్మించబడి ఉంటుంది. అదే, అడ్డంగా పలకవలె గనుక ఉంటే నీటిని తొలగించుకొని పోవడానికి కష్టమవుతుంది. అదే మాదిరిగా పక్షులు గుమిగూడి V ఆకారంలో ఎగిరేటప్పుడు ముందరిభాగంలో పక్షినాయకుడు ఉంటాడు. నాయకపక్షి మిగతా పక్షులకంటె బలిష్ఠంగా ఉంటుంది. అది గాలిని ముందు తనే ఛేదించుకుని పోతూ మిగతా పక్షులు రావడానికి వీలు చేస్తుంది. వ్యూహంలో వెనకబడి ఉండే పక్షులు ఎప్పుడూ బలహీనమైనవే అయి వుంటాయి.

పక్షులు ఆయా ఋతుభేదాల ననుసరించి ఒక దేశంనుంచి మరొక దేశానికి ప్రయాణం చేస్తూ ఉంటాయి. ఒక్కొక్కసారి కొన్ని వేల మైళ్లదూరం కూడా అవిదాటి తమకు ఆహారానికి, నివాసానికి, గుడ్లు పెట్టడానికి వీలైన దేశాన్ని వెదుక్కోవలసి ఉంటుంది. ఇంత దూరం ఎగిరేటప్పుడు అవి అలిసిపోతాయిగదా. అందుచేత అక్కడక్కడ ఆగి మజిలీలు చేస్తాయి. మజిలీచేయడానికి వీలైనస్థలం వెదకవలసిన బాధ్యత నాయకపక్షిది. ఈపక్షి బలిష్ఠమైనదే కాక బాగా వయస్సు, అనుభవం గలది కూడా అయి ఉంటుంది. అందుచేత అది ముందు ఉండి మిగతావాటికి దోవ చూపుతూ ఉంటుంది. ఏదైనా అపాయం రాబోతోందంటే అనుచరులను హెచ్చరిస్తుంది. నాయకపక్షి 'దిగవచ్చును' అని అనుమతి ఇచ్చేదాకా అనుచర పక్షులు తమ స్థానాలు వదలవు. ముందు నాయకపక్షి దిగినతర్వాత మిగతావి అదే V ఆకారంలో నేలకు దిగుతాయి. ★




జనతా వారి "పరివర్తన"లో అక్కగా సావిత్రి, తమ్ముడుగా మాష్టరు నాగేశ్వరరావు.



''అన్నదాత''లో నాగేశ్వరరావు, అంజలీదేవి, అమ్మాజీ.

★

''ధర్మపత్ని''లో నిరూపరాయ్, సీత.



ప్రేక్షకుల అభిప్రాయాలు

'జ్యోతి'లో తమస్సు

'జ్యోతి' తెలుగు సాంఘిక చిత్రాన్ని కీర్తికాములు కొందరూ, కీర్తిశేషులు యిద్దరూ (గురజాడ అప్పారావు, మంగయ్య గార్లు), కలిసి తయారుచేశారు. వీరందరిలోకీ ఒక్క కీ. శే. గురజాడ అప్పారావుగారు చేసిన కృషిమాత్రమే అర్థవంతంగా వుంది. అర్థశతాబ్దం క్రితమే 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని మనుషులకి జ్ఞాపకం చేసిన ఒక మహాకవి రచనను సినిమా అవసరానికి వాడుకొంటూ, ఆయనకు కృతజ్ఞత తెల్పటం ఎలాగో తెలియక ఆయన పేరును టైటిల్స్‌లో పాటలపద్దు క్రింద వేసి వూరుకొన్నారు యీ చిత్ర నిర్మాతలు. ఈ లెక్కని ఎవరైనా రామాయణం సినిమాగా తీస్తే, "కథ...వాల్మీకి" అని టైటిల్స్‌లో చూపించటం జరిగినా జరుగవచ్చు ననిపిస్తోంది.

'జ్యోతి' సినిమాద్వారా నిర్మాతలు సాంఘిక ప్రయోజనం సాధించాలని బద్ధకంకణులైనట్లున్నారు. స్త్రీస్వాతంత్ర్యాన్ని గురించి, నేటి విద్యావిధానాన్ని గురించి, భూస్వామి - కౌలుదార్ల సంబంధాలను గురించి కొన్ని వ్యాఖ్యానాలు చేశారు. వివాహం విషయంలో స్త్రీకి స్వాతంత్ర్య వుండాలనేది యీ రోజుల్లో ఎవరూ కాదనలేని సిద్ధాంతం. కాని - స్త్రీలందరూ జ్యోతిలాగా 'సినిమా' చివరివరకు పెళ్ళి విషయం ఆలోచించనైనా ఆలోచించకుండా వుండరుకదా! ఆమెలాగే ఆదర్శాలు ఎన్నో పెట్టుకొని, వాటి సాఫల్యంకోసం సదా కృషిచేస్తూకూడా మానవసహజమైన వాంఛలనీ, వయస్సుతో పెరిగే కోరికలనీ యీమెలాగా త్రోసి రాజనగలరా? పోనీ - ఆ పాత్రధరించిన నటినిచూసైనా ఆమాదిరి జీవితం ఎలావుంటుందో అవగాహన చేసుకొందామనుకొంటే, ఆమె రూపురేఖ విలాసాలు అందుకు మనకు ఎటువంటి ఆస్కారము యివ్వలేదు. జ్యోతిపాత్ర మొదటినుంచీ నడిచిన ఫక్కీనిబట్టి చూస్తే చివరలో ఆమె మధును పెళ్ళిచేసుకోవటమనేది కేవలం యీకథను అల్లినవారి మీద గౌరవం కొద్దీ చేసుకొన్నట్లు వున్నది కాని నిజంగా తనకి పెళ్ళి అవసరమనిపించినట్లు లేదు. మధును తనకాబోయే భర్తగా ఆమె ఎన్నడూ ఆలోచించలేదు. అసలామెకు ఆ దృష్టే లేదు.

ప్రస్తుత విద్యావిధానంలో వున్న దోసగుల్ని ప్రత్యక్షంగా కళ్లకు కట్టినట్లు చూపించాలని చిత్రనిర్మాతలు చాలా ప్రయత్నించారు: స్కూళ్లు స్థాపిస్తామంటూ గ్రాంట్లు సంపాదిస్తామంటూ ఒక్కొక్క వూళ్లోనూ పెద్దమనుషులు ఏవిధంగా తమ స్వార్థాలనే సాధించుకొంటారో కొంతమటుకు ఋజువు చేశారు. బాగానే వుంది. సాధారణముగా చదువు అంటే ఏవగించుకొనే యీడు పిల్లల్ని సయితం బడికి పోకపోతే ఏడుపు లంకించుకొనేటంత బలంగా ఆకర్షించేట్లు చేయటానికి జ్యోతి అవలంబించిన విద్యావిధానం ఏమిటో చిత్రంలో ఎక్కడా బయటపెట్టారు కాదు. కాకపోతే—ఏదో ఒక సందర్భంలో జ్యోతి ఏడుస్తున్న పిల్లడ్ని ఒకణ్ణి ఎత్తుకొంది. అంతమాత్రంచేత పిల్లలంతా ఆమె చెప్పే చదువుకోసం చెవికోసుకొంటున్నారంటే నమ్మటం కష్టంగావుంది. అదీకాక - కేవలం జ్యోతి ఎంత ఆదర్శప్రాయమైనదో మనకి తెలివిడి చేయటంకోసం పిల్లలలోవుండే సహజగుణాలన్నీ జల్లెడవేసి, ప్రేమ, కరుణ, క్షమ వగైరా వగైరా సుమతీ శతకం తాలూకు మంచి గుణాలుమాత్రమే వాళ్లల్లో అట్టే పెట్టారు కథకులు. ఇదే అంశాన్ని మరోకలా చెప్పాలంటే - యీ చిత్రంలో వచ్చే చిన్నపిల్లలు పెద్దవాళ్లకంటె వందరెట్లు బుద్ధిమంతులు; అల్లరి చేయరు. చదువుకోమంటే సంతోషిస్తారు: చదువుకోవద్దంటే ఏడుస్తారు: ఆకలౌతున్నా, ఆడుకోవాలని బుద్ధిపుట్టినా పంతులమ్మకు పాకలు కట్టేపని మానుకోరు. పెద్దవాళ్లు అల్లాకాదు. చిన్నపిల్లలకంటే అతి హీనంగా ప్రతి చిన్నవిషయానికీ దెబ్బలాడుకొంటారు. ఎక్కడలేని పంతాలూపోతారు ఒకర్ని చూసి ఒకరు వుడుక్కొంటారు: ఎవరు ఏదిచెప్పినా 'వినినంతనె వేగిరపడి వివరింప'కుండా నిర్ణయాలకి వచ్చేసి అవతలవాళ్ళ నెత్తిమీద యింత దుమ్ము జల్లేస్తారు.

భూస్వామి - కౌలుదార్ల సంబంధాలను గురించిన కొంత ప్రసక్తి యీ చిత్రంలో కాకతాళీయగా వచ్చింది. తన పొలం కౌలు తీసుకొని చేస్తున్న మధుని వేరేవో కారణాలవల్ల ఆ పనిలోనుంచి తొలగించాలని భూస్వామి అయిన కనకయ్య కంకణం కట్టుకుంటాడు. అది అంత తేలిగ్గా సాధ్యపడే పనికాదని తేలాక కొందరు రౌడీ మూకల్ని మధుపైకి వుసికొల్పాడు. అంత పెద్ద హుమ్మసుమీద వచ్చినరౌడీలు, జ్యోతి తండ్రిని చూసి నంతమాత్రాన ఎందుకు'దడుసుకు పారిపోవలసి వచ్చిందో యీ చిత్రంలో మనకు ఎవరూ చెప్పరు. భూస్వాములకీ కౌలుదార్లకీ వచ్చే సమస్యలన్నీ యీ విధంగా పరిష్కారం కావాలంటే చాలా కష్టం: అవుతాయంటే నమ్మటమూ కష్టమే.

అలాగే రంగడిలో రంగుమార్పు ఎందుకు వచ్చిందో మనకు ఎవరూ చెప్పరు. మొదటినుంచీ శుద్ధ మొద్దులా బతికిన రంగడు క్లైమాక్సు సీను వస్తోందనేసరికి అమాంతం మంచివాడై పోయి, మధుకి రాబోయే ఆపదను గురించిన ముందుభోగట్టా జ్యోతికి అందచేస్తాడు. జ్యోతినిచ్చి పెళ్లి చెయ్యమని తల్లి కొంగుపట్టుకు దేబిరించిన రంగడు, ఒక్కసారిగా మగవాడు మొనగాడు ఎలా కాగలిగాడనేది పెద్దసమస్య.

జ్యోతి తండ్రి రామయ్య విషయంలో కూడా అటువంటిదే ఏదో లోపం కనిపిస్తోంది. అతనికి కూతురు పెళ్ళికంటే కూడా, కూతురు కుట్టే మిషన్ తీసి పారెయ్యటమే ప్రధాన సమస్యగా వున్నట్లుంది. ఊళ్ళోవాళ్ళంతా జ్యోతి కుట్టుమిషన్ పెట్టినందుకు వెక్కిరించినమీదట కాని, అతనికి కూతురి పెళ్ళిసంగతి జ్ఞాపకరాలేదు కాబోలు. పెళ్ళిసంగతి అతడు ఎత్తడమైనా, కూతురుచేత కుట్టు మాన్పించటానికే ఎత్తినట్లుంది కాని, పిల్లకి యీడు వచ్చిందన్న వుద్దేశంతో కాదు.

మొత్తంమీద యీ సినిమా చూస్తుంటే ఏదో పత్రికల్లో పడ్డ కథ చదువుతున్నట్లుంది. కాని, తెరమీద నడిచే కథలా

విఖ్యాత ప్లేబ్యాక్ ఆర్టిస్టులచేత కోరస్ సాంగ్సులో ఒకటి రెండు శేకలు వేయించి, పబ్లిసిటీకోరకు వారిని ఉపయోగించటం బాగా లేదు.

"జ్యోతి"లో ఏ దృశ్యం చూసినా ఇంత కంటె బాగా తీయవచ్చు అనే భావం ప్రేక్షకునకు కలుగుతుంది. హెడ్‌మాస్టరు, జ్యోతి స్కూలునుండి వెళ్ళిపోయే ఘట్టాలు బాగా చిత్రించబడ్డాయి. మొత్తంమీద జ్యోతి నిర్మాతల 'ఆశాజ్యోతి' గానే ఉండి పోయి, ప్రేక్షకులకు 'నిరాశా జ్యోతి' గా తయారైంది.

పరణాం మురళీకృష్ణ – గుంటూరు.



మద్రాసు నాటక కజగంవారు ఈనెల ఒకటో తేదీనుండి కళామండప్‌లో అఖిల భారత జానపద నృత్య, నాటక ప్రదర్శనోత్సవం ఏర్పాటుచేశారు. మద్రాసు ఆర్థికమంత్రి సి. సుబ్రహ్మణ్యం ప్రారంభోత్సవ చేశారు. పై దృశ్యం—నాగా నృత్యం.

"బాలానందం" —చాలానందం

నిన్న మొన్నటివఱకు ఆంధ్రబాలలకు నోరూరుతుండేవి విదేశబాలల చిత్రాల సంఖ్య విన్నప్పుడు వాటినిగూర్చి ప్రశంసలు పత్రికల్లో చదివి నప్పుడూను. మన దేశంలో ప్రతి చిత్రనిర్మాత "బాలలకు (ప్రత్యేక చిత్రాలు) లేకపోవడం చాలా విచారకరం" అంటూనే తాము బాల చిత్రాలు తీయడానికి సాహసించలేక పోయారు. అవి తీయడంకూడ అంత తేలికైన పనికాదు. పేరు మోసిన నటకులతో నిర్మింపబడిన చిత్రాలే ప్రజాదరణ పొందలేక పోతున్నాయి. ఇక బాల నటకులతో నిండిన చిత్రాలు విజయం పొందుతాయన డానికి గుండెలు చాలక బాలల చిత్రాలు నిర్మించడానికి సాహసించలేక పోయారు నిర్మాతలు.

కె. ఎస్. ప్రకాశరావుగారు నిర్మించిన "బూరెల మూకుడు" "కొంటె కిష్టయ్య" "రాజయోగం" చిత్రాలు బాలలకు అనువైనవి. 'బూర్లెమూకుడు' కథను ప్రతివారు చిన్నతనంలో వాళ్ళ అవ్వదగ్గరో తాతదగ్గరో విని ఉంటారు. అదే కథను బాలలు తెరపైచూసినపుడు అమాయికంగా ఆనందంలో నవ్వడం జరుగుతుంది. చిత్రంలోని సంభాషణలు తేలికగా బాలలకు అర్థమయ్యేటట్లు ఉన్నాయి ఇలా వ్రాయడానికి ఎక్కువగా రచయిత పిల్లల మనస్తత్వాలను తెలుసుకొని ఉండాలి. రచన బావుంది.

ఇక 'కొంటెకిష్టయ్య'ను తీసికొందాం ఇది నీతిబోధకంగా ఉంది. ఈ నీతిని హాస్యంతో మిళితం చేసి బాలలహృదయాలకు హత్తుకు నేటట్లు చేశారు రచయితలు. దీన్లో అల్లరి చిల్లరిగా తిరిగిన ఒక కొంటె విద్యార్థికి ఎలా పరివర్తన కలిగి బుద్ధిమంతుడై తోటివారలలో మేటి అనిపించుకున్నాడనేది కథాంశం. దీన్ని చూసిన బాలలకు తోటివారితో ఎలా మెలగాలన్నది బాగా అర్థమవుతుంది. "పదునైన చాకుతో గొంతుకూ కోసుకోవచ్చు, పెన్సిలూ చెక్కుకోవచ్చు..." అన్న మాటలో బాలలకు చక్కగా అర్థమయ్యేట్టు గొప్ప నీతిని తేలికగా చక్కని ఉదాహరణతో చెప్పిన రచయితలు శ్రీ న్యాయపతి రాఘవరావు శ్రీమతి కామేశ్వరమ్మగార్లు ప్రశంసనీయులు.

ఇక 'రాజయోగా'నికి వద్దాం. కథ పాతదే అయినా దానిలో పాన్ని శ్రీ ఆరుద్ర గారి మృదువైన మాటలు పాటలు కప్పిపుచ్చినాయి. ఇది వీరోచిత గాథ అవడం వల్ల బాలలకు ఉత్సాహం ఉత్తేజాలు కలుగుతూ ఉంటాయి దీనిలోని సెట్టింగ్సు, ఔట్‌డోర్ సీన్సు చాలా చక్కగా ఉన్నాయి. దీనిలో ఒక ప్రత్యేకతకూడ ఉంది పెద్ద నటకులతో ఎక్కువ నిడివిగల చిత్రాలెన్నో ఉన్నాయి. అవి అప్పటికీ సంపూర్ణతను చేకూర్చుకోలేక అసభ్య, అపహాస్యాలతో నిండిఉంటున్నాయి కాని 'రాజయోగం' కొద్ది చిత్రమైనా, బాలనటులైనా తక్కువ చిత్రాలలో 'హంస యోగా'న్ని అందుకుందనడంలో అతిశయం లేదు.

'బూరెల మూకుడు'లోని దంపతులు, డాక్టరు, భూతవైద్యుడు, పోలీసు, శేట్ మొదలయిన వాళ్లు బాగా నటించారు. 'కొంటె కిష్టయ్య'లో కొంటెకిష్టయ్య, మాష్టారు పాత్రలు చాలా గొప్పగా ఉన్నాయి ముఖ్యంగా మాష్టారు పాత్ర కుఱ్ఱవాడు బాగా అర్థంచేసుకొని నటించాడు 'రాజయోగం'లో మాష్టర్ రేలంగి ద్విపాత్రాభినయం, బేబీ మల్లిక (రాజకుమారి) కుందు, మంత్రికుమారి వేసిన అమ్మాయి, కందామోహన్ తదితర బాలనటకులు చాలా నేర్పుతో నటించారు


ఈ చిత్రాలవల్ల మన బాలనటుల సత్తా చాలవఱకు తేలింది. నిర్మాతలైన శ్రీ ప్రకాశరావుగారి నభినందించక తప్పదు. వెండి తెరమీద యింతమంది బాలనటకులను ఒక్కసారిగా పరిచయంచేసి వారిలోఉన్న ఉత్సాహాన్ని నేర్పరితనాన్ని బయటికి వెదజల్లినారు.

అడిశం పాపారావు—ఏలూరు.


ప్రేక్షకుల అభిప్రాయాలు

ఎన్నిరోజులనుంచో అనుకుంటున్న ప్రకాశ్ ప్రొడక్షన్స్‌వారి "బాలానందం" విడుదలయి ఆంధ్ర దేశంలో బాగా పోతోంది. ఈ చిత్రం చిన్నా పెద్ద ప్రేక్షకులనందరినీ బాగా ఆకర్షిస్తోంది

ఇక చిత్రం ఎట్లా వుందంటారా ? ఏదో చిన్నపిల్లల చిత్రం అయినా చిత్రం అంత ఉత్తమస్థాయిలో వుందంటే అందుకు కారకులైన ప్రకాశరావుగారినీ, చిన్న పిల్లలనూ అభినందించకుండా వుండలేము. ముఖ్యంగా మూడు చిత్రాలలోకీ 'రాజయోగం' చాలాబాగుంది. కథ అసహజాల పుట్ట అయినా అది జానపదంగనకా, అందులోనూ చిన్నపిల్లల చిత్రం గనకా లెక్కలోకి తీసికోనవసరంలేదు. పెద్దపెద్ద నిర్మాతలు నిర్మించే జానపద చిత్రాలలోనే కథ అంతంత మాత్రంగా వుంటోంది. కొన్ని సెట్టింగులు కన్నుల పండువగా వున్నాయి. ఆ సెట్టింగులకు తగ్గట్టు బేబీ మల్లిక నటన, మంచి పాటలూ తోడయి మనోహరంగా వున్నాయి నటకులలో 'ప్రాణాంతకుడు'గా నటించిన కుర్రాడి నటన చాల బాగుంది. నాయికగా బేబీ మల్లిక అత్యంత ప్రశంసనీయంగా నటించిందని ఒప్పుకొని తీరాలి. ఈ చిన్నపిల్ల ఇంత బాగా నటి



"మేలుకొలుపు"లో శ్రీరాం.



జనతా వారి "పరివర్తన"లో రమణారెడ్డి, ఎన్. టి. రామారావు.

స్తుందనుకోలేదు. తరువాత 'కొంటె కిష్టయ్య'లో కుందూ బాగా నటించాడు. తతిమ్మా పిల్లలంతా గూడా వారివారి పాత్రలను బాగానే పోషించారు.

పెండ్యాలవారి సంగీతం కొన్నిచోట్ల అద్భుతంగావుంది. జాగిర్దార్ ఫొటోగ్రఫీ ముఖ్యంగా కొండ దృశ్యాలలోనూ, రాజమహల్‌లోనూ బాగావుంది 'ఆవారాహుం!' అనే బాణీలోవున్న 'నా టోపీలో' అనే పాట చాల అవాస్తవంగా వుంది ఆ సన్నివేశాన్ని తీసివేసినా చిత్రానికేం నష్టంలేదు.

మొత్తంమీద 'బాలానందం' చక్కని వినోద కాలక్షేపాన్ని కలుగజేసింది ఇట్టువంటి చిన్నపిల్లల చిత్రాలను నిర్మించబూనుకోవటం చాల ముదావహం ఈ విషయంలో ప్రకాశరావును మరోసారి అభినందిస్తున్నాను ప్రకాశ్ సంస్థనుండి చిన్నపిల్లల కుపయోగపడే చిత్రాలు ఇంతకన్నా మంచివి వస్తాయని ఆశిస్తున్నాను.

పర్సా నవనీతకృష్ణ,—
సూర్యాపేట.

"కల్యాణం పణ్ణియుం బ్రహ్మచారి"

పద్మినీ పిక్చర్సువారు ఇటీవల విడుదలచేసిన తమిళచిత్రము "కల్యాణం పణ్ణియుం బ్రహ్మచారి" పై శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రిగారు ఒక ప్రకటనచేస్తూ తాము దాదాపు రెండు సంవత్సరాల క్రిందవ్రాసిన "వ్యామోహము" అను తెలుగు నాటకములోని కథను యథాతథంగా కొద్ది మార్పులతో పై కంపెనీవారు సంగ్రహించి తమ చిత్రములో వాడుకొన్నారని అంటున్నారు.

"కొన్ని డాన్సులు, పాటలు, సర్కసులు, ప్రమాదముల సీనులు తప్ప అంతయు నేను వ్రాసిన కథయే ఈ తమిళచిత్రమునకు ఆధారమై యున్నది." అని శ్రీ శాస్త్రిగారు వాదిస్తున్నారు.

తమ అనుమతిలేకుండా పద్మినీ పిక్చర్సువారు (బి ఆర్. పంతులు, పి. నీలకంఠన్ గార్లు) తమ నాటక కథావస్తువును వాడుకొన్నందుకు వారిపై 'క్రమచర్యల' నుకూడా తీసుకోబోతున్నట్లు శాస్త్రిగారు తెలియపరుస్తున్నారు.

★ సినిమా వార్తలు ★

దేవదేవీ విప్రనారాయణుల ప్రసిద్ధ కథను భరణీవారు చిత్రం తీస్తున్నారు భానుమతి వేశ్యయైన దేవదేవిగా, ఎ. నాగేశ్వరరావు వైష్ణవభక్తుడైన విప్రనారాయణుడుగా నటిస్తున్నారు. రామకృష్ణగారు డైరెక్టరు. రచన సముద్రాల. గత బుధవారం నుండీ భరణీ స్టూడియోలో షూటింగు ప్రారంభమైంది మొదటగా దేవదేవి భవనం సెట్టుమీద పని జరుగుతున్నది.

*　　*　　*

సాహిణీ పిక్చర్సు అనే కొత్తసంస్థవారు "సందేశము" అనే జానపద చిత్రము ప్రారంభించారు. వాహినీలో షూటింగ్ జరుగుతున్నది. శ్రీరంజని, అమర్‌నాథ్, రేలంగి మున్నగువారు నటిస్తున్నారు. కథ, సంభాషణలు వ్రాసినది తాపీ ధర్మారావు గారు దర్శకుడు ఎ. సుబ్బారావుగారు.



కీ॥ శే॥ గురజాడవారి "దేశమును ప్రేమించుమన్నా" గీతాన్ని పిల్లలచేత పాడిస్తున్న జ్యోతి—నవయుగవారి "జ్యోతి"లో దృశ్యం.

వంట నేర్చిన భర్త

(9-వ పేజీ తరువాయి)

చంద్రానికి పరువునష్టం అనిపించి మానిపించేశాడు. కాని ఏం సుఖపడ్డాడు? వళ్ళు వంచి, గంటలకొద్దీ కాలం వృధాపరిచి వుతకడమే గాని. ఒక బట్టా తేటు రాలేదు. మురికి వాసన మెతగవాసనా ఎంత వుతికినా పోలేదు. వాడిని మానిపించిన లాభం లేకపోగా చాకలిసోడా, నీలిమందూగాని, బట్టలసబ్బుగాని కొనాలి! బొగ్గుల ఖర్చు, కర్రల ఖర్చు, యివన్నీ పెట్టుకునే కన్న—మొత్తంమీద అందరి బట్టలూ వుతికేవాడు చాకలి కాబట్టి వాడికే కిడుతుంది, వాడే చవుక అనిపిస్తుంది! అదీకాక ఇస్త్రీ లేనిదే బట్ట కట్టలేం! దానికోసం అధమం 5 రూపాయలయినా యిచ్చి కక్కుర్తి పడాలి! ఆ అయిదు రూపాయలూ యిస్తే - అర్ధ సంవత్సరంపాటు మాటాడకుండా వుతికే చాకళ్లు యింకా వున్నారు! చాకలి ఏనాడో ఒక చిన్న బట్ట పారేసేడూ అంటే పూర్తిజ్ఞానం, అనుభవం లేని యీ స్వయంకృషివల్ల ఎన్ని బట్టలు యిస్త్రీ పెట్టేకి అహుతి అయిపోతాయో! ఇక మంగలి పని. రకరకాల క్రాఫింగులు ఫాలెంజిమీద కత్తిరించే మంగలివాడే తన బుర్ర తను గీసుకోలేడు!

నాలుగురోజులు కదురాడించినంత మాత్రంలో తనకీ తన భార్యకీ కుటుంబానికీ సరిపడ్డ బట్ట తనొక్కడు తయారు చెయ్యగలడా? అలాగని యీ పని చెడ్డదని కాదు. దారం తీయవచ్చు. దానిని వుపయోగించే విధంగా వుపయోగించాలి! అంతేగాని చంద్రంలాగ తను తీసిన అంగుళం దళసరిదారం బట్టనేయించి, పిడుక్కూ బియ్యానికీ ఒకటే మంత్రంలాగు, చొక్కాలకీ, చీరలకీ, పంచలకీ, అంగవస్త్రాలకీ, ధోవతులకీ ఆ ఒక్కబట్టే ధరించగలరా? యిహ నటువంటి బట్ట కట్టుకొని భార్యని చూసి తనూ తననిచూసి ఆమె ఏం ఆనందించగలరు? బ్రతికిన మూడురోజులూ ముచ్చటగా వుండక యిదవడు చెప్పిన బుద్ధి? పీడెలాగయినా కక్కుర్తి పడగలడు గాని యింట్లో ఆడది వూరుకోగలదా? కొత్తరకం కనబడితే చాలు కొనుక్కొని కట్టుకోవాలని వాళ్లకి వుంటుంది! అటువంటిది కూర్చుంటే లేవలేనంత బరువయిన ఖద్దరు చీర కట్టుకు పడివుండమనడం ధర్మమా! అలాగని ఖద్దరు చీరలుగాని బట్టలుగాని కట్టకూడదనికాదు, ఇష్టమయినవాళ్లు కట్టుగోవచ్చు, నిర్బంధించకూడదు! కాని చంద్రం అలాక్కాడు!

అతడికి తులాసాగా ఒక్కఘడియ కాలక్షేపం చేద్దామంటే తీరికలేదు. అస్తమానూ ఏదో ఒక పని, అదీ పనికొస్తుంది అనుకొనే పనికిరానిపని.

పట్టుదలగల మనిషి కాబట్టి ఎలాగో సాగుకొస్తున్నాడుగాని కమల పరిస్థితి మరీ విషమించిపోయింది. కోతిపిల్లసామ్యంలాగ అతనేం చేస్తే అది చెయ్యవలసి వచ్చింది. ఆఖరికి ఆమెకి జీవితంమీద విసుగూ, విరక్తి చిరాకూ, నిరాశ ప్రవేశించేయి. తన తోటి వాళ్లు యీ యీడులో యిలాగే వుంటున్నారా? జీవితంలో ఎంతో ముచ్చటగా, ఆనందంగా లోకాన్నీ శరీరాన్నీ మైమరచి సుఖించవలిసే రోజులన్నీ వృధాగా స్వయంకృతాపరాధంవల్ల పాడయిపోతున్నాయి. ఆ వయస్సులో మూడుపువ్వులూ ఆరుకాయలుగా వుండవలిసింది!

మొదట్లో వైవాహిక జీవితం, భర్తతో కాపరం, కొత్త స్నేహం అంటే ఏమిటో ఎన్నో కలలు కన్నది. కాని అవన్నీ చూస్తుండగాఅంతరించిపోయేలాగున్నాయి. జీవితం ఎంతచూసినా అంధకారంలా వుంది. రాత్రి పగలూ ఆమెకి అదే ఆలోచన పట్టుకుంది! తన జీవితాన్ని ఎలాగయినా యథారీతికి తీసుకురాగలదా? భర్త దృష్టి మరల్చగలదా? ఏమో అటు చంద్రాన్ని చూస్తే అతనికీ రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. తిన్న తిండి ఒంటికెక్కడంలేదు! అతివేడి చేసింది, శరీరం నల్లగా మారిపోయింది! దవడలు కళ్లు లోతుకి దించుకుపోయేయి. ఎప్పుడూ దీర్ఘరోగిలా వుంటున్నాడు!

ఇదంతా ఎందుచేతో కమలకి పూర్తిగా తెలుసు. అనవసరంగా బాధపడడం, వంటికి తెచ్చుకోడం దేనికని రోజూ చంద్రంతో చెబుతూనే వుంది! కాని - అతను వినడు.

ఆరోజు చంద్రం వంటకాలన్నీ సిద్ధం చేసి బయటకు వెళ్లేడు. కమలకు ఒక బుద్ధి పుట్టింది. మెల్లిగావెళ్ళి యింత వుప్పూ కారం, తీసుకొచ్చి, కూరల్లోనూ మిగతా వాటిల్లోనూ బాగా కలిపేసింది. అన్నం తీసుకుపోయి తిరిగి పొయ్యిమీదపెట్టి పావుఘంటసేపుంచి తీసేసింది. ఏమీ ఎరగని దానిలా చంద్రాన్ని భోజనానికి పిలిచింది. కథ పూర్తి అయినతర్వాత ప్రసాదంకోసం కనిపెట్టుగున్నట్లు మహా ఆత్రుతగా కూర్చున్నాడు. విస్తట్లో ఒకొక్కక్క పదార్థం వేస్తోంది. పేకాటలో ముక్కలన్నీ పంచిన తర్వాతగాని కొందరు తీసి చూసుగోరు చంద్రం అలాగే అన్నీ వడ్డించడం అయే వరకూ వున్నాడు. అన్నంగిన్నె తెచ్చింది ఆ అన్నం గరిటితో స్వాధీనం కాలేదు! సాక్షాత్తూ పరబ్రహ్మస్వరూపమయిన అన్నం తాలూకు అప్పటిస్థితి చూడగానే చంద్రానికి అనుమానం తగిలింది! ఆఖరికి గిన్నె బోర్లించి మీదని కొట్టగా కొట్టగా, వుసుక్కుని దిగజారింది సున్నవుండలాటి అన్నం ముద్ద. చంద్రం చెయ్యి చేసుకున్నాడు. అన్నంమాట చూడగానే నిశ్చయించుకున్నాడు. మిగిలినవి రుచిచూసేడు. అబ్బే! ఒకొక్కక్కటీ నాలికమీద పెడుతూంటే నైట్రికేసిడూ, పొటాసియంసైనేడూ ఇలాంటివిరాసుకుంటున్నట్టుంది. నాలిక అగుంట్లో లాక్కుపోతూంది! అవన్నీ అలాగే వుంచేసి కాస్త మజ్జిగ ఆ సాజ్జిలో పోసుకొని క్షుద్బాధ తీర్చుకున్నాడు.

అతనికి చాలా ఆశ్చర్యం వేసింది. తన వంటలో యిలా గెప్పుడూ అవలేదు! అసలు వంట నేర్చుగోనే కొత్తలోనయినా దేనిలోనూ అరుచి కలిగేట్టు వండలేదు! వండగా వండగా తన వంట తనకే ఏవగింపుగా వుందేమో! ఛా! ఛా!!—జిహ్వ ఒకటి మధ్యవర్తిగావుండి చెపుతున్నాది కదా! కమలని రుచిచూడమన్నాడు! ఆవిడ కూడా అదోలా ముఖంపెట్టి అన్నిటినీ అవతలకి నెట్టేసింది!...

చంద్రానికి చిన్నతనం అనిపించింది! దానికితోడు అతని అభిమానానికి ఆఘాతం తగిలింది. నోరెత్తి ఏమీ అనలేకపోయాడు! ఒక్కటే విచారం పట్టుకుంది! ఎందుకిలా అవాలి? మరిచిపోయి రెండోమాటు ఉప్పుకారం వాటిల్లో వేసేడనుకుంటే, అన్నం మాట? సరిగ్గా మగ్గేవేళకి దింపేశాడే! చంద్రానికి పట్టుదల లావయింది! కాని ఏం చెయ్యగలడు? ఏదో పొరపాటు జరిగివుంటుంది, లేదా తనెప్పుడో చూసుకోకుండా రాజుతున్న పొయ్యిలో నీళ్లుపోసి వుంటాడు!

కమలకి కారణం తెలుసుకాబట్టి అట్టే ఆలోచించలేదు. అన్ని వస్తువులూ అలాగే పారపోసింది...తను అనుకొన్నది నెరవేరితే కొన్నాళ్లపాటు తన ఆరోగ్యం భర్త ఆరోగ్యం సరిఅయిన తిండిలేక పాడయినా సరే ఒప్పుకుంటుంది. ఆఖరికి యిదొక్కటే వుపాయంలా కనిపించింది ఆమెకి. కాని—చంద్రానికి పట్టుదల, పంతం లావయింది. ఆ మర్నాడు అతిజాగ్రత మహాజాగ్రతగా పాకశాస్త్రాన్ని పాకంతీసి సాగదీసి మరీ వదిలేడు. కాని భోజనాల వరకూ అక్కడే కూర్చోడు కదా, వేరే బట్ట కట్టుకుందికయినా వెళ్లాలి! అయినా వండడం అంటే తన పనిగాని వడ్డించడం కమల

పనేగా! ఎలాగయినా ఖందుచేసుకోగలదు. ఇంతకీ యీ పని కమల చేస్తున్నదని అనుమానమయినా కలగలేదతనికి.

అన్నీ పాడుచేస్తే ప్రయత్నపూర్వకమే అని తెలిసిపోతుందని కమల ఆనాడు కొన్నిటిని మాత్రమే నోట్లో పెట్టలేనట్టు చేసింది. చంద్రానికి క్రిందటిరోజుకన్నా ఎక్కువ విచారం పట్టుకుంది దానితో కోపం లావయింది! ఎవరిని ఏమనడానికీ వీలులేక ఆ కోపం, అహంభావం, అంతా దుఃఖం కింద మారింది. కాని అది సహించేడు—ఎంతో జాగ్రత్తపడినా యిలా ఎందుకయిందని మనసులో కృంగిపోయేడు. కమలని నాలుగయిదుసార్లు కారణం అడిగేడు. ఆమె తెలియనట్టే జవాబు చెప్పేసింది; ఆవేళ సరిగ్గా భోజనం తినలేదు, సహించక లేచి వెళ్ళిపోయేడు.

కమల చెదరలేదు, మొగుడలా అర్థాకలితో వెళ్ళిపోయినా సహించి తన ప్రయత్నంమాత్రం మానలేదు! యిలా రోజూ ఏదో ఒకటి చెడిపోతూంటే, తన గొప్పదనం, శక్తి చూస్తూ చూస్తూండగా పోతున్నట్టయింది చంద్రానికి. తనమీద, తన వంటమీద విసుగూ చికాకూ అసహ్యం పుట్టనారంభించింది: సంపూర్ణసిద్ధి పొందిన శిల్పి, ఒక్కసారిగా అకారణంగా తయారుచేస్తున్న శిల్పాలన్నీ పాడవుతూంటే అతనికి ఎలా వుంటుంది? తన చేతిలో శిల్పం ఏమయిపోయిందని, అహో రాత్రాలూ, ఆలోచిస్తూండిపోడా?

ఇరవయినాలుగ్గంటలూ విసుక్కోవడం చికాకుపడడం మొదలెట్టేడు. కాని ఎన్నాళ్ళిలా సరిఅయిన తిండి లేకండా వుంటారు? చంద్రానికి పూర్వపు నీరసంతోపాటు యిప్పుడు తిండిపుష్టి లేక శక్తి తగ్గిపోయింది. మనిషి పిచ్చెత్తినట్టున్నాడు! మనసు పాడయింది! ఇహ నీ వంటపిచ్చ వదిలిపోతే బావుండు ననిపించింది, చేద్దామన్నా శక్తి లేదు! కాని తనంతట తనే పురస్కరించుకొని కమలని వద్దని వంటపనికి నడుంకట్టేడుకదా? ఇప్పుడు తనే తిరిగి కమలతో ఆ సంగతి చెప్పగలడా? చింత చచ్చినా పులుపు చావదన్నట్టు, అతని అభిమానం ఒప్పుకుంది కాదు! కాని ఏ నిముషాన్ని తెగించి చెప్పేద్దామా? అని చూస్తున్నాడు! కమల యిది గ్రహించి అతని వైఖరీ, మనసులో జరుగుతున్న పోట్లాటకీ నవ్వుకుంటూ అతనిదగ్గరికి వచ్చింది.

"ఏమండీ అదే మనసులో పెట్టుకొని రోజూ సరిగ్గా తిండి కూడా తినడంలేదు. మరీ చిక్కిపోతున్నారు! పోనీ కొన్నాళ్లూరుకోరాదూ! నేను వండుతాను పథవ వంట, నేను లేనా ఎలాగో ఒకలాగ వండడానికి? ఒకదానిమీద పట్టుపట్టి దానిమీదే అతి జాగ్రత్త చూపిస్తే అప్పుడే అది ఎక్కువ పాడవుతుంది. అయినా మీకెందుకా బాధ? దానికోసం యింట్లో ఒకరు వుండగా? చదవగా...చదవగా...అన్నట్టు—మొదటివాడికి అతి తెలివి లావయిపోయి—రెండోవాడికి పనిలేక సోమరితనం లావయీ రెండువిధాలా చెడడం అవుతుంది. నా మాట వినండి" అని యెంతో అంత యిదిగా చెప్పింది.

ఎలాగో ఒకలాగ యీ బాధ వదుల్తే చాలని చూస్తున్న చంద్రం ఆవిడ మాటల్లో వెగటు, వెటకారం, ఎత్తిపొడుపులూ ఎన్నివున్నా ఏమీ అనలేక పైకిమాత్రం—"సరే అలాగే కానిద్దూ...ఒకరు బాగాచేస్తున్నారని ఓర్వలేకపోతే ఏమిటవుతుంది...ఆ పేరు నువ్వే పొందు!" అన్నాడు...ఇహ నతనితో మరేమన్నా ఘర్షణ తప్పదని కమల వూరుకుంది. తన హక్కులలో ఒకటి శాంతి మార్గంలో సంపాదించుకున్నందుకు—తన పద్ధతి ఫలించినందుకూ సంతోషించింది. ఇహ ప్రతీ విషయంలోనూ యీ పద్ధతే వుపయోగించడం మొదలెట్టింది. అయితే అదీ ఎంతో నేర్పుతోనూ అనుమానం కలగకుండానూ చేస్తోంది. అది మొదలు వంటపదార్థాల్లో మరి తంటా ఏర్పడలేదు చంద్రం మరి వంటజోలికి పోనూ లేదు! పూర్వం తను వంటచేసి తినేటప్పటికి సరిగ్గా వంటబట్టేది కాదు ఏదో తినాలికదా అని ఎంగిలి పడేవాడు కాని యిప్పుడు తిన్న తిండివల్ల ఫలితం కనబడుతూంది.

ఒకనాడు చంద్రం యథాప్రకారంగానే తను స్వంతంగా తీసిన దారంతో నేయించి తెచ్చిన గోనెలాటి నేత తాను ఒకటి కమలకి చూపెట్టేడు. తర్వాత ఒక చిలక్కొయ్యకు తగిలించి వుంచేడు...

కమలకి అదో మనోవ్యథ అయిపోయింది! ఆ బట్టని చూడగానే ఆమె శరీరం ఆమెకే బరువయినట్టుండేది. ఆ ఖద్దరులోనే సన్నంది తెస్తే కమల ఏమీ అనకపోనుగాని తను తెచ్చిన ముతకతానులోనే, చీరలకీ, చొక్కాలకీ, తువ్వాళ్ళకీ దుప్పట్లకీ, పంచలకీ, జాకెట్లకీ, చింపుగోని కట్టుగోమంటాడు. అతని కిష్టమయితే అతను అలా వుండొచ్చుగాని మరో వ్యక్తిని కూడా అలాగే వుండమని నిర్బంధిస్తేముట్టుగు చికాకే! అతని ముందర కమలేమీ అనలేదు.

ఆమర్నాడు, ఆబట్టని జాగ్రత పరచడానికని కమల విప్పిచూసింది! ఒకటి రెండుచోట్ల ఎలకలు కొట్టేశాయి.. కమలకి విచారం కలగలేదు సరికదా మరో ఆలోచన తట్టింది. వెంటనే ఆతానుని ఏభాగంకూడా పనికిరానట్టు అలాటి చిల్లులే పెట్టేసింది. ఎప్పటిలాగే చిలక్కొయ్యకు వుంచేసింది.

చంద్రంవచ్చి, అన్నిటికీ పనికి వచ్చినట్టు పంపకాలు చెయ్యడానికి తాను తీసేడు! యింకేంవుంది! ఎందుకూ పనికి రాకండా తాను తానంతా కన్నాలు పడిపోయింది! కమలకు చెప్పేడు. ఎలకలు కొటేశాయని. యిద్దరూ వాటిని కసిదీర తిట్టేరు. "తెచ్చి పెట్టిలో పెట్టలేకపోయారా?" అని కమల మీదుమిక్కిలి అడిగేటప్పటికి చంద్రం ఏమీ అనలేక వూరుకున్నాడు.

ఆ ఏడాదికి సరిపడ బట్టంతా వృధా అయింది! నష్టమయిపోయింది! మళ్ళీ కొనుక్కోపోతే తనకీ, భార్యకీ కూడా బట్టలు లేవు. తను కష్టపడి ఒడికిన నూలు అంతా కలిపి యీతాను నేయించేడు. మరి నూలు లేదు. ఇంక బజారులో కొనక తప్పదు! మళ్ళీ ఖద్దరే కొంటానని చెప్పేడు కాని కమల ఒప్పుకోలేదు, కొనడం యిష్టంలేకపోతే పూర్తిగా మానేయండిగాని ఆ బట్ట మరి కట్టలేనని చెప్పేసింది. చంద్రం ఏమీ చెయ్యలేకపోయాడు..ఆమెకి ఒక మంచి చీరకొని తెచ్చేడు. తనుమాత్రం మంచి రకం ఖద్దరు తెచ్చుకున్నాడు...

ఇది నాంది కాగానే మరి చంద్రం ఖద్దరు బట్ట కమలకి కొనలేదు...రాను రాను తనూ అప్పుడప్పుడు మిల్లుబట్టలు వాడేస్తున్నాడు.

ఈ రెండు సంఘటనలూ యిలా జరగడంతో చంద్రం పూర్తిగా మారిపోయేడు. యిప్పుడు కమల ఏం చెబితే అది చేస్తున్నాడు పూర్వపు పట్టుదల మంచిదికాదని అతనికి అర్థమయింది కాబోలు. ఆ తర్వాత వాళ్ళ బట్టలు చాకలాడు నాలుగు రేవులు వుతికితేగాని అసలు రూపు రాలేదు యింట్లో పై పనులు పనివాళ్లు చేసుకుంటున్నారు కాబట్టి కమలకీ చంద్రానికీ కాస్తమాటాడుకుందికి తీరుబడిఅయింది.

పాతబడిపోయిన ఖద్దరు బట్టలన్నిటినీ, చిల్లులుపడిన కొత్తతానుతో కలిపి కమల బొంత కూర్చింది...బొంత కుట్టేసింది

★

★ నా నిరాహార దీక్ష ★

(11-వ పేజీ తరువాయి)

కూడ సమాధానం రాలేదు. కాబట్టి అధైర్య పడకుండా ఓపిక పట్టడం తప్ప చేసే పని యేమీ లేకపోయింది ఈలోపల మా నారాయణ ఒక వార్త తెచ్చాడు.

"మీ మామగారు మొన్న మా నాన్నకు కనపడి, యీ చిన్న విషయంపైన నిరాహారదీక్ష బూనడం అనవసరమని, ఎప్పుడో ఒకప్పుడు తనే రేడియో కొని యివ్వతలచుకున్నాననీ చూచాయగా అన్నాడుట."

"ఆయన సంగతి నీకు తెలీదు. ఈ మాటలువిని మనం మోసపోకూడదు. ఆయన గాని ఆయన తరఫున వచ్చినవారు గాని హామీలిచ్చినా నాకు వాటితో పనిలేదు. ఆ రేడియోసెట్టు నా కళ్ళారా చూస్తేనేకాని దీక్ష విరమించను" అన్నాను.

"సరే! ఆ సంగతే టెలిగ్రాం ద్వారా కబురుచెయ్యి"

ఈవిధంగా రెండో టెలిగ్రాం పంపాను.

"మామగారికి,

నేను నిరాహారదీక్ష పూనుతున్నా నన్న సంగతి తెలిసికూడ, మీకు హృదయ పరివర్తన మేమీ కలగనందుకు చాల విచారిస్తున్నాను. ఈనాడు మధ్యాహ్నం 12 గంటల నుండి(భోజనానంతరం) నా నిరాహారదీక్ష ప్రారంభిస్తున్నాను. ఏ విధమైన హామీలు ఒప్పుకోనబడవు. రేడియో సెట్టు నాకళ్లారా చూస్తేనే తప్ప దీక్ష విరమించ దలచుకోన లేదు.—మీ అల్లుడు."

దీక్ష ప్రారంభించాను. రెండు రోజులు గడిచింది. సమాధానం లేదు. పత్రికలలో ఈవిషయమే లేదు. మా మిత్రులు అందరూ కూడి యీవిధంగా తీర్మానించి, ఆ తీర్మానాన్ని మా మామగారికి తంతిద్వారా అందజేశారు.

"మీ అల్లుడుగారు నిరాహారదీక్ష బూని యిప్పటికి రెండు రోజులయింది. డాక్టరు ప్రకటనప్రకారం $1\frac{1}{2}$ పౌనులు తగ్గారు. చాల బలహీనంగా ఉన్నారు వారి పరిస్థితి చాల ఆందోళనగా ఉన్నది చుట్టాలు గుంపులు గుంపులుగా వచ్చి మీ అల్లుడిగారి విషయమై ఖంగారు పడుతున్నారు. మీరు యీ విషయంపై తగిన చర్య వెంటనే తీసికొని రేడియోసెట్టు మీ అల్లుడిగారికి తెచ్చి దీక్షను విరమింప జేయగలరని ఆశిస్తున్నాము."

ఇంకా రెండు రోజులు సమాధానంలేదు తెల్లవారితే జన్మదినం. రేడియోసెట్టు రాలేదు నీరసంగా, మాట్లాడలేని స్థితిలో ఉన్నాను. చాలమంది మిత్రులు, శ్రేయోభిలాషులు దీక్ష విరమించమని కోరారు కాని నేను అంగీకరించలేదు.

జన్మదినం చాల విచారకరంగా సాగింది. ఆరోజు సాయంత్రం అయిదు గంటలకు మా మామగారు రేడియోసెట్టు తీసికొని వస్తున్నారన్న వార్త మాచాయగా తెలియవచ్చింది. కాని ఆవార్త ధృవపడే వరకు నేనుమాత్రం దీక్షను విరమించ తలచుకోలేదు రాత్రి ఏడున్నర గంటలకు మా మామగారు రేడియో సెట్టుతో సహా వచ్చారు. రేడియో కళ్ళారా చూచిన తరువాత నా నిరాహారదీక్ష విరమించానని తలఊపాను. ఆ మరుక్షణమే భోజనం చేశాను. ఆరాత్రి అల్లా మిత్రులయొక్క, చుట్టాలయొక్క, అభినందనాలతో కాలం గడిచింది. ఈ సందర్భములో నా నిరాహార దీక్ష జయప్రదంగా సాగించినవారికి, నాయందు సానుభూతి చూపినవారికి ఎంతయు కృతజ్ఞత ప్రకటించాను.

ఆ మరునాడు నేను నిరాహారదీక్ష మానిన సంగతి కూడ పత్రికలకు పంపాము దాన్ని కూడ యే పత్రిక ప్రకటించలేదంటే, యీ పత్రికలవారు నాకెంత అన్యాయం చేసిందీ పాఠకులు ఊహించుకోవచ్చు.

ఒక గంటతర్వాత నరసింహమూర్తి పిడుగువంటి వార్త తెచ్చాడు

"అంతా మోసం! మోసం! ఆ రేడియో కొన్నది కాగుట! ఊరికే ఒక పూట ఉంచుకొని తిరిగి పంపిస్తానని మీ మామగారు రేడియోషాపులో తెచ్చాడుట! ఆ రేడియో షాపువాడు మావాడే! వాడు యివ్వాళ రేడియో తిరిగి తీసుకవెళుతాడుట."

అందరం దిగ్భ్రాంతులం అయినాం.

"అయితే దీక్ష విరమించలేదు"అన్నాను కచ్చితంగా.

"ఈ దీక్షల విషయంలో యింకో ధర్మసూక్ష్మం ఉన్నది ఒక విషయంపై దీక్ష పూని మానివేసిన తరువాత ఆ విషయంపైనే తిరిగి దీక్ష పూనకూడదు"

"మరి యిప్పుడెట్లా తలయెత్తుకొని తిరిగేది ?"

"నీవు అసలు సంగతి మరచిపోయినావు. నీకు కావలసింది రేడియో కాదు. నిరాహార దీక్ష నెరవేరడం ఆ దృష్ట్యా ఆలోచిస్తే, నీ దీక్ష జయప్రదం అన్నాలి కొంచెము అనుభవం సంపాదించావు కాబట్టి యిక ముందు రాజకీయ రంగంలోకి దిగవచ్చు." ★

కర్నూలులో ఎండమావులు

(8-వ పేజీ తరువాయి)

తనకు తానే ఆ అధికారం కల్పించుకున్నాడని తేలింది అతని తెలివికి మెచ్చి రాజుగారు అతనికి మంత్రిత్వం ఇచ్చారని ప్రతీతి. అదీ కథ. ఆ కథ పేరు 'పిత్తల్ కా దర్వాజా.'

రాజధానిలో వాతావరణం చల్లబడే వరకు దేనినైనా స్పష్టంగా పరిశీలించాలంటే యీ వేడిగాలులు అడ్డు వస్తూనే ఉంటవేమోనని నా సందేహం.

—తూలికా భూషణ్.

విజ్ఞానవల్లరి

184. ద్రవ్యసంఖ్య :

పరమాణు కేంద్రకంలో న్యూట్రానులు ప్రోటానులు ఉన్నాయి కదా. ఏదైనా ఒక మూలద్రవ్య పరమాణు కేంద్రకంలో ఉండే ప్రోటానుల సంఖ్య ఎల్లప్పుడు సమానంగానే ఉంటుంది. కాని దానిలో ఉండే న్యూట్రానుల సంఖ్య మాత్రం వ్యత్యాసంగా ఉండడం కలదు. మాటవరుసకు క్లోరీన్ పరమాణు కేంద్రకంలో సామాన్యంగా 18 న్యూట్రానులుంటాయి. కాని 19 న్యూట్రానులను కలిగియున్న క్లోరీన్ పరమాణు కేంద్రకాలు కూడా కలవు. అయితే యీ రెండురకాల క్లోరీన్ కేంద్రకాలలోనూ ఉండే ప్రోటానుల సంఖ్యలో మాత్రం తేడాలేదు. 17 గానే అది ఉంటుంది. పరమాణు కేంద్రకానికి ద్రవ్యాన్ని మాత్రమే న్యూట్రానులు చేకూరుస్తాయి; దానికి రాసాయనిక గుణాలను వేనినీ అవి కలుగచేయలేవు ఇక ప్రోటానులు ద్రవ్యాన్ని, రాసాయనిక గుణాలను కూడా పరమాణుకేంద్రకానికి సమకూర్చగలవు. అందుచేత పరమాణు కేంద్రకంలో ఉండే న్యూట్రానులసంఖ్యలో తేడా ఉన్నప్పటికీ, సమాన సంఖ్య గల ప్రోటానులున్న పరమాణు కేంద్రకాలన్నీ సమాన రాసాయనిక లక్షణాలనే కలిగి ఉంటాయి. అంటే అవి ఒకే మూల ద్రవ్యానికి చెందుతాయి. ఈవిధంగా భిన్న సంఖ్య గల న్యూట్రానులున్నా సమాన సంఖ్యగల ప్రోటానులను కలిగియుండి, అందు మూలంగా సమాన రాసాయనిక లక్షణాలను కలిగియున్న ద్రవ్యాలను 'ఐసటోపులు' (*Isotopes*) అంటారు. ప్రతి మూల ద్రవ్యమూకూడా సాధారణంగా రెండో మూడో లేదా అంతకంటె ఎక్కువో కూడా ఐసటోపుల మిశ్రమై యుంటుంది. కాని ప్రతి మూలద్రవ్యంలోనూ విరివిగా ఉండే ఐసటోప్ ఒకటే ఉంటుంది. మిగిలిన వన్నీ చాల తక్కువ పాలులో ఉంటాయి. మాటవరుసకు క్లోరీన్ మూలద్రవ్యంవిషయమై ఆలోచిద్దాం. క్లోరీన్‌లో 18 న్యూట్రానులను కలిగియున్న క్లోరీన్ పరమాణు కేంద్రకాలంత విరివిగా 19 న్యూట్రానులను కలిగియున్న క్లోరీన్ పరమాణు కేంద్రకాలు లేవు.

ప్రోటాను ద్రవ్యపరిమాణము, న్యూట్రాను ద్రవ్యపరిమాణము సమానమనీ, పరమాణువుకు ముఖ్యంగా వానివలననే ద్రవ్యం చేకూరుతున్నదనీ లోగడ వివరించేం. ఒక ఐసటోప్ యొక్క మొత్తము ద్రవ్యము దానిలో ఉండే ప్రోటానుల యొక్కయు, న్యూట్రానుల యొక్కయు మొత్తము ద్రవ్యానికి సమానము. న్యూట్రాను, ప్రోటాను కూడా ఒక్క ప్రమాణం (*Unit*) గల ద్రవ్యాన్ని కలిగియున్నాయని మనం అనుకొంటే 18 న్యూట్రానులు, 17 ప్రోటానులు గల ఒక క్లోరీన్ ఐసటోప్ ద్రవ్యపరిమాణం 35 ఉంటుంది. అట్లే 19 న్యూట్రానులు 17 ప్రోటానులు గల మరియొక క్లోరీన్ ఐసటోప్ ద్రవ్యపరిమాణం 36 ఉంటుంది. న్యూట్రానుయొక్కగానీ ప్రోటానుయొక్కగాని ద్రవ్యాన్ని ఒక ప్రమాణంగా తీసికొన్నపుడు, ఆ ప్రమాణంలోనే క్లోరీన్ ఐసటోపుల ద్రవ్య పరిమాణాలు ఎంతెంత ఉంటాయో 35, 36 అనే సంఖ్యలు తెలియజేస్తాయి. ఐసటోపుల ద్రవ్య పరిమాణాలను తెలియజేసే సంఖ్యలు గాబట్టి వీనిని ద్రవ్యసంఖ్యలని (*Mass Numbers*) పేర్కొంటారు. ద్రవ్యాంకములని కూడా వానిని వ్యవహరించడం కలదు.

ఒక ఐసటోప్‌లో ఉండే న్యూట్రానుల యొక్కయు ప్రోటానుల యొక్కయు మొత్తము సంఖ్యను ద్రవ్యసంఖ్య తెలియజేస్తుంది. ఏదైనా ఒక మూలద్రవ్యంయొక్క ఐసటోప్‌ను పేర్కొనవలసివచ్చినపుడు ఆ మూలద్రవ్యంయొక్క పేరుకు ఆ ఐసటోప్ యొక్క ద్రవ్యసంఖ్యను చేరుస్తుంటారు. ఈ విధంగా ద్రవ్యసంఖ్యకూడా చేర్చడంవలన ఆ ఐసటోప్‌లో ఎన్ని న్యూట్రానులు ప్రోటానులు ఉన్నాయో అద్దం కట్టినట్లు కనిపిస్తుంది. మాటవరుసకు క్లోరీన్ - 35 అనే ఐసటోప్‌ను పరిశీలిద్దాం. క్లోరీన్ అని చెప్పేము కాబట్టి దాని పరమాణు కేంద్రకంలో 17 ప్రోటానులున్నాయని ముందు మనస్ఫురణకు వస్తుంది. ఆ తరువాత 35 లోనుంచి 17 ను తీసివేస్తే 18 వస్తుంది. కనుక ఆ ఐసటోప్‌లో 18 న్యూట్రానులున్నాయనే విషయం మనకు తెలుస్తుంది. అదే విధంగా యురేనియం - 235 లో 92 ప్రోటానులు, 143 న్యూట్రానులు, యురేనియం 238 లో 92 ప్రోటానులు, 146 న్యూట్రానులు ఉంటాయని మనకు విశదమౌతుంది.

—అనంత్.

చిట్టిప్రశ్నలకు జవాబులు

—'ఉష్ణం ఉష్ణేన శీతలం' అన్నది అయుర్వేద శాస్త్రంలోని మాట అనుకుంటాను. కళ్లు మంటలూ, పసుపు పచ్చగా మూత్రము ఉండుటా; ఈ లక్షణాలు వేడి చేస్తే కనబడతాయంటారు. అలాంటప్పుడు కొందరు వైద్యులు, సామాన్యముగా వేడి చెయ్యడానికి ఇచ్చే మందులను ఇవ్వడము కద్దు. 'వేడి'గాని పరిహారమైతే 'ఉష్ణం ఉష్ణేన శీతలం' అనవచ్చునుగదా ?

కారడవులలో చెట్లు రాపిడివల్ల అంటుకుని మండుతాయి. చెట్లఅల్లిక దట్టంగా వుండడముచేత అడవి చాలా భాగం కాలిపోతుంది. మంట వ్యాపించకుండా వుండడానికని, మంట జోరుగా వున్నచోటికి కొంతదూరాన్ని చెట్లుకొట్టివేసి కాళీచేసి, ఈ కాళీకి మంటకీ నడుమనున్న చెట్లను అంటిస్తారు. ఇది చిన్నమంట కనక కారుచిచ్చు రేగుతూన్నవైపునకే గాని, కాళీప్రదేశానికి అవతలి అంచుకి ఈ కాళీప్రదేశపు వెడల్పును దాటి వ్యాపించలేదు. ఈ చిన్నమంట పెద్దమంటవేపు జరుగుతుంది. పెద్దమంట ఇంక ఇటువేపు మండించవలసిన చెట్లు లేకపోవడమువల్ల చల్లారిపోతుంది. మరి 'ఉష్ణం ఉష్ణేన శీతలం' అయింది కాదా నారాయణగారూ.

—పాదరసము బంగారముతో చేరితే మిశ్రలోహము ఏర్పడుతుంది. కనకనే మీ ఉంగరము పాదరసము అంటినచోట తెల్లబడింది. బంగారముగాని మలినముగా ఉంటే పాదరసము అంత బాగా అంటుకుని మిశ్రలోహాన్ని తయారుచేయదు. బంగారము స్వచ్ఛమైనది. కగ్గిపోవడమూ, చిలుముగాని తుప్పుగాని పట్టడమూ గాని బంగారానికి లేవు. కనక మీ ఉంగరం తెల్లబడింది. అది పోగొట్టడానికి యత్నించడము కంటె కొన్నాళ్లలాగ ఊరుకోవడమే శ్రేయము. రాపిడివల్ల ఈ తెలుపు తగ్గిపోతుంది. అలాకాకుండు వెంటనే పోగొట్టాలంటారా నిప్పులో పడెయ్యండి ఉంగరము. తెలుపూ పోతుందీ, మెరుగూ పోతుంది. అలాగ ఊరుకుంటే మెరుగు అంతగా పోదు.

స్వర్ణకారులు ఆకురాతి రాపిడికి రాలిన బంగారపు పొడిని రాబట్టుకోడానికి పాదరస బిందువును బంగారపు పొడిరాలిన మట్టి ఇసకా మకిలిమీద అటూ ఇటూ పొరాడిస్తారు. బంగారము రసబిందువునకు అంటివచ్చేస్తుంది. తరవాత ఈ రసపు ముద్దను మూసలో వేసి నిప్పులో 'ఊది' బంగారమును తెచ్చుకుంటారు.

చిట్టిప్రశ్నలు జవాబులు

—చంద్రమండలములో గాలి లేదు. ప్రాణులూ లేవు.

—నీడ రెండుగా కనపడిందంటే రెండు దీపాలనుంచి వెలుతురువచ్చి ఆ వస్తువుమీద పండిదని అర్థము.

—రాత్రులందు మనము సూర్యుడు కన పడని భూభాగములో ఉన్నామన్నమాట. కనక సూర్యుడి వెల్తురు మనమీద పడదు. చంద్రుడు భూమికి దాదాపు 480000 మైళ్ల దూరంలో ఉన్నాడు. సూర్యుడి వెల్తురు చంద్రుడి మీద పడి మనకి వెన్నెలగా కన పడడానికి అభ్యంతర మేమిటీ ?

—సాయంకాలపు సూర్యబింబంనుంచీ మనకి వచ్చే వెల్తురు భూమిమీదనే సాగి వస్తూన్నప్పుడు, గాలిలో తేలియాడే ధూళి కణాలు సూర్యుని తెల్లని వెల్తురులోని నీలి కిరణాల్ని అనుపచ్చని కిరణాల్ని విరజిమ్మే స్తాయి. మన కంటిదాకా సాగివచ్చే సూర్యుని వెల్తురులో మిగిలి యెఱుపు రంగు కిరణాలు సూర్యుణ్ణి ఎఱ్ఱగా కాన్పిస్తాయి.

—పొగలోని బొగ్గుకణములు కంటికి అంటి, విజయద్రవ్యములు కనుక దురద మంట పుట్టిస్తాయి.

—ట్రంకుపెట్టెలకు చారలవంటి ముడ తలు చూడలేదా మీరు పెట్టెయొక్క రేకు అంత సులువుగా వంగిపోకుండానూ, ఈ ముడతలు, గూడ్సుపెట్టెలకీ ఇందుకే ముడతలు.

—కలలు మూడు రకాలు. ఆశలూ అను మానాలూ కలగాపులగమై పోయినవీ, పక్కలో ఏర్పడ్డ ముడతలు వంటికి ఒత్తి పాముల్లాగా, గెడకఱ్ఱలలాగా కనపడేవీ, రాబోయేవిషయాల్ని సూచనగా చెలిపేవీని. కాని ఫలానిది 'భవిష్య స్వప్న'మని తెలుసుకోడము దుస్సాధ్యము. ★

గ్రంథపరిచయము

మధురవాణి:—సినిమా కథల పక్ష పత్రిక; ఎడిటర్ గోటేటి విస్సంరాజు; వెల 0 1.0; చిరు నామా 'మధురవాణి—పాలకొల్లు'. మొదటి సంచిక 21-4-54 న వెలువడినది.

ధర్మజ్యోతి:—ఆంధ్ర బ్రహ్మసాధనా శ్రమ పక్షమున ప్రక టింపబడు మాసపత్రిక; సంపాదకులు: కొమరాజు హనుమంతరావు, తల్లాప్రగడ ప్రకాశరాయడు; విడిసంచిక నాలుగణాలు; సంవత్సరపు చందా 3 0 0; తెనాలినుండి వచ్చు ఈ పత్రిక మేనెల సంచిక మా కార్యాలయమునకు చేరినది.

ఏక శిల:—హనుమకొండ ప్రభుత్వో న్నత పాఠశాలవారు వెలువ రించిన వార్షిక సంచిక. ఇందులో పాఠ శాలోపాధ్యాయులు, విద్యార్థులు రచించిన పద్య గద్యరచనలు ఉన్నవి.

మచ్చు తునకలు:— కథల సం పుటి; రచయిత పి. వి. రత్నం; వెల 1-0-0; ప్రతుల కొరకు 'ఎవరెస్టు పబ్లికేషన్సు, కలంగి, పశ్చిమ గోదావరి జిల్లా' అని వ్రాయవలెను. ★

కలలో కోతి

(2-వ పేజీ తరువాయి)


ఇదంతా నాకు భయంగూడా వేస్తుంది. అందుకే నేను సినిమాకు పోతే సగంచూస్తాను. తరువాత యింటికి వెడదామంటే నాన్న ఒప్పుకోరు. అందువల్ల కుర్చీ ఆను కుని చల్లగా నిద్దరపోతాను.

"మామయ్యా నాకు ఇవ్వివద్దు మంచికథ గమ్మత్తుగా నవ్వువచ్చేది చెప్పు"మన్నాను. సరే మొదలు పెట్టాడు. అక్కా, నేనూ క్రమం తప్పకండా ఏకగ్రాంతుకతో వూ కొడుతున్నాము.

అయోధ్యానగరంలో సీతా, రాముడూ పట్టాభిషేకమయిన తరు వాత సుఖంగా వున్నారు. ఒక రోజున సీత, రాముడితో అన్నది. "ఏమండీ మీసేనకు మా పుట్టిల్లు గూడా ఒకమారు చూపించరూ" అని. సీత ఏదికోరితే తీర్చలేదు గనుక అందువల్ల వెంటనే హను మంతా! అని కేకేసి "ప్రయాణ సన్నాహం చెయ్యండి" అని ఆజ్ఞ యిచ్చాడు. సరే అందరూ బయలుదేరారు మిథిలానగరానికి. కూతురూ, అల్లుడూ వస్తున్నారని జనకుడు పెద్దపందిళ్లూ అవ్వీ వేయిం చాడు. సరే రాత్రిభోజనాలకు పందిళ్ళలో బారులుతీర్చి కూర్చు న్నారు వానరులంతా. భోజ నాలు సగందాకా అయినతరువాత పులుసు వడ్డించారు. చివర కూర్చున్న చిన్నకోతికి పులుసులో చిన్న వుండలాగా వచ్చింది. అది నొక్కింది. చింతపండు గింజపైకి ఎగిరిందిట.

"మామయ్యా గింజ ఎల్లా వచ్చింది పులుసులో" అన్నాను. "పొరపాటున చింతపండు పడ్డది. అది నొక్కితేగింజబయటకురాదూ" అన్నాడు మామయ్య. సరే తరు వాత. ఆగింజ ఎగిరేప్పటికి చిన్న కోతికి కోపంవచ్చి నేను క్రింద కూర్చుంటే గింజ పైకెగురుతుందా అని దానికన్న ఎత్తుగా తను ఎగి రింది. అక్కడనుండి సంగతి తెలుసు కోకండా బారులు తీర్చిన కోతు లన్నీ ఒకదానికన్న ఒకటి ఎత్తుగా ఎగురుతున్నవి. ఇంతలో హను మంతుడు, సముద్రందాటిన ఘనుడను నేను అందరికన్నా బాగా ఎగురుతానని బాగా పైకి ఎగురు తున్నాడు. పందిళ్లన్నీ పడిపోయి నవి. ఆ ప్రదేశమంతా యుద్ధభూమి లాగా తయారయింది. సీతకు నవ్వువచ్చి ఏమిసేన అండీ మీది కోతిమూక అని నవ్వడం మొదలు పెట్టింది. నాకూ, అక్కకూ గూడా పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వు వచ్చింది. అల్లా నవ్వుతోనే మాకు తెలియకండా నిద్రపోయా ము. తెల్లవారులూ హనుమంతుడు ఎగురుతున్నట్లే కల. ★

Edited. Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madra



లాల్‌బాగ్‌లో సర్పాకృతిలో
పెంచబడిన ష్రబ్ (బెంగుళూరు)

★


లాల్‌బాగ్‌లో పక్షిఆకారములో
పెంచబడిన ష్రబ్ (బెంగుళూరు)
ఫొటోలు :
దశిక రామలింగేశ్వరరావు.



అమ్మకమునకు సిద్ధముగా వున్నది!

ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు

విక్టర్ హ్యూగో రచించిన



నవలకు పుస్తకరూపంలో తెనుగు అనువాదం

అనువాదకులు: సూరంపూడి సీతారాం

(ఆంధ్రపత్రిక - సచిత్ర వారపత్రిక నుండి పునర్ముద్రితం

వెల: రూ. 1-8-0 ★ **పోస్టుఖర్చులు ప్రత్యేకం.**

విపీ కాపీకై నేడే వ్రాయండి.

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1.